ప్రభాత

# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A0100 | వాస్తవాలే వార్తలుగా..

14.8.2025 గురువారం Thursday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 66 | పేజీలు : 16 Pages : 16 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789

# హై అలర్ట్

## అప్రమత్తంగా ఉండండి.. అలసత్వం వలదు

- ప్రాజెక్టుల వద్ద 24 గంటలు పహారా పెట్టండి
- జీఓ 45 నిధులను వినియోగించండి
- యంత్రాంగానికి మంత్రి ఉత్తమ్ ఆదేశాలు



**హైదరాబాద్, ఆగస్టు 13:** రాష్ట్రంలో రానున్న మూడు, నాలుగు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో నీటి పారుదల శాఖాధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌నిర్వహించారు. ఈ మేరకు అన్ని విభాగాలకు సెలవులు రద్దు చేస్తున్నట్లుగా ప్రకటించారు. 'అప్రమత్తంగా ఉండండి.. అలసత్వం వలదు.. ప్రాజెక్టుల వద్ద 24 గంటలు పహారా పెట్టండి..

మిగతా 2 లో



అత్యవసర సేవలకు

# సిద్ధంగా ఉండాలి

## మంత్రి దామోదర ఆదేశం

ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అప్ర మత్తంగా ఉండాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. అత్యవ సర పరిస్థితుల్లో వచ్చే రోగులకు, గర్భిణులకు తక్షణమే వైద్య సేవలు అందించాలని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.



కోదండరాం, అలీఖాన్

# నియామకం చెల్లదు



గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం రద్దు

## సుప్రీంకోర్టు సంచలన తీర్పు


గవర్నర్ నియామకంపై దాసోజ్ శ్రవణ్ పిటిషన్

తదుపరి విచారణ సెప్టెంబర్ 17కు వాయిదా

- నేడు భారీ నుంచి అతిభారీ వర్షాలు
- రాష్ట్రంలో ఐదు రోజుల పాటు ఈదురు గాలులు
- వాతావరణ కేంద్రం డైరెక్టర్

# తెలంగాణకు రెడ్ అలర్ట్

వివరాలు 2వ పేజీలో






# తాళ్ల సాయంతో..

## గర్భిణిని వాగు దాటించిన పోలీసులు

**మంచిర్యాల, ఆగస్ట్ 13:** జిల్లాలో భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. తాండూరు మండలంలోని నర్సాపూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మారుమూల గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దొడ్డిగూడెంలో తొమ్మిది నెలల గర్భిణి యమునకు పురిటి నొప్పులు వచ్చాయి.

మిగతా 3లో

# ఆరు రోజుల్లో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు



రాఖీ సందర్భంగా మొత్తం 3.68 కోట్ల మంది రాకపోకలు

ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ వెల్లడి

03

సింధు జలాల ఒప్పందం ఆపితే


# తీవ్ర చర్యలు

## మర్చిపోలేని విధంగా గుణపాఠం చెబుతాం

## మరోమారు పాక్ ప్రధాని ప్రేలాపనలు

పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భారత్‌పై నోరు పారేసుకున్నారు. భారత్‌కు ఎన్నడూ మర్చిపోలేని గుణపాఠం చెబుతామంటూ హెచ్చరించారు.

04



మీరు దాడి చేస్తే.. బ్రహ్మోస్‌తో జవాబు

# చెబుతాం



పాక్ ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ ఓవైసీ

04



సావర్కర్, గాడ్సే భావజాలం

# వారితో ప్రమాదం

తనకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

02

సావర్కర్, గాడ్సే భావజాలాన్ని అనుసరిస్తున్న వారి నుంచి తనకు ముప్పు పొంచి ఉండొచ్చని రాహుల్ పుణె కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో తనకు అవసరమైన భద్రత అందించడం కేంద్రం బాధ్యత అని పేర్కొన్నారు.

పౌరసత్వం రాకుండానే

# సోనియాకు ఓటు

ఓటర్ జాబితాలో పేరుపై కాంగ్రెస్ సమాధానమివ్వాలి

బీజేపీ నేత అమిత్ మాలవీయ

03



పౌరసత్వం లభించకముందే సోనియాకు ఓటర్ల జాబితాలో పేరు ఎలా వచ్చిందని బీజేపీ ప్రశ్నించింది. దీనికి కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసింది.



ఈడీ విచారణకు

# మంచు లక్ష్మి

## బెట్టింగ్ యాప్స్‌పై ఈడీ అధికారుల విచారణ

.. వివరాలు 2లో

# రెండేళ్లయినా ఆరు గ్యారెంటీలేవీ



ఎక్కడికైనా వెళ్లి ప్రజలను అడుగుదామా?

డిప్యూటీ సీఎం భట్టికి కేటీఆర్ సవాల్

దాదాపు అన్ని గ్యారంటీలు అమలు చేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన ప్రకటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. దమ్ముంటే ఇదే మాట తెలంగాణలోని ఏదైనా ఒక గ్రామానికి వెళ్లి ప్రజలకు చెప్పాలని సవాలు విసిరారు. ఆ గ్రామం నుంచి వీళ్ళని తరిమి వేయకుంటే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాలు విసిరారు.

03



# కాళేశ్వరం జలాశయాలు నింపండి

వెంటనే మోటర్లు ఆన్ చేసి పంపింగ్ చేయాలి

మంత్రి ఉత్తమ్‌కు హరీష్‌రావు లేఖ

03

ప్రభాత
నేటి సాక్షి
TGTEL/25/A0100 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..



# తెలంగాణ ప్రభుత్వం చర్యలకు సుప్రీంకోర్టు అభినందన

**అన్ని వివరాలతో వస్తే ఫిర్యాదు అన్నీ ఉపసంహరిస్తామన్న ధర్మాసనం**



**న్యూఢిల్లీ,ఆగస్ట్13:** కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై బుధవారం సుప్రీంకోర్టులో మ-రోమారు విచారణ జరిగింది. కంచ గచ్చిబౌలి భూముల్లో పర్యావరణ పునరుద్దరణ చర్యలు చేపడుతున్నామని కోర్టుకు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. సమగ్ర ప్రణాళికను సమర్పించేందుకు ఆరు వారాలు గడువు కోరింది ప్రభుత్వం. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది సీజేఐ జస్టిస్ బీ.ఆర్ గవాయి ధర్మాసనం. అభివృద్ధికి తాము అడ్డుకాదని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. సుస్థిర అభివృద్ధి ముఖ్యమని సీజేఐ ధర్మాసనం పేర్కొంది. అభివృద్ధి చేసేటప్పుడు పర్యావరణ పరిరక్షణను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ సూచించారు. కంచ గచ్చిబౌలి భూముల్లో ప్రభుత్వ పర్యావరణ పరిరక్షణ చర్యలు మంచి ఫలితాలు ఇస్తే తప్పకుండా మెచ్చుకుంటామని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. గతంలో చేసిన వ్యాఖ్యలను కూడా ఉపసంహరించుకొని మరింతగా ప్రశంసిస్తామని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు.

# మీరు దాడి చేస్తే.. బ్రహ్మోస్‌తో జవాబుచెబుతాం

**పాక్ ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ ఓవైసీ**



**హైదరాబాద్, ఆగస్ట్ 13 :** తాము సింధూ జలాల కోసం ఎంత వరకైనా పోరాడతామన్న పాక్ ప్రధాని వ్యాఖ్యలపై మైదరాబాద్ ఎంపి ఓవైసీ ఘాటుగా స్పందించారు. ఈ హెచ్చరికలపై తాజాగా హైదరాబాద్ ఎంపీ, ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. అర్థంలేని మాటలు మాట్లాడొదంటూ ఫైర్ అయ్యారు. మీరు కయ్యానికి కాలు దువ్వితే మేము ఏం ఖాళీగా కూర్చొము అని సమాధానం ఇచ్చారు. మా వద్ద బ్రహ్మోస్ ఉన్నాయి. పాక్ ప్రధాని ఇలాంటి చెత్తమాటలు మాట్లాడటం మానుకోవాలంటూ హెచ్చరించారు. ఇలాంటి బెదిరింపులు భారత్ విషయంలో ఎంతమాత్రం పనిచేయవని స్పష్టం చేశారు. ఇక చాలు అయ్యిందేదో అయిపోయిందని అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. గతంలో పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ 'అణు' హెచ్చరికలు చేయడాన్ని కూడా ఒవైసీ తిప్పికొట్టారు. భారత్ విషయంలో ఆయన మాట్లాడిన మాటలు, వాడిన పదజాలం గర్హనీయమని అన్నారు. అమెరికా వేదిక నుంచి ఆయన ఈ మాటలు మాట్లాడటం దురదృష్టకరమన్నారు.

# ఈడీ విచారణకు మంచు లక్ష్మి

**హైదరాబాద్, ఆగస్ట్ 13:** బెట్టింగ్ యాప్ ప్రమోషన్ల కేసులో సినీ నటి మంచు లక్ష్మి బుధవారం ఈడీ విచారణకు హాజరైయ్యారు. బషీర్‌బాగ్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రాంతీయ కార్యాలయానికి ఉదయం 11 గంటలకు విచారణకు వచ్చిన మంచు లక్ష్మిని అధికారులు సుమారు మూడున్నర గంటల పాటు విచారించారు. విచారణ అనంతరం మంచు లక్ష్మి మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. బెట్టింగ్ యాప్ ప్రమోషన్లకు సంబంధించి తీసుకున్న పారితోషకం గురించి ఈడీ అధికారుల ఆరా తీసినట్లు తెలిసింది. ఇడి అధికారులకు మంచు లక్ష్మి తన బ్యాంకు ఖాతాల వివరాలను అందచేసినట్లు- సమాచారం. కాగా, మంచు లక్ష్మి వైఓఎల్ఓ 247 అనే బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేశారు. కాగా, బెట్టింగ్ యాప్‌లు ప్రమోట్ చేశారని సినీ నటులు, టీవీ హోస్ట్‌లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లపై రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 29 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మనీ లాండరింగ్ జరిగిందనే కోణంలో ఇడి ఎన్‌ఫోర్స్‌మెంట్ రిపోర్ట్(ఇసిఐఆర్) రిజిస్టర్ చేసింది. ఈ క్రమంలో వరుసగా సినీ నటులను విచారిస్తోంది. ఈ కేసులో ఇడి మరికొంత మందికి నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది.

# బీ అలర్ట్



మొదటి పేజీ తరువాయి

72 గంటలు ఆయా కేంద్రాలలో ఉండాలి. రెవెన్యూ, పోలీస్ అధికారులను సమన్వయం చేసుకోవాలి.. అత్యవసర పరిస్థితిల్లో జీఓ నెంబర్ 45 ప్రకారం నిధులను వినియోగించాలి.. పాలనాపరమైన అనుమతులలో జాప్యం వలదు.. కాల్వ కట్టలు తెగే సూచనలు గుర్తిస్తే తక్షణమే సమాచారం అందించాలి. విపత్తు సమయంలో ప్రతి నిమిషం విలువైనది. నిర్లక్ష్యాన్ని ఉపేక్షించే ప్రసక్తే లేదు' అని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టులు, ఆనకట్టలు, కాల్వలతోపాటు చెరువులపై నిఘా పెంచాలని సూచించారు. విపత్తు సూచనలు కనిపిస్తే అధికార యంత్రాంగాన్ని అలర్ట్ చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులపై ఎప్పటిక ప్పుడు సమీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో సహా అన్ని విభాగాల అధికారులతో నీటి పారుదల శాఖాధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర నీటి పారుదల శాఖ చీఫ్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, జాయింట్ సెక్రటరీ కే.శ్రీనివాస్, ఈఎన్సీ అంజద్ హుస్సేన్లతోపాటు ఆయా జిల్లాల సీఈలకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

# తెలంగాణకు రెడ్ అలర్ట్

**నేడు భారీ నుంచి అతిభారీ వర్షాలు**

**ఐదు రోజుల పాటు ఈదురు గాలులు**

**వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న**



**హైదరాబాద్, ఆగస్ట్ 13:** తెలంగాణ అంతటికీ రెండ్రోజుల పాటు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న తెలిపారు. రాష్ట్రంలో ఐదు రోజుల పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. ఉత్తర తెలంగాణలో 17న వర్ష తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో 4 రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని నాగరత్న తెలిపారు. సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు రెడ్ కలర్ వార్నింగ్ జారీ చేసినట్లు తెలిపారు. హైదరాబాద్, హనుమకొండ, ఆదిలాబాద్, జనగామ, కామారెడ్డి, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, నల్గొండ, రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ కలర్ వార్నింగ్ జారీ చేసినట్లు చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రమంతటా రేపు కూడా వర్షాలు కొనసాగే అవకాశం ఉందని నాగరత్న వివరించారు. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశాం. రేపు మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్ష తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఇవాళ జీహెచ్ఎంసీ పరిధిలో రెడ్ అలర్ట్.. రేపు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామని అన్నారు.

# అవసరమైతేే తప్ప.. బయటకు రావద్దు

**నగర ప్రజలకు హైడ్రా కమిషనర్ హెచ్చరిక**



**హైదరాబాద్, ఆగస్ట్ 13:** భారీ వర్షాలు కురుస్తాయంటూ వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అవసరమైతే తప్ప.. బయటకు రావద్దని హైదరాబాద్ నగర ప్రజలకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. బుధవారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు భారీ వర్షాలు కురవనున్నాయంటూ వాతావరణ శాఖ తెలిపిందని.. దీంతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఆయన సూచించారు. బుధవారం హైదరాబాద్‌లో రంగనాథ్ మాట్లాడుతూ.. ఎంతటి విపత్తు ఎదురైనా.. వాటిని ఎదుర్కొనేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, జలమండలి, విద్యుత్ అధికారుల సమన్వయంతో పని చేస్తున్నామని ఆయన వివరించారు. అలాగే లోతట్టు- ప్రాంతాల్లో భారీగా వరద నీరు వస్తే.. ప్రజలను రక్షించేందుకు బోట్స్‌తో సహా అన్నింటిని సిద్ధం చేశామని చెప్పారు. అయితే రాత్రి సమయంలో వర్షపాతం అధికంగా నమోదయ్యే అవకాశాలు ఉండడంతో.. రాత్రి నుంచి హైడ్రా బృందాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. నాలాల కబ్జాల కారణంగానే రహదారులపైకి భారీగా వరద నీరు వస్తుందని ఆయన తెలిపారు. ఇక ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో దాదాపు 400కి పైగా వాటర్ లాగింగ్ పాయింట్స్ ఉన్నాయన్నారు. అలాగే మేజర్ వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద ఇప్పటికే సిబ్బంది ఉన్నారన్నారు. ఒక వేళ భారీ వర్షాలు కురిస్తే.. సహాయక చర్యల్లో పాల్గొనాలని యువతకి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు.

# అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలి

**మంత్రి దామోదర ఆదేశం**



**హైదరాబాద్, ఆగస్ట్ 13:** రాష్ట్రానికి 3 రోజుల పాటు భారీ వర్ష సూచన ఉన్నందున ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి టెలీకాన్ఫరన్స్ నిర్వహించారు. హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు, ఆర్‌ఎంవోలు, మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్లు, సిబ్బంది ఈ మూడు రోజులు కచ్చితంగా హాస్పిటల్స్‌లోనే ఉండాలన్నారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు- చేసుకోవాలన్నారు. అందరి సెలవులు రద్దు చేయాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు, గర్భిణులకు తక్షణమే వైద్య సేవలు అందించాలని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టిమే-టె-డ్ డెలివరీ డేట్ దగ్గరగా ఉన్న గర్భిణులను హాస్పిటల్స్‌లోని బర్త్ వెయిటింగ్ రూమ్స్‌కు తరలించి సేవలందించాలన్నారు. అంబులెన్స్‌లు, 102 వాహనాలు అన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, ఎక్కడ ఎమర్జెన్సీ ఉన్నా తక్షణమే వెళ్లి పేషెంట్‌ను తరలించేలా డ్రైవర్లు, ఈఎంటీ-లను 24 గంటలు అందుబాటు-లో ఉంచుకోవాలన్నారు. హాస్పిటళ్లలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, పవర్ కట్ అయిన మరుక్షణమే జనరేటర్స్ ప్రారంభించి రోగులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఎలక్ట్రీషియన్లను 24 గంటలు హాస్పిటల్‌లో అందుబాటులో ఉంచుకోవా లన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో హాస్పిటల్స్ లోపలికి నీరు చేరకుండా, నిల్వ ఉండకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులంతా ఈ మూడు రోజులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

# వరుడిని భుజాలపై వాగు దాటించిన బంధువులు

**కరీంనగర్, ఆగస్ట్ 13:** వరద ఉధృతి కారణంగా పెళ్లికొడుకును భుజాలపై మోసుకెళ్లి వాగు దాటించారు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా గన్నేరువరంలో జరిగింది. పెళ్లికి వెళ్లాల్సిన వరుడు ఇవతలే చిక్కు పడడంతో ఈ రకంగా వాగు దాటించారు. ఊర చెరువు మత్తడి ప్రవాహం ఎక్కువై రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో బంధువులు వరుడిని మోసుకెళ్లి అవతలి ఒడ్డుకు చేర్చారు. లో లెవల్ కల్వర్టు సమస్యతో ఏటా వర్షాకాలంలో ప్రజలు ఇలాంటి ఇబ్బందులే ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.






# సావర్కర్, గాడ్సే భావజాలం వారితో ప్రమాదం

**తనకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే**

**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ**



**న్యూఢిల్లీ,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ):** వీరసావర్కర్ ను ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై పరువునష్టం కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే.. సావర్కర్, గాడ్సే భావజాలాన్ని అనుసరిస్తున్న వారి నుంచి తనకు ముప్పు పొంచి ఉండొచ్చని రాహుల్ పుణె కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో తనకు అవసరమైన భద్రత అందించడం కేంద్రం బాధ్యత అని పేర్కొన్నారు. 2023లో లండన్ పర్యటన సమయంలో సావర్కర్‌ను ఉద్దేశిస్తూ రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో సావర్కర్ మునిమనవడు సాత్యకి సావర్కర్ ఆయనపై పరువునష్టం దావా దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు- పోలీసులు గతంలో తేల్చారు. దీనిపై పుణెలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ ఇంకా ప్రారంభం కావాల్సి ఉంది. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ తరఫు న్యాయవాది కోర్టుకు తాజాగా ఓ వినతిపత్రం సమర్పించారు. తనకు నాథూరాం గాడ్సే, సావర్కర్ కుటుంబాలతో సంబంధం ఉందని సాత్యకి గతంలో వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆయన గత చరిత్రను దృష్టిలో పెట్టుకుని, ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. సావర్కర్, గాడ్సే భావజాలానికి మద్దతు ఇచ్చే వ్యక్తుల నుంచి రాహుల్ గాంధీకి ముప్పు పొంచి ఉండే అవకాశాలను కొట్టిపారేయలేం. ఇటు-వంటి పరిస్థితుల్లో ఆయనకు రక్షణ కల్పించడం రాజ్యాంగబద్ధమైన బాధ్యతని అందులో పేర్కొన్నారు. విచారణను ఆలస్యం చేయాలనే ఉద్దేశంతోనే రాహుల్ గాంధీ ఈ అప్లికేషన్‌ను దాఖలు చేశారని సాత్యకి సావర్కర్ ఆరోపించారు. అందులో పేర్కొన్న వాస్తవాలకు, ప్రస్తుత కేసుతో ఎటు-వంటి సంబంధం లేదని మీడియాతో అన్నారు. ఇదిలా ఉండగా.. ఈ కేసులో రాహుల్ గాంధీకి కోర్టు ఇప్పటికే బెయిల్ మంజూరు చేసింది.



ప్రభాత
నేటి సాక్షి
TGTEL/25/A0100 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
గురువారం
14 ఆగస్టు 2025
కరీంనగర్


# పౌరసత్వం రాకుండానే సోనియాకు ఓటు

- ఓటర్ జాబితాలో పేరుపై కాంగ్రెస్ సమాధానమివ్వాలి
- బీజేపీ నేత అమిత్ మాలవీయ





**న్యూఢిల్లీ,ఆగస్ట్13 :** భారత పౌరసత్వం లభించకముందే సోనియాకు ఓటర్ల జాబితాలో పేరు ఎలా వచ్చిందని బీజేపీ ప్రశ్నించింది. దీనికి కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసింది. భాజపా, ఎన్నికల సంఘం కలిసి ఎన్నికల్లో 'భారీ నేరపూరిత మోసానికి' పాల్పడ్డాయని కాంగ్రెస్ ఆరోపణలు గుప్పిస్తోంది. వాటిని కాషాయ పార్టీ తిప్పి కొట్టింది. ఎన్నికల్లో అవకతవకల గురించి భారీ ప్రసంగాలు, నిరసనలు చేపడుతున్న కాంగ్రెస్ పార్టీ గతంలో ఎన్నో మోసాలకు పాల్పడిందని భాజపా నేత అమిత్ మాలవీయ అన్నారు. కాంగ్రెస్ నేత సోనియా గాంధీ భారత పౌరసత్వం పొందకముందే ఓటర్ల జాబితాలో ఆమె పేరు ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఈ విధంగా పౌరసత్వం లేని వారికి ఓటు- హక్కు ఎలా కల్పించారో చెప్పాలని ప్రశ్నించారు. భారత ఓటర్ల జాబితాతో సోనియా గాంధీ పేరు చేర్చి అనేక ఉల్లంఘనలకు పాల్పడ్డారని మాలవీయ అన్నారు. 'భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందు ఎన్నికల జాబితాలో సోనియా గాంధీ పేరు ఉంది.. అప్పటికి ఆమె ఇటాలియన్. ఆ సమయంలో ఓటర్ల జాబితాలో ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ, మేనకా గాంధీలతో పాటు సోనియా గాంధీ పేరు కూడా చేర్చారు. ఈ విషయంపై 1982లో నిరసనలు వ్యక్తమవ్వడంతో ఆమె పేరును తొలగించారు. 1983 జనవరిలో తిరిగి చేర్చారు. ఆ ఏడాది ఏప్రిల్ 30న ఆమెకు భారత పౌరసత్వం మంజూరయ్యింది. ఈ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ప్రవర్తించింది. పౌరసత్వం లేని సోనియా గాంధీ పేరును ఓటరు జాబితాలో చేర్చి ఎన్నికల ఉల్లంఘనలకు పాల్పడిందని అమిత్ మాలవీయ ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలు.. మంగళవారం 'మింతా దేవి' అనే మహిళా ఓటరు ఫొటోతో ఉన్న టీ- షర్టులు ధరించి పార్లమెంట్ వెలుపల నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ చేసిన పని వల్ల మీడియా వాళ్లు తమ ఇంటికి వచ్చి ప్రశ్నల మీద ప్రశ్నలు సంధిస్తున్నారని మింతా దేవి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా తమ ఫొటోలను ఎలా ముద్రిస్తారని మండిపడ్డారు. దీనిపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ.. సాధారణ గృహిణికి సంబంధించిన వివరాలు, ఫొటోలను అనుమతి లేకుండా కాంగ్రెస్ నేతలు బయటకు ఎలా విడుదల చేశారని నిలదీశారు.

# గురుకులాలపై ఇంత దిగజారుడు విమర్శలా

600 కోట్ల గుడ్ల అవినీతిపై ఆధారాలు చూపగలరా

టెండర్ ప్రక్రియపూర్తి కాకుండానే మాట్లాడితే ఎలా

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యలపై మండిపడ్డ అడ్లూరి



**జగిత్యాల, ఆగస్ట్ 13:** గురుకులాలకు కోడిగుడ్ల సరఫరా చేసేందుకు జరిగిన టెండర్లలో రూ.600 కోట్ల అవినీతి జరిగిందంటూ బిఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మండిపడ్డారు. జగిత్యాల మెడికల్ కళాశాల అతిథి గృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ..కోడిగుడ్ల సరఫరాకు సంబంధించి టెండర్ పక్రియ జరుగుతోందని, టెండర్ పక్రియలో ఉండగా రూ.600 కోట్ల అవినీతి ఎలా జరిగిందో స్పష్టం చేయాలని నిలదీశారు. ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. తెలిసీ తెలియక మాట్లాడితే సహించేది లేదన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరోజైనా కెసిఆర్, మంత్రులు గురుకులాలకు వెళ్లి విద్యార్థుల కష్ట సుఖాలను తెలుసుకునే ప్రయత్నం చేశారా, వారితో కలిసి ఏనాడైనా భోజనం చేశారా అని నిలదీశారు. గురుకులాల్లో తరచూ ఫుడ్ పాయిజన్ ఎందుకు అవుతుందనే విషయంపై లోతుగా విచారణ చేపట్టి అల్యూమినియం పాత్రల వల్లే జరుగుతుందని గుర్తించామని అన్నారు. వాటి స్థానంలో రూ.7 కోట్లు- వెచ్చించి స్టీల్ వంట పాత్రలను అందించామని అన్నారు. గురుకులాలకు గత ప్రభుత్వం బకాయి పడ్డ రూ.400 కోట్లు- తమ ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. బకాయి లేనివి లేకుండా చేసేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి గురుకులాల బకాయిలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు- వివరించారు. జిఓ 17 గురించి పూర్తి అవగాహన లేని ప్రవీణ్‌కుమార్ అవినీతి జరిగిందంటూ మాట్లాడటం చూస్తే ఆశ్చర్యం వేస్తోందని అన్నారు. ఆయనతో మాట్లాడించిన వారు కూడా వాస్తవాలు తెలుసుకోవాలని చురకలంటించారు. ఎస్సి, ఎస్టి, బిసి,మైనారిటీ- విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యనందించాలనే గొప్ప సంకల్పంతో తమ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇంటిగ్రేటేడ్ స్కూల్‌ను మంజూరు చేసిందని అన్నారు. రూ.200 కోట్లతో 25 ఎకరాల స్థలంలో అన్ని హంగులతో కూడిన భవనాన్ని నిర్మించేందుకు -టె-ండర్ పక్రియ చేపడుతున్నట్లు- తెలిపారు. తమది సంక్షేమ ప్రభుత్వమని, సంక్షేమ శాఖ మంత్రిగా గురుకులాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు- పేర్కొన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల ఎంఎల్ఎ డాక్టర్ సంజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు గాజెంగి నందయ్య, ఒరుగల శ్రీనివాస్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు

# సుప్రీం తీర్పుతో కళ్లు తెరవాలి

రాజ్యాంగ రక్షణకే తమ పోరాటం అన్న దాసోజు



**హైదరాబాద్, ఆగస్ట్ 13:** తెలంగాణలో గవర్నర్ కోటాలో ఇద్దరు ఎమ్మెల్సీ నియామకాలను సుప్రీంకోర్టు నిలిపివేస్తూ తీర్పు వెలువరిండాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ స్వాగతించారు. రాజ్యాంగాన్ని అతిక్రమించి పనిచేసే వారికి ఇదో హెచ్చరిక అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ అంశంపై తాను రెండేళ్ల పాటు- పోరాటం చేశానన్నారు. ఇది వ్యక్తులపై పోరాటం కాదని.. రాజ్యాంగ బద్ధ హక్కుల కోసం చేసిన పోరాటమని ఆయన అభివర్ణించారు. రాజ్యాంగ బద్ధంగా ప్రభుత్వాలు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరికి తగినట్లు- వారు రాజ్యాంగాన్ని అనువదించుకొని అమలు చేయడం సరి కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కేసు విషయంలో సెప్టెంబర్ 17వ తేదీన మరోసారి విచారణ జరగనుందని గుర్తు చేశారు. అయితే తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి తన రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇక గతంలో తన అభ్యర్థిత్వాన్ని గవర్నర్ తిరస్కరించారని చెప్పారు. ఈ నేపథ్యంలో ధర్మం గెలిచినట్లుగా తాను భావిస్తున్నానని తెలిపారు. గతంలో హైకోర్టు తమ నియామక నిర్ణయాన్ని సైతం తప్పుబడుతూ తీర్పు ఇచ్చిందని తెలిపారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన పాత ఆర్డర్‌ను తీసుకు వచ్చి.. ఈ ఇద్దరితో ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయించారని వివరించారు. సుప్రీంకోర్టు ఆర్డర్ కాపీ పూర్తిగా వచ్చిన తర్వాత మిగతా వివరాలు తెలుస్తాయన్నారు. సెప్టెంబర్ 17వ తేదీన సుప్రీంకోర్టు ఏం చెప్తుందో చూడాలని తెలిపారు. భవిష్యత్తులో ఏ గవర్నర్ కూడా ఇలాంటి తప్పిదాలు చేయకుండా సుప్రీంకోర్టు ఆర్డర్ ఇవ్వబోతుందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ స్పష్టం చేశారు. 2024 ఆగస్టు 14న సుప్రీంకోర్టు తీర్పులో మార్పులు చేసిందని గుర్తు చేశారు.

# ప్రతికూల వాతావరణ పరిస్థితులు

శంషాబాద్‌కు రావాల్సిన ఐదు విమానాల దారిమళ్లింపు

**హైదరాబాద్, ఆగస్ట్ 13:** శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు రావలసిన ఐదు విమానాలను అధికారులు దారిమళ్లించారు. పలు ప్రాంతాల నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు రావాల్సిన మూడు విమానాలను విజయవాడకు మళ్ళించిన అధికారులు.. మరో రెండు విమానాలను తిరుపతి, బెంగళూరుకు మళ్ళించారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో వాతావరణం అనుకూలించకపోవడంతో దారి మళ్లించినట్లు- తెలిపారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్నాయి. గత మూడు రోజులుగా తెలంగాణతో పాటు- ఏపీలో పలు జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. ప్రధాన రహదారులు చెరువుల్లా తలపిస్తున్నాయి.తెలంగాణ, ఏపీల్లో పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. చెరువులు, కుంటలు ఉప్పొంగి పొర్లుతున్నాయి. రానున్న మూడు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి , ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, ములుగు, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్ , యాదాద్రి భువనగిరి జిల్లాల్లో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రెడ్ అలెర్ట్ జారీ చేసింది ఐఎండీ.

# 6 రోజుల్లో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు

- రాఖీ సందర్భంగా మొత్తం 3.68 కోట్ల మంది రాకపోకలు
- ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ వెల్లడి





**హైదరాబాద్, ఆగస్ట్ 13:** రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీ బస్సులను మహిళలు పెద్ద ఎత్తున వినియోగించు కున్నారని.. ఆరు రోజుల్లో మొత్తం 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించగా.. అందులో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు ఉన్నాయని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. రాఖీ పండుగ రోజున 45.62 లక్షల మంది మహిళలు ప్రయాణించగా.. ఈ నెల 11న అత్యధికంగా 45.94 లక్షల మంది రాకపోకలు సాగించారని పేర్కొన్నారు. ఒక్కరోజులో ఇంతమంది మహిళలు ప్రయాణించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. గత ఏడాది రాఖీకి 2.75 కోట్ల ప్రయాణికులను గమ్యస్థానా లకు చేసిందని, ఈ ఏడాది 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించారన్నారు. గతేడాదితో పోలిస్తే 92.95 లక్షల మంది ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని.. ఈ ఏడాది 2.28 కోట్ల కిలోమీటర్లు ఆర్టీసీ బస్సులు తిరిగాయన్నారు. గత ఏడాదితో పోల్చితే 53 లక్షల కిలో మీటర్లను అదనంగా సంస్థ బస్సులను తిపిందని చెప్పుకొచ్చారు. రాఖీ పౌర్ణమికి మహాలక్ష్మి పథకాన్ని మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకుని ఉచితంగా రాకపోకలు సాగించడంపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం హర్షం వ్యక్తం చేశారు. అన్నాచెల్లెల్ల బంధం ఎంత గొప్పదో ఈ రాఖీ గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. సంస్థ సామర్థ్యాన్ని అంతా ఉపయోగిం చుకుని రాఖీ పండుగకు రికార్డుస్థాయిలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసిన ఆర్టీసీ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. రాఖీ పండుగను త్యాగం చేసి, భారీ వర్షాల్లోనూ నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో పనిచేశారంటూ ప్రశంసించారు. రద్దీలోనూ మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య పథకాన్ని విజయవంతంగా అమలు చేశారన్నారు. ముందస్తు ప్రణాళికతో పాటు- సిబ్బంది నిబద్ధతతో పనిచేయడం వల్లే రాఖీ పండుగకు లక్షలాది మంది ప్రయాణికులను క్షేమంగా సిబ్బంది గమ్యస్థానాలకు చేర్చారని టీ-జీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ తెలిపారు. ఈ రాఖీ పండుగ ఆపరేషన్స్ సంస్థలో సరికొత్త రికార్డులను నమోదు చేసిందని, ఈ నెల 11న ఒక్క రోజులో అత్యధికంగా 68.45 లక్షల మంది ప్రయాణించారని చెప్పారు. ప్రజారవాణా వ్యవస్థపై ప్రజల ఆదరాభిమానాలు ఎంతలా ఉన్నాయో చెప్పేందుకు ఈ రికార్డులే నిదర్శనమని చెప్పారు. ఆర్టీసీకి సహకరిస్తూ.. ప్రజా రవాణా వ్యవస్థను ఆదరిస్తోన్న, ప్రోత్సహిస్తోన్న ప్రయాణికులందరికీ సజ్జనార్ కృతజ్ఞతలు తెలిపారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు కింది జలాశయాలు నింపండి

వెంటనే మోటర్లు ఆన్ చేసి పంపింగ్ చేయాలి

మంత్రి ఉత్తమ్‌కు హరీష్‌రావు లేఖ

**సిద్దిపేట, ఆగస్ట్ 13 :** నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి హరీశ్‌రావు లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఉన్న జలాశయాలు నింపాలని అందులో విజ్ఞప్తి చేశారు. మధ్య మానేరు, అన్నపూర్ణ, రంగనాయక్‌సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ, బస్వాపూర్ జలాశయాలను నింపాలని కోరారు. రైతుల కోసం ఆరో ప్యాకేజీ వద్ద ఉన్న మోటార్లు ఆన్ చేయాలన్నారు. జలాశయాల్లో నీరు నింపకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. వెంటనే కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్లు నింపాలని లేఖలో పేర్కొన్నారు. రిజర్వాయర్‌లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల రైతులు ఆందోళనలో ఉన్నారని చెప్పుకొచ్చారు. ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లను వెంటనే నింపాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్యాకేజ్-6 వద్ద మోటార్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని కోరారు. కేసీఆర్ హయాంలో హమాలీ ఖర్చులు ఇచ్చి ఇంటికి యూరియా పంపించామని గుర్తు చేశారు. ఉదయం నుంచి రైతులు వచ్చి ఇబ్బందులు పడుతుంటే పట్టించుకొనే అధికారి లేరని అగ్రికల్చర్ అధికారులపై సీరియస్ అయ్యారు. పదేళ్లలో లేని కొరత.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పుడు ఎందుకు వచ్చిందని ప్రశ్నల వర్షం కురిపించారు. ఎరువుల కొరత మూమ్మాటికీ ఈ బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యమేనని విమర్శించారు. పదేళ్లలో కేసీఆర్ హయాంలో ఎరువుల ఇబ్బంది లేదని చెప్పుకొచ్చారు. ఈ ప్రభుత్వం రైతుల పట్ల చిన్న చూపునకు నిదర్శనమని ఆక్షేపించారు హరీష్‌రావు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# రెండేళ్లయినా ఆరు గ్యారెంటీలేవీ

ఎక్కడికైనా వెళ్లి ప్రజలను అడుగుదామా

డిప్యూటి సిఎం భట్టికి కెటిఆర్ సవాల్



**హైదరాబాద్, ఆగస్ట్ 13:** డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం తన ఎక్స్ ఖాతా వేదికగా విమర్శలు గుప్పించారు. అందులోభాగంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఆరుగ గ్యారెంటీల వాగ్దానం గుర్తుందా? అని ప్రశ్నించారు. 100 రోజులు కాదు.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు 2 సంవత్సరాలు అయినా ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను ఇంకా నెరవేర్చలేదంటూ మండిపడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేశామని తెలంగాణలోని ఏ గ్రామానికైనా వెళ్లి చెప్పగలరా? అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కేటీఆర్ తన ఎక్స్ ఖాతా వేది కగా సూటిగా ప్రశ్నించారు. ఇప్పటికే అబద్దాలు చెప్పిన మీ నాయకులను ప్రజలు వెంబ డిస్తున్నరని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు- క్యాబినె ట్ మంత్రులంతా తెలంగాణలో ఎక్కడికైనా వెళ్లి.. తమ ప్రభుత్వం ఆరు హామీలు నెరవే ర్చామని చెప్పాలని ఆయన సూచించారు. మీ అబద్ధాలు, తప్పుడు ప్రచారాలపై ప్రజలు మిమ్మల్ని తరిమికొట్టక పోతే.. నేను రాజకీయాలను విడిచి పెడతానంటూ డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కేటీఆర్ సవాల్ విసిరారు.

# తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష

అధునాతన ప్యాకేజీ కంపెనీకి దక్కని అనుమతి

కేంద్రం తీరుపై మంత్రి శ్రీధర్ బాబు అసహనం



**హైదరాబాద్, ఆగస్ట్ 13:** తెలంగాణకు వచ్చే కంపెనీలకు అనుమతి ఇచ్చే విషయంలో కేంద్రం వివక్ష చూపుతోందని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. బుధవారం మంత్రి మాట్లాడుతూ.. ఏపీకి కొత్త ప్రాజెక్టులు కేటాయించి, తెలంగాణను మాత్రం పక్కన పెడుతోందన్నారు. ప్రపంచస్థాయి అధునాతన ప్యాకేజింగ్ కంపెనీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, ఇందుకోసం మహేశ్వరంలో 10 ఎకరాల విలువైన భూమిని కేటాయించడంతో పాటు-, రాయితీలు ఇచ్చేందుకు ఆమోదిస్తూ అన్ని అనుమతులను రికార్డు స్థాయిలో పూర్తి చేశామన్నారు. అయినా కానీ, కేంద్ర క్యాబినెట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం లేదన్నారు. ఏపీలో మాత్రం ఇలాంటి ప్రాజెక్టుకే కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. అయితే అక్కడ ఇప్పటివరకు ఎలాంటి భూకేటాయింపులు జరగలేదని, ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమైనా వారికి అనుమతులు ఎలా ఇచ్చారంటూ ప్రశ్నించారు. కేంద్రం ఇలాంటి చర్యల వల్ల అంతర్జాతీయ పెట్టు-బడిదారులకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి రాజకీయ నిర్ణయాలు తెలంగాణ అభివృద్ధికి తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయని, కేంద్ర వ్యవహారశైలిని రాష్ట్ర ప్రభుత్వం తూర్పారబడుతుందన్నారు.

# తాళ్ల సాయంతో..

గర్భిణిని వాగు దాటించిన పోలీసులు

**మంచిర్యాల, ఆగస్ట్ 13:** జిల్లాలో భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. తాండూరు మండలంలోని నర్సాపూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మారు మూల గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతు న్నారు. దొడ్డిగూడెంలో తొమ్మిది నెలల గర్భిణి యమునకు పురిటి నొప్పులు వచ్చాయి. ఆమెను వాగు దాటించేందుకు కుటుంబసభ్యులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్సై కిరణ్ కుమార్.. పోలీసు సిబ్బంది, ఈతగాళ్లను ఘటనాస్థలికి పంపారు. వారు తాళ్ల సాయంతో గర్భిణిని వాగు దాటించి అంబులెన్సులో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె మగబిడ్డకు జన్మనిచ్చినట్టు- వైద్యులు తెలిపారు.

# కుక్కల తరలింపు తీర్పు పరిశీలిస్తా

■ సుప్రీం చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 13:** కుక్కల తరలింపు అంశపై సుప్రీం చీఫ్ జస్టిస్ సానుకూలంగా స్పందించారు. దీనిని సమీక్షిస్తానని వెల్లడించారు. ఢిల్లీ, ఎన్సీఆర్ ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటినీ తొలగించాలంటూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సుప్రీం తీర్పుపై జంతు హక్కుల సంస్థలు ఆక్షేపణ తెలిపా యి. ఈ నేపథ్యంలో తీర్పు ఉత్తర్వులను తాను పరిశీలిస్తానని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. వీధి కుక్కల దాడుల వల్ల ఢిల్లీ, ఎన్సీఆర్ల పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరుగుతోందని వస్తున్న వార్తలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ పార్దివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్లతో కూడిన ధర్మాసనం.. 8 వారాల్లోపు అన్ని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఢిల్లీలో ఎక్కడా వీధి కుక్కలు ఉండటానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ చర్యలను అడ్డుకోవడానికి ఏవైనా సంస్థలు ప్రయత్నిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. దీనిపై కేంద్ర ప్రభుత్వ వాదనలు మాత్రమే వింటామని.. తమ ఆదేశాలకు వ్యతిరేకంగా జంతు ప్రే మికులు, ఇతర పార్టీలు, సంస్థలు వేసిన పిటిషన్లను విచారించబోమని స్పష్టం చేసింది. కేంద్ర మాజీమంత్రి, జంతు హక్కుల కార్యకర్త మేనకా గాంధీ అభ్యంతరం తెలిపారు. తీర్పు ఆచరణ సాధ్యం కాదన్నారు. ఢిల్లీలో 3 లక్షల వీధికుక్కలు ఉన్నాయి. వీటికోసం 3 వేల షెల్టర్లు కావాలి. వీటి ఏర్పాటుకు 15వేల కోట్లు ఖర్చు చేసే పరి స్థితిలో ఢిల్లీ ప్రభుత్వం ఉందా? అని ప్రశ్నించారు. ఈ తీర్పు దశాబ్దాలుగా మనం అనుసరిస్తూ వచ్చిన మానవీయ, సైన్స్ ఆధారిత విధానాల నుంచి వెనకడుగు వేసినట్లుగా ఉందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. వీధి కుక్కలన్నిం టినీ గంపగుత్తగా తొలగించాలన్న నిర్ణయం క్రూరమైనద న్నారు. ప్రియాంకాగాంధీ, ప్రముఖ సినీనటులు జాన్ అబ్రహాం, జాన్వీ కపూర్, వరుణ్ ధావన్, సిద్ధార్థ్ ఆనంద్, అడివి శేష్ తదితరులు వీధి కుక్కల సంరక్షణపై స్పందించారు. దీంతో చీఫ్ జస్టిస్ గవాయ్ పెద్ద మనసుతో ముందుకు వచ్చారు. తీర్పును సమీక్షిస్తానని ప్రకటించారు.

## సంపాదకీయం



# పార్లమెంట్ సమావేశాలు ఎందుకు?

బీహార్లో ఓట్ల సవరణలో జరిగిన అవతవకలు వేరు.. పార్లమెంట్లో చర్చించాల్సిన అంశాలు వేరు. ఈ రెంటినీ ఒకే గాటన కట్టిన విపక్షాలు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను వృధా చేశాయి. సమస్యలపై చర్చించే అవకాశం ఉన్నా.. ప్రభుత్వాన్ని నిలదీసే ప్రయత్నం చేయలేదు. కేవలం ఆందోళనతో తాము అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు. పార్లమెంట్ను స్తంభింపచేయడమే అతిపెద్ద గోల్ అన్నట్లుగా విపక్షాల తీరు కొనసాగింది. దీంతో జూలై 21న ప్రారంభమైన పార్లమెంట్ సమావేశాల్లో ఒక్కటే చర్చ జరిగింది. ఆపరేషన్ సిందూర్ తప్ప మరో అంశం చర్చకు రాలేదు. దీనికి విపక్షాలదే బాధ్యత. వీలైనన్ని ఎక్కువ సమస్యలు, ముఖ్యంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను లేవనెత్తి చర్చించివుంటే బాగుండేది. ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలపై చర్చ జరిపించడం కోసం అధికారంలో ఉన్నవారు ఎప్పుడూ ముందుకు రారు. అయితే వాయిదా తీర్మానాల రూపంలో వాటిని ప్రస్తావిస్తే కుదరదు. పార్లమెంట్ నిబంధనల మే-రకు చర్చను కోరివుంటే బీహార్ ఓట్ల సవరణ అంశం కూడా చర్చకు వచ్చేది. కానీ విపక్షాలకు అలా చేయడం ఇష్టం లేదు. గందరగళం సృష్టిస్తేనే మంచిది. పార్లమెంటు సమావేశాలు ఒకప్పుడు అర్థవంతమైన చర్చలు, వాదోపవాదాలతో ఎంతో ఆసక్తి కలిగించేవి. ప్రధాన సమస్యలపై చర్చకు ప్రభుత్వాలు కూడా అనుమతించేవి. అయితే ఆనాటి నాకులు వేరు. వారు ఎంతో హుందాతనం కలిగిన వారు. కానీ ఇప్పుడు విపక్షాలకు సమస్యలపై చర్చ చేయడం కన్నా ప్రభుత్వం విమర్శలుచేశామా, పార్లమెంట్ నడవకుండా చేశామా లేదా అన్నదే ముఖ్యంగా కనిపిస్తోంది. అందుకే ఈ వర్షాకాల సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్పై తప్ప ఏ అంశంపైనా చర్చ జరగకుండా పోయింది. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పార్లమెంటులో ప్రభుత్వం ఏదైనా జవాబు చెబుతుందా అని ప్రతిపక్షాలతో పాటు ప్రజలు కూడా ఆశించారు. కానీ రెండు రోజుల సుదీర్ఘ చర్చ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుదీర్ఘ ప్రసంగం తర్వాత కూడా అనేక ప్రశ్నలకు జవాబులు లభించకుండా మిగిలిపోయాయి. ముఖ్యంగా పహల్గామ్ సంఘటనకు దారి తీసిన భద్రతా వైఫల్యం నుంచి ఆపరేషన్ సిందూర్ కేవలం 88 గంటల్లోనే ముగించిన తీరుపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయి. పాక్కు బుద్ధి చెప్పే అవకాశం వచ్చినా కాల్పుల విరమణకు అంగీకరించడం జరిగింది. ఇకపోతే ఈ ఆపరేషన్ తరవాత పాక్ పట్ల అమెరికా స్నేహంగా వ్యవహరించడం చూస్తున్నాం. సంఘటనకు కారకులైన ఉగ్రవాదుల ఆచూకీ, విదేశాంగ విధానం గురించి ప్రజల్లోను, ప్రతిపక్షాల్లోనూ ఉన్న ప్రశ్నలకు సమాధానాలు రాలేదు. ఇకపోతే బిహార్లో ఎస్ఐఆర్ పేరిట జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ గురించి ప్రతిపక్షాలు తీవ్ర గందరగోళం సృష్టిస్తున్న ప్పటికీ దానిపై మాట్లాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదు.ఎస్ఐఆర్పై గందరగోళం జరుగుతున్న సమయం లోనే ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ దేశంలో ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. గత పార్లమెంటు ఎన్నికల్లో కర్ణాటకలో ఒక అసెంబ్లీ నియోజకవర్గంలోనే లక్షకు పైగా బోగస్ ఓట్ల పోలింగ్ జరిగిందని ఆయన సాక్ష్యాధారాలతో బయటపెట్టారు. దేశంలో ఎన్నికల కమిషన్ బీజేపీని గెలిపించేందుకు చేసే ప్రయత్నాల్లో భాగంగానే ఈ ఓట్ల చోరీ జరుగుతోందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ పైనే కాదు, ఓట్ల చోరీపై కూడా ఉభయ సభల్లో ప్రతిపక్షాలు వాయిదా తీర్మానాలు ప్రవేశపెట్టి చర్చను డిమాండ్ చేశారు. అయితే ఈ అంశాలపైచర్చకు పార్లమెంట్ రూల్స్ ప్రకారం అవకాశం ఉంది. కానీ విపక్షాలు దానిని ఉపయోగించు కోలేదు. పార్లమెంటులో చర్చించి ఎన్నికల సంస్కరణలపై ప్రతిపక్షాలతో కలిసి ఏకాభిప్రాయం తెచ్చేందుకు ప్రయత్నిస్తే బాగుండేది. ఒక్క బీహార్ గురించి కాకుండా మొత్తం ఎన్నికల సంస్కరణలపై చర్చించి ఉంటే విపక్షాలకు గౌరవం దక్కేది. దేశానికి ప్రయోజనం కలిగేది. దొంగ ఓట్లు లేకుండా పర్మినెంట్ ఓటర్ల ముసాయిదా ఉండేలా చేయిం చుకునే అవకాశం ఉండేది. అయితే విపక్షాల లక్ష్యం వేరు కనక వారు ఆ దిశగా ఆలోచన చేయలేదు. పార్లమెంటును సాగనివ్వకపో వడం వల్ల ప్రతిపక్షాలకు ప్రయోజనం లభించక పోవచ్చు. ప్రతిపక్షా లు లేవ-నెత్తుతున్న ప్రశ్నలకు జవాబు ఎప్పలేకపోతే,పార్లమెంటును వాయిదా వేసివుంటే విపక్షాల వాదనకు ప్రజల్లో ఆమోదం లభిస్తుంది. ప్రభుత్వం ప్రజలకు జవాబుచెప్పుకోలేని పరిస్థితిలో పడుతుంది. ప్రతిరోజూ పార్లమెంటు ఆవరణలో ప్రతిపక్షాలు నిర్వహిస్తున్న నిరసన ప్రదర్శనలు, ఎన్నికల కమిషన్కు ఊరేగింపుగా వెళ్ళి అనేకమంది అరెస్టు కావడం వంటి సంఘటనలు కావాలని కోరుకున్నవే. విపక్షా లు గందరగోళానికి ప్రాధాన్యం ఇచ్చారే తప్ప సమస్య పరిష్కారం కోసం కాదన్నది ముమ్మాటికీ నిజం. మొత్తంగా పార్లమెంట్ సమావేశాలను విపక్షాలు కావాలనే దుర్వినియోగ పరిచారు. కేవలం రాజకీయ ప్రయోజనాలు ఆశించి చేసిన వ్యవహారం తప్ప మరోటి కాదు. ఇదే సమయాన్ని ప్రజల కోసం ఉపయోగిం చుకుని, ఆయా అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసి ఉంటే బాగుండేది. విపక్షాల తీరు కారణంగా జిఎస్టి, ధరలు,నిరుద్యోగం, అమెరికాతో సంబంధాలు వంటి అనేకానేక అంశాలు చర్చకునోచుకోకుండా పోయాయి. గత ఐదారేళ్లుగా ఇలాగే జరుగుతోంది. ఇది వాంఛనీయంకాదు. పార్లమెంట్ అన్నది ప్రజల సమస్యలను చర్చించడానికి అన్న విషయం మరచిపోతున్నారు. అధికార, విపక్షాలకు ఇదో తంతుగా మారింది. ప్రజలు ఏమయితే మనకేంటన్న ధోరణిలో ఉన్నారు. ఓట్లు వేశారా, అధికారంలో ఉన్నామా లేదా అన్న తీరుమారాలి. ప్రధాన సమస్యల విషయంలో ఇకముందు అయినా పద్దతి మారాలి.

# సుప్రీంకోర్టు సంచలన తీర్పు

- గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం రద్దు
- కోదండరాం, అలీఖాన్ నియామకం చెల్లదు
- గవర్నర్ నియామకంపై దాసోజ్ శ్రవణ్ పిటిషన్
- తదుపరి విచారణ సెప్టెంబర్ 17కు వాయిదా



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 13:** సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. గవర్నర్ కోటాలో నియమితులైన ఎమ్మెల్సీ కోదండరాం, అలీఖాన్ నియామకం రద్దు చేస్తూ.. సుప్రీం ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, సత్యనారాయణ పిటిషన్లపై విచారణ చేపట్టిన న్యాయస్థానం కోదండరాం, అలీఖాన్ నియామకం రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. రెండు ఎమ్మెల్సీ స్థానాలలో తాజా నామినేషన్లు తమ తుది తీర్పుకి లోబడే ఉంటాయని సుప్రీంకోర్టు చెప్పుకొచ్చింది. కోదండరాం, అలీఖాన్లు తెలంగాణ గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా నియామకం అయిన విషయం తెలిసిందే. అయితే వీరి నియామకం అక్రమంగా జరిగిందని.. దాసోజు శ్రవణ్, సత్యనారాయణలు గవర్నర్కు తెలిపారు. గవర్నర్ వీరి వాదనను తిరస్కరించడంతో.. సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వారి నియామకాలపై విచారణ జరిపి నియామకాన్ని రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంను కోరారు. ఈ మేరకు బుధవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. ఆగస్టు 14, 2024 తీర్పులో మార్పులు చేస్తూ.. వారి నియామకం చెల్లదని తీర్పును వెలువరించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్, అమిర్ అలీఖాన్ నియామకాలపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. వారి నియామకాలను నిలిపివేస్తూ తీర్పు ఇచ్చింది. తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపిక ఉండాలని పేర్కొంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం సవరించింది. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ప్రమాణస్వీకారం చేయడం తప్పు అని సుప్రీంకోర్టు పేర్కొంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక గవర్నర్ కోటాలో కోదండరామ్, ఆమిర్ అలీఖాన్ నియామకమైన విషయం తెలిసిందే. ఇద్దరిని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసింది. అయితే, దీన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ అప్పటి ఎమ్మెల్సీ అభ్యర్థులు దాసోజు శ్రావణ్, సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయా పిటిషన్లపై విచారించిన సుప్రీంకోర్టు.. ఎమ్మెల్సీలుగా కోదండ రామ్, ఆలీఖాన్ ప్రమాణ స్వీకారాన్ని తప్పుపట్టింది. గతంలో ఇద్దరు ఎమ్మెల్సీల ఎన్నికపై సుప్రీంకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపిక ఉండాలని మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం సవరించింది. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ప్రమాణస్వీకారం చేయడం తప్పని సుప్రీంకోర్టు పేర్కొంది. ఉత్తర్వులు జారీ చేస్తామని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహత ధర్మాసనం స్పష్టం చేసింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రభుత్వం ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రావణ్, సత్యనారాయణను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసింది. వీరిద్దరిని అభ్యర్థిత్వాలను అప్పటి గవర్నర్ తమిళసై తిరస్కరించారు. గవర్నర్ అభ్యర్థిత్వాలను తిరస్కరించడంతో శ్రావణ్, సత్యనారాయణ ఇద్దరూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల అనంతరం 2024 జనవరి 13న ప్రొఫెసర్ కోదండ రామ్, అలీఖాన్ పేర్లను రేవంత్‌రెడ్డి సర్కారు ప్రతిపాదించింది. గవర్నర్ వీరిద్దరి అభ్యర్థిత్వాలను ఆమోదించారు. గవర్నర్ నిర్ణయంపై హైకోర్టును ఆశ్రయించారు. కోదండరామ్, అలీఖాన్ నియామకాలను హైకోర్టు రద్దు చేసింది. ఆ తర్వాత మరోసారి రేవంత్ సర్కారు మళ్లీ అవే పేర్లను గవర్నర్‌కు సిఫారసు చేసింది. గవర్నర్ ఆమోదంతో ఇద్దరు ఎమ్మెల్సీలుగా నియామకమయ్యారు. గవర్నర్ నిర్ణయంపై ఆగస్టు 4న దాసోజు శ్రవణ్, సత్యనారాయణ ఇద్దరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గవర్నర్ కార్యాలయం సైతం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం కోదండ రామ్, ఆలీఖాన్ ప్రమాణస్వీకారాన్ని తప్పుపట్టింది. అయితే ఈ విషయంపై తాజాగా ఎమ్మెల్సీ ఆమిర్ అలీఖాన్ స్పందించారు. సుప్రీం కోర్టు ఈ విధమైన తీర్పు ఇస్తుందని అనుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. కోర్టు ఆర్డర్ చదివిన తర్వాత అన్ని మాట్లాడుతానని పేర్కొన్నారు. లాయర్ కాల్ చేసి సుప్రీం కోర్టులో జరిగిన విషయాలు చెప్పారని వివరించారు. తాను మొన్నటి వరకు జర్నలిస్టును అని ఎలాంటి రాజకీయం బ్యాక్ గ్రౌండ్ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనతో ఇంకా ప్రభుత్వ పెద్దలు మాట్లాడలేదని అలీఖాన్ స్పష్టం చేశారు.

# బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై విచారణ

### ఎక్కువ ధ్రువీకరణ పత్రాలకు అనుమతి మంచిదే

### విచారణ సందర్భంగా సుప్రీం వ్యాఖ్య

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 13:** బీహార్‌లో ఓటర్ల జాబితాను సవరించాలనే ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం మరోసారి విచారించింది. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఏడు ధ్రువీకరణ పత్రాలకంటే.. ప్రస్తుతం 11 పత్రాలను అనుమతించడం ఓటర్లకు ప్రయోజనకరంగా ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆధార్ మినహా అనేక ఇతర డాక్యుమెంట్లను పరిగణలోకి తీసుకోవడాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. గతంలో బిహార్‌లో నిర్వహించిన రివిజన్‌లో ఏడు ధ్రువీకరపత్రాలను అనుమతించారని.. ప్రత్యేక సవరణలో 11 డాక్యుమెంట్లను ఈసీ అనుమతి ఇస్తుందని.. దీన్ని పరిశీలిస్తే ఓటర్లకు అనుకూలంగానే కనిపిస్తుందని ధర్మాసనం తెలిపింది. ఆధార్ అనుమతించడం లేదనే పిటిషనర్ల వాదనను అర్థం చేసుకున్న ప్పటికీ అనేక పత్రాలను పరిగణలోకి తీసుకుంటున్నట్లుగా ధర్మాసనం గుర్తు చేసింది. అయితే, ఈ వాదనలతో పిటిషనర్ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ విభేదించారు. ధ్రువపత్రాల సంఖ్య ఎక్కువగా ఉన్నా.. అందరికీ అందుబాటులో లేవని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాస్‌పోర్టులను ఉదహరించారు. బిహార్‌లో కేవలం ఒకటి నుంచి రెండుశాతం మంది వద్దే పాస్ పోస్టులు ఉన్నాయన్నారు. దీనికి స్పందించిన ధర్మాసనం 36లక్షల మందికి పాస్‌పోర్టులు ఉన్నాయని.. ఇది మంచి సంఖ్యగానే కనిపిస్తోందని చెప్పింది. ఆయా ప్రభుత్వ విభాగాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్న తర్వాతే ధ్రువపత్రాల జాబితా రూపొందిస్తారని జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ తెలిపారు. ఇదిలా ఉండగా.. ఈ అంశంపై మంగళవారం సైతం సుప్రీంకోర్టులో విచారణ జరిగిన విషయం తెలిసిందే. పౌరులను చేర్చడం, కానివారిని ఓటరు జాబితా నుంచి మినహాయించడం ఎన్నికల కమిషన్ అధికార పరిధిలోనిదని ధర్మాసనం పేర్కొంది. సర్‌లో ఆధార్, ఓటర్ కార్డును పౌరసత్వానికి రుజువుగా పరిగణించలేమన్న ఈసీ వాదనలను సమర్థించింది. పార్లమెంట్ లోపల, వెలుపల 'సర్' అంశంపై వివాదం పెరుగుతున్న నేపథ్యంలో.. ఈసీ చేపట్టిన ఈ కార్యక్రమంపై విశ్వాసం కోల్పోవడమే సమస్య అని.. అంతకు మించి ఏమీ లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.


# సింధు జలాల ఒప్పందం ఆపితే తీవ్రచర్యలు

### మర్చిపోలేని విధంగా గుణపాఠం చెబుతాం

### మరోమారు పాక్ ప్రధాని ప్రేలాపనలు


**ఇస్లామాబాద్, ఆగస్ట్ 13:** పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భారత్‌పై నోరు పారేసుకున్నారు. భారత్‌కు ఎన్నడూ మర్చిపోలేని గుణపాఠం చెబుతామంటూ హెచ్చరించారు. నీటిని అడ్డుకుంటామంటూ బెదిరింపులకు దిగుతున్న ఈ శత్రువుకు నేను ఒకటే చెబుతున్నా.. మా నీటిలో మీరు ఒక్క చుక్కను కూడా తీసుకోలేరు. నీటిని అడ్డుకుంటున్నామంటూ మీరు బెదిరింపులకు దిగుతున్నారు. కానీ ఇలాంటి పని చేస్తే పాక్ మీకు ఎన్నటికీ మర్చిపోలేని విధంగా గుణపాఠం చెబుతుందని వార్నింగ్ ఇచ్చారు. ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని ఈ కామెంట్స్ చేశారు. సింధు నదీ జలాల పంపిణీ ఒప్పందం పాక్‌కు జీవనాడి అని పాక్ ప్రధాని అన్నారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఇటీవల పాక్ విదేశాంగ శాఖ.. ఒప్పందం అమలును కోరుతూ భారత్‌కు లేఖ రాసింది. 'సింధు నదీ జలాల ఒప్పందాన్ని ఎప్పటిలాగే అమలు చేయాలని భారత్‌ను కోరుతున్నాము. ఒప్పందానికి కట్టుబడి బాధ్యతలు నిర్వర్తించాలని కోరుతున్నామని పాక్ విదేశాంగ శాఖ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. ఈ నేపథ్యంలో పాక్ ప్రధాని మళ్లీ రెచ్చిపోయారు. ఇటీవల పాక్ ఆర్మీ చీఫ్ మునీర్, మరో నేత బిలావల్ భుట్టో భారత్‌పై యుద్ధోన్మాదంతో రెచ్చిపోతూ నోటికొచ్చినట్టు మాట్లాడారు. భారత్‌ను ఉద్దేశిస్తూ మునీర్ అణుయుద్ధ హెచ్చరికలు చేశారు. ఇక భారత్‌కు వ్యతిరేకంగా పాక్ ప్రజలు ఏకం కావాలని బిలావల్ భుట్టో పిలుపు నిచ్చారు.





# నగరంలోని గణేశ్ మండపాలన్నీ జియో ట్యాగ్

**హైదారాబాద్, ఆగస్ట్ 13:** గణేశ్ నవరాత్రుల సందర్భంగా సెక్టార్ ఎస్ఐలు తమ పరిధిలో ఏర్పాటు చేసిన మండపాల పూర్తి వివరాలు సేకరించి జియో ట్యాగింగ్ చేయాలని నగర సీపీ సీవీ ఆనంద్సూచించారు. మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బందోబస్తు ఏర్పాట్లపై అధికారులతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఇన్‌స్పెక్టర్‌లు మండపాల నిర్వాహకులతో తరచూ సమావేశాలు నిర్వహించి వారికి కావాల్సిన ఏర్పాట్లు- చేయాలని సూచించారు.





# ప్లేట్‌లెట్లను పెంచే ఆహారాలు ఇవి..

**వీటిని తీసుకుంటే జ్వరం కూడా త్వరగా తగ్గిపోతుంది..**

వర్షాకాలం నేపథ్యంలో చాలా మంది దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులతోపాటు దోమల వల్ల వచ్చే డెంగీ, మలేరియా వంటి జ్వరాలతోనూ బాధపడుతుంటారు. ఈ క్రమంలో సాధారణ దగ్గు, జలుబు అయితే కొన్ని రోజుల్లో తగ్గిపోతాయి. కానీ విష జ్వరాలు వస్తే డాక్టర్‌ను కలిసి చికిత్స తీసుకోవాల్సిందే. ఈ క్రమంలో డాక్టర్లు ఇచ్చే మందులను క్రమం తప్పకుండా వాడడంతోపాటు ఆహారం విషయంలోనూ పలు మార్పులు చేసుకోవాలి. దీంతో జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. అంతేకాకుండా జ్వరం కారణంగా శరీరంలో తగ్గిన ప్లేట్‌లెట్లు మళ్లీ ఉత్పత్తి అవుతాయి. దీంతో త్వరగా రికవరీ అవుతారు. తిరిగి ఉత్సాహంగా పనిచేస్తారు. సాధారణంగా డెంగీ వచ్చినప్పుడు మాత్రమే కాకుండా ఇతర విష జ్వరాలు వచ్చినప్పుడు కూడా ప్లేట్‌లెట్లు పడిపోతాయి. రక్తంలో ఉన్న వాటి సంఖ్య ఒకేసారి క్షీణిస్తుంది. దీంతో ఆరోగ్యం మరింత క్షీణిస్తుంది. ఈ దశలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడుతాయి. కనుక జ్వరం వచ్చినప్పుడు 2 రోజుల్లోగా తగ్గకపోతే వెంటనే డాక్టర్‌ను కలవాల్సి ఉంటుంది. వీలైనంత త్వరగా కలిస్తే ఇంకా మంచిది.

**బొప్పాయి పండ్లు..**


డెంగీ మాత్రమే కాకుండా విష జ్వరాలు ఏవి వచ్చినా సరే వారికి బొప్పాయి పండ్లు అద్భుతంగా పనిచేస్తాయి. ఈ పండ్లలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. అలాగే అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. తెల్ల రక్త కణాలు, ప్లేట్‌లెట్లు ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. దీంతో జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. అలాగే తిన్న ఆహారం సులభంగా జీర్ణమై అందులో ఉండే పోషకాలను శరీరం సులభంగా గ్రహిస్తుంది. దానిమ్మ పండ్లను ఆహారంలో భాగం చేసుకున్నా కూడా ప్లేట్‌లెట్ల సంఖ్య పెరుగుతుంది. ఈ పండ్లలోనూ అనేక పోషకాలు ఉంటాయి. ఇవి ప్లేట్‌లెట్లు ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. ఇన్‌ఫెక్షన్లను తగ్గేలా చేస్తాయి. దీంతో జ్వరం నుంచి కోలుకుంటారు. అలాగే ఆకుపచ్చ రంగులో ఉండే ఆకుకూరలతోపాటు కూరగాయలను కూడా తింటుండాలి. వీటిల్లోని విటమిన్ కె ప్లేట్‌లెట్లు అధికంగా ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. రోగం నుంచి త్వరగా కోలుకునేలా చేస్తుంది.

**వెల్లుల్లి రెబ్బలు..**

ప్లేట్‌లెట్ల సంఖ్య బాగా తగ్గిన వారు ఉదయం పరగడుపునే 2 పచ్చి వెల్లుల్లి రెబ్బలను తినవచ్చు. లేదా 1 టీస్పూన్ వెల్లుల్లి రసం తాగవచ్చు. దీంతోనూ ఫలితం ఉంటుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. బీట్‌రూట్ జ్యూస్ కూడా ఇందుకు అద్భుతంగా పనిచేస్తుంది. రోజూ ఉదయం ఒక కప్పు బీట్ రూట్ ముక్కలను తినాలి. లేదా బీట్ రూట్ జ్యూస్ తాగాలి. ఇది ప్లేట్‌లెట్లను తయారు చేయడమే కాదు, రక్తం వృద్ధి చెందేలా చేస్తుంది. రక్తహీనతను తగ్గిస్తుంది. శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. బీపీని అదుపులో ఉంచుతుంది. రోజూ ఒక క్యారెట్‌ను ఆహారంలో భాగం చేసుకున్నా కూడా ఎంతో మేలు జరుగుతుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచి ఇన్‌ఫెక్షన్లు తగ్గేలా చేస్తుంది. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. అలాగే కంటి చూపు సైతం మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.

**కిస్మిస్‌లు..**

కిస్మిస్‌లను రాత్రి పూట నీటిలో నానబెట్టి మరుసటి రోజు ఉదయం తింటుండాలి. వీటిల్లో ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రక్తం వృద్ధి చెందేలా చేస్తాయి. ప్లేట్‌లెట్ల సంఖ్యను పెంచుతాయి. దీంతో జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. ఉత్సాహంగా కూడా మారుతారు. శరీరానికి శక్తి లభిస్తుంది. డ్రై యాప్రికాట్ పండ్లను రోజుకు 2 సార్లు తింటుండాలి. ఇవి కూడా మనకు ఎంతో మేలు చేస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచి ఇన్‌ఫెక్షన్లను తగ్గేలా చేస్తాయి. ప్లేట్‌లెట్లు పెరిగేలా చేస్తాయి. ఖర్జూరాలను రోజుకు 3 చొప్పున తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. వీటిని తింటుంటే జీర్ణ సమస్యలు సైతం తగ్గిపోతాయి. ప్లేట్‌లెట్లను పెంచడంలో, రక్తం పెరిగేలా చేయడంలో కివి పండ్లు కూడా మేలు చేస్తాయి. నారింజ పండ్లను తింటున్నా, వాటి జ్యూస్‌ను తాగుతున్నా మేలు జరుగుతుంది.



ప్లేట్‌లెట్లు పెరుగుతాయి. ఇలా ఈ ఆహారాలను తీసుకుంటే ప్లేట్‌లెట్లను పెంచుకోవడంతోపాటు డెంగీ వంటి జ్వరాల నుంచి త్వరగా కోలుకుంటారు. ఆరోగ్యంగా ఉంటారు.

# టీ, కాఫీలు తాగేటప్పుడు వీటిని తింటున్నారా..?

**అయితే జాగ్రత్త..!**



చాలా మంది టీ లేదా కాఫీ తాగేటప్పుడు లేదా తాగడానికి ముందు పలు రకాల స్నాక్స్ తింటుంటారు. వాటిల్లో రస్క్ కూడా ఒకటి. ఈ మధ్య కాలంలో ఇది చాలా పాపులర్ అయింది. ఇంట్లో లేదా బయట ఎక్కడ టీ, కాఫీ తాగినా స్నాక్స్ లాగా రస్క్‌లను తింటున్నారు. అయితే వాస్తవంగా చెప్పాలంటే ఇవి ఆరోగ్యానికి అసలు ఏమాత్రం మంచివి కావని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రస్క్‌లను తినడం వల్ల ఆరోగ్యానికి హాని జరుగుతుందని అంటున్నారు. వీటిని మైదా పిండి, చక్కెర, నూనె, ఈస్ట్, కోడిగుడ్లు, పాల పొడి వంటివి ఉపయోగించి తయారు చేస్తారు. అయితే రస్క్‌లు వాటిని తయారు చేసే విధానం వల్ల వాటిలో వాడే పదార్థాల్లో ఉండే పోషకాలను పూర్తిగా కోల్పోతాయి. ఈ క్రమంలో అలాంటి రస్క్‌లను తింటే తీవ్రమైన నష్టాలు ఉంటాయి.

**బరువు పెరుగుతారు..**

రస్క్‌లలో మైదా అధికంగా ఉంటుంది. ఇది ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదు. మైదాలో ఫైబర్, విటమిన్లు, మినరల్స్ అసలు ఏమాత్రం ఉండవు. అందువల్ల మైదాతో తయారు చేసే రస్క్‌లను తింటే రక్తంలో షుగర్ లెవల్స్ అమాంతం పెరుగుతాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఇది అసలు ఏమాత్రం మంచిది కాదు. డయాబెటిస్ లేని వారికి కూడా రస్క్‌లను తరచూ తింటే డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. కనుక వీటిని తినడం మానుకోవాలి. రస్క్‌లలో అధిక మొత్తంలో చక్కెర, హైడ్రోజినేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి మన ఆరోగ్యానికి హాని చేస్తాయి. అధికంగా బరువు పెరిగేలా చేస్తాయి. దీంతో బీపీ అధికమవుతుంది. గుండె జబ్బులు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. రస్క్‌లలో ఫైబర్ అసలే ఉండదు. ఇది జీర్ణ వ్యవస్థపై ప్రభావం చూపిస్తుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలను కలగజేస్తుంది. రస్క్‌లలో ప్రోటీన్లు కూడా ఉండవు కనుక వీటిని తింటే రోజు మొత్తంలో ఇతర సమయాల్లో ఆకలి ఎక్కువ అవుతుంది. దీంతో ఆహారం అధికంగా తింటారు. ఇది బరువు పెంచేలా చేస్తుంది. కనుక రస్క్‌లకు దూరంగా ఉంటే మంచిది.

**షుగర్ వస్తుంది..**

రస్క్‌లను తరచూ తినే వారికి షుగర్ వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటిని తింటే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు అధికంగా పెరుగుతాయి. ఆ లెవల్స్‌ను తగ్గించేందుకు క్లోమగ్రంథి అధికంగా ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తూ ఎక్కువగా పనిచేయాల్సి వస్తుంది. దీర్ఘకాలంలో ఇలాగే జరిగితే క్లోమ గ్రంథి ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని కోల్పోతుంది. దీంతో షుగర్ లెవల్స్ అధికంగా పెరిగిపోయి డయాబెటిస్ వస్తుంది. అలాగే రక్తంలో ఇన్సులిన్ లెవల్స్ మరీ అధికంగా ఉంటే ఆహారం కొవ్వుగా మారుతుంది. దీన్ని శరీరం నిల్వ చేసుకుంటుంది. దీని వల్ల దీర్ఘకాలంలో ఇన్సులిన్ నిరోధకత ఏర్పడుతుంది. ఇన్సులిన్ ఉత్పత్తి సరిగ్గానే ఉన్నా కొవ్వు కారణంగా శరీరం దాన్ని సరిగ్గా వినియోగించుకోలేదు. దీంతో షుగర్ లెవల్స్ అంతకంతకూ పెరిగిపోతాయి. చివరకు డయాబెటిస్‌కు దారి తీస్తుంది. రస్క్‌లను తినడం వల్ల ఈ ప్రమాదం పెరుగుతుంది కనుక వీటిని తినడం మానేస్తే మంచిది.

**జీర్ణ సమస్యలు వస్తాయి..**

రస్క్‌లలో క్యాలరీలు అధికంగా ఉంటాయి. పిండి పదార్థాలు, చక్కెర. కొవ్వులు అధికంగా ఉంటాయి. కనుక తరచూ వీటిని తింటే శరీరంలో చేరే క్యాలరీలు పెరిగిపోతాయి. కొవ్వు అధికంగా పేరుకుపోతుంది. దీని వల్ల బరువు పెరుగుతారు. రస్క్‌లలో ఫైబర్ ఉండని కారణంగా అవి సులభంగా జీర్ణం కావు. దీని వల్ల జీర్ణ సమస్యలు వస్తాయి. కొందరికి పొట్టలో తరచూ విపరీతమైన అసౌకర్యం ఏర్పడుతుంది. రస్క్‌లను తింటే దీర్ఘకాలంలో క్యాన్సర్ వచ్చే ప్రమాదం సైతం పెరుగుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. రస్క్‌లను తినడం వల్ల పోషకాహార లోపం సంభవించే అవకాశాలు కూడా ఉంటాయని చెబుతున్నారు. కనుక వీటిని తినడం పూర్తిగా మానేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చు. ఎలాంటి రోగాలు రాకుండా ఉంటాయి.

# పెసలతో మొలకలను ఇలా తయారు చేయండి..

## రోజూ తింటే ఎన్నో లాభాలు..!



ఆరోగ్యం కోసం మొలకలను రోజూ తినాలని పోషకాహార నిపుణులు, వైద్యులు తరచూ చెబుతుంటారు. మొలకలను తింటే అనేక పోషకాలు లభించడమే కాక, పలు వ్యాధులను సైతం నయం చేస్తాయి. ఈ క్రమంలోనే మొలకల్లోనే పెసర మొలకలు చాలా ముఖ్యమైనవని చెప్పవచ్చు. వీటిని త్వరగా మొలకలుగా తయారు చేయవచ్చు. రుచిగా కూడా ఉంటాయి. మొలకలను తయారు చేసేందుకు గాను 1 కప్పు పెసలను ముందుగా తీసుకోవాలి. వీటిని శుభ్రంగా కడిగిన తరువాత ఒక పాత్ర తీసుకుని అందులో నీళ్లను పోసి దాంట్లో పెసలను మునిగేలా వేయాలి. అనంతరం ఆ పెసలను కనీసం 8 నుంచి 12 గంటల పాటు నీటిలో నానబెట్టాలి. లేదా రాత్రంతా నానబెట్టాల్సి ఉంటుంది. అలా నానిన పెసలను తీసి ఒక శుభ్రమైన వస్త్రంలో వేసి ముడిలా కట్టాలి. అనంతరం ఆ పెసలను వెచ్చని ప్రదేశంలో ఉంచాలి. 24 గంటల తరువాత ఆ పెసలకు మొలకలు వస్తాయి.

**ఇలా చేయాలి..**

అలా మొలకలు వచ్చిన తరువాత పెసలను తీసి బాగా కడిగి తినాలి. నేరుగా తినలేమని అనుకుంటే వాటిని పెనంపై నెయ్యితో కాస్త వేయించి తినాలి. లేదా సలాడ్‌లా తయారు చేసుకుని కూడా తినవచ్చు. ఈ పెసలను సాయంత్రం సమయంలో స్నాక్స్‌లా తింటే ఎంతో రుచిగా ఉండడమే కాదు, రాత్రి పూట ఆహారం ఎక్కువగా తినకుండా ఉంటారు. దీంతో బరువు తగ్గడం సులభతరం అవుతుంది. పెసలను ఇలా ఎప్పటికప్పుడు తయారు చేసుకుని రోజుకు ఒక కప్పు మోతాదులో తినవచ్చు. లేదా ఒకసారి తయారు చేసి ఫ్రిజ్‌లో పెట్టి 2 లేదా 3 రోజుల వరకు రోజూ తినవచ్చు. ఇలా పెసలను తింటుంటే అనేక లాభాలు కలుగుతాయి.

**జీర్ణ వ్యవస్థకు..**

పెసలలో సంక్లిష్టమైన కార్బొహైడ్రేట్లు ఉంటాయి. ఇవి నెమ్మదిగా జీర్ణం అవుతాయి. అంతేకాదు, పెసలలో ఉండే పోషకాలను శరీరం సులభంగా శోషించుకోవాలంటే వాటిని మనం మొలకల రూపంలో తినాలి. దీంతో అనేక పోషకాలు లభిస్తాయి. పెసర మొలకలను ఉదయం లేదా సాయంత్రం తినవచ్చు. రాత్రి పూట తినకూడదు. తింటే గ్యాస్ సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయి. మొలకలను తినడం వల్ల ఫైబర్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మలబద్దకం తగ్గేలా చేస్తుంది. పెసలలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. కనుక నాన్ వెజ్ తినని వారికి ఇవి ఉత్తమ ఆహారంగా పనిచేస్తాయి. మొలకలను తింటే ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి కండరాలకు మరమ్మత్తులు చేసి శక్తిని అందిస్తాయి. కండరాల అభివృద్ధికి దోహదం చేస్తాయి. దీని వల్ల కండరాల నొప్పులు సైతం తగ్గిపోతాయి.

**బరువు తగ్గేందుకు..**

పెసర మొలకల్లో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా విటమిన్లు సి, ఎ అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తాయి. దీని వల్ల కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. శరీరంలో అంతర్గతంగా ఏర్పడే వాపులు తగ్గిపోతాయి. పెసలను తినడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. పెసర మొలకలను తింటుంటే షుగర్ లెవల్స్ సైతం నియంత్రణలో ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఇవి మేలు చేస్తాయి. కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నవారు మొలకలను రోజూ తింటుంటే కొద్ది రోజులకు కొలెస్ట్రాల్ పూర్తిగా నియంత్రణలో ఉంటుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా నివారించవచ్చు. ఇలా మొలకలను తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# కిస్మిస్‌లను అసలు రోజూ ఎన్ని తినాలి..?

## ఎలా తింటే ప్రయోజనాలు కలుగుతాయి..?

మనకు తినేందుకు అనేక రకాల డ్రై ఫ్రూట్స్ అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో కిస్మిస్‌లు కూడా ఒకటి. వీటినే ఎండు ద్రాక్ష అని కూడా పిలుస్తారు. వీటిని మనం స్వీట్ల తయారీలో ఉపయోగిస్తుంటాం. ఇవి ఎంతో రుచిగా ఉండడమే కాదు, అనేక పోషకాలను అందిస్తాయి. అయితే కిస్మిస్‌లను రోజూ నీటిలో నానబెట్టి తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు, వైద్యులు చెబుతున్నారు. కానీ కిస్మిస్‌లను అసలు రోజుకు ఎన్ని తినాలి.. అనే సందేహం వస్తుంటుంది. ఇందుకు వారు ఏమని సమాధానం చెబుతున్నారంటే.. కిస్మిస్‌లను పెద్దలు అయితే రోజుకు 50 గ్రాముల వరకు తినవచ్చు. నీటిలో నానబెట్టి తింటే పోషకాలు శరీరానికి సరిగ్గా లభిస్తాయి. పిల్లలకు అయితే 20 గ్రాముల మేర కిస్మిస్‌లను రోజూ నీటిలో నానబెట్టి తినిపించవచ్చు. దీంతో సులభంగా జీర్ణమవుతాయి.



**కొలెస్ట్రాల్ స్థాయిలకు..**

కిస్మిస్‌లను తినడం వల్ల మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. పలు వ్యాధులను నయం చేసుకోవచ్చు. వీటిల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది సహజసిద్ధమైన లాక్సేటివ్‌గా పనిచేస్తుంది. అందువల్ల కిస్మిస్‌లను తింటే పేగుల్లో మలం కదలికలు సాఫీగా జరుగుతాయి. దీంతో మలబద్దకం తగ్గిపోతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. రాత్రి పూట కిస్మిస్‌లను నానబెట్టి మరుసటి రోజు ఉదయం తింటే శరీరం చాలా వరకు పోషకాలను సులభంగా గ్రహిస్తుంది. అలాగే సులభంగా జీర్ణమవుతాయి కూడా. కిస్మిస్‌లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటు నియంత్రించేందుకు సహాయం చేస్తుంది. వీటిల్లో పాలిఫినాల్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఉన్న చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ను పెంచుతాయి. దీంతో గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది.

**శక్తికి, ఉత్తేజానికి..**

కిస్మిస్‌లను రాత్రి పూట నీటిలో నానబెట్టి వాటిని ఉదయం తింటే శరీరానికి తక్షణమే శక్తి లభిస్తుంది. బద్ధకం పోతుంది. యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. రోజంతా శరీరంలో శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. నీరసం, అలసట ఉండవు. ఎంత పనిచేసినా చురుగ్గానే ఉంటారు. కిస్మిస్‌లలో పిండి పదార్థాలు, గ్లూకోజ్, ఫ్రక్టోజ్ అనే సహజసిద్ధమైన చక్కెరలు ఉంటాయి. ఇవి తక్షణ శక్తిని అందించి ఉత్సాహంగా ఉండేలా చేస్తాయి. కిస్మిస్‌లలో ఫినాల్స్, పాలిఫినాల్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండడం కారణంగా ఇవి ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. శరీరంలో అంతర్గతంగా వచ్చే వాపులను తగ్గిస్తాయి. దీంతో గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**ఎముకల దృఢత్వానికి..**

కిస్మిస్‌లలో ఎముకల ఆరోగ్యానికి అవసరం అయిన అనేక పోషకాలు ఉంటాయి. క్యాల్షియం, మెగ్నిషియం, బోరాన్ అధికంగా ఉంటాయి. బోరాన్ వల్ల కిస్మిస్‌లలో ఉండే క్యాల్షియం, మెగ్నిషియంలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. దీంతో ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. వృద్ధాప్యంలో ఆర్థరైటిస్, ఆస్టియోపోరోసిస్ వంటి ఎముకల సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి. కిస్మిస్‌లలో ఐరన్ అధికంగా ఉంటుంది. ఇది ఎర్ర రక్త కణాలు ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. రక్తం తక్కువగా ఉన్నవారు సాధారణ కిస్మిస్‌లకు బదులుగా నలుపు రంగులో ఉండే కిస్మిస్‌లను నానబెట్టి తింటే ఇంకా ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. ఇలా కిస్మిస్‌లను రోజూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

ప్రభాత
నేటి సాక్షి
TGTEL/25/A0100 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..


# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

- జోరుగా కురుస్తున్న వర్షాలపై సమీక్ష సమావేశం
- బడంగ్పేట్, మీర్పేట్, తుక్కుగూడ కమిషనర్లు కూడా అప్రమత్తంగా ఉండాలి.




**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం ఆగస్టు 13 :** రంగారెడ్డి జిల్లామహేశ్వరం నియోజకవర్గంలోని జల్పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో వర్షాల ప్రభావం, సమస్యల పరిష్కారంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. సభలో ఆమె మాట్లాడుతూ, అధికారులు వార్డు వారీగా వర్షం ప్రభావిత ప్రాంతాల పరిస్థితులను సమీక్షించారని తెలిపారు. ముఖ్యంగా ఉస్మాన్ నగర్, నబీల్ కాలనీ, శ్రీరామ్ కాలనీ వంటి చెరువుల పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏ సమస్య వచ్చినా వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని, విపత్కర పరిస్థితుల్లో ఒకరికి ఒకరు తోడుగా ఉండాలని ఆమె ఆదేశించారు. సానిటేషన్ సిబ్బంది, వార్డు అధికారులు ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజల కోసం అత్యవసర పరిస్థితుల్లో అమలు చేసే ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కమిషనర్ బి. వెంకట్రావు, డీఈ, మాజీ చైర్మన్ అహ్మద్ సాది, మాజీ వైస్ చైర్మన్ యూసఫ్ పటేల్, అలాగే ఎంఐఎం, టిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి మాజీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రీజియన్ బిఆర్సి యాజమాన్యుల శిక్షణ కార్యక్రమం



- ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన
- ఇన్పుట్స్ తయారీ విధాన శిక్షణ

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) తిరుపతి రూరల్ :** నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ కార్యక్రమంలో భాగంగా రాయలసీమ రీజియన్ (తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, నంద్యాల, కర్నూలు) జిల్లాల బిఆర్సి (బయో ఇన్పుట్స్ రిసోర్స్ సెంటర్) శిక్షణ కార్యక్రమం తిరుపతి జిల్లా రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నాలుగు రోజులు శిక్షణ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సాధికార సంస్థ తిరుపతి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం ఆధ్వర్యంలో జరుగుతుంది. శిక్షణ కార్యక్రమంలో బుధవారం మూడవ రోజులో భాగంగా తిరుపతి రూరల్ మండలం వేమూరు గ్రామంలోని అయ్యప్ప నాయుడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను బిఆర్సి యాజమాన్యులు 40 మంది సందర్శించారు. ఉదయం ఏటీఎం మోడల్ లో విత్తనాలు, పలు రకాల నారు నాటడం చేశారు. ప్రకృతి వ్యవసాయ విధానాల్లో భాగంగా ముఖ్యంగా ఇన్పుట్స్ తయారీలో భాగంగా బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం, దశపర్ని కషాయాలు మరియు పంచగవ్య తయారు చేయు విధానాలను ప్రత్యక్షంగా చేశారు. చెరుకులో వినూత్నంగా ప్రయోగంలో భాగంగా ఆకుకూరలు, కూరగాయలు విత్తనాలు నాటారు. పిఎండిఎస్ విత్తనాలను వెదజల్లారు. బిఆర్సి యాజమాన్లకు పూర్తిస్థాయిలో కషాయాలు తయారీ విధానాన్ని ప్రకృతి వ్యవసాయ రైతు అయ్యప్ప నాయుడు క్షుణ్ణంగా వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టు అడిషనల్ డి పి యం పట్టాభిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ మిషన్ ప్రకృతి వ్యవసాయం విస్తరణలో భాగంగా ప్రతి పంచాయతీలోనూ ఇంపుట్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్య ఉద్దేశంతో బి ఆర్ సి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నదని , బి ఆర్ సి యాజమాన్యులు ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ప్రత్యేక పాత్ర పోషిస్తారని ప్రతి ఒక్క రైతుకి ప్రకృతి వ్యవసాయ విధానాలు కషాయాలు గ్రూప్ ప్రమోటర్స్ గ్రామపంచాయతీ స్థాయినించే వృద్ధి చెందే విధంగా వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం పి ఎం ఎంటి సత్యనారాయణ, జిల్లా రిసోర్స్ పర్సన్స్ నాగరాజు, నరేంద్ర, బి ఆర్ సి యజమానులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ఘన స్వాగతం

- సిర్పూర్. కాగజ్నగర్.లో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ఘన స్వాగతం




**నేటి.సాక్షి కొమరం భీమ్ ఆసిఫాబాద్ ప్రతినిధి ఆగస్టు 13 :** సిర్పూర్. కాగజ్నగర్ లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను నియమించినందుకు గానూ బీఆర్ఎస్ అధ్యక్షుడు కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) మరియు కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు (కేటీఆర్)లకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సిర్పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీతో డాక్టర్ ప్రవీణ్ కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. స్వాగత కార్యక్రమంలో మాట్లాడుతూ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఈ గుర్తింపు నాకు మాత్రమే కాదు, సిర్పూర్ ప్రజలకు ఇచ్చిన గౌరవం. నన్ను కన్నబిడ్డలా ఆదరించిన సిర్పూర్ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఈ నియమనం ఆదివాసీ, రైతు, కూలీ, విద్యార్థి, నిరుపేద వర్గాలకు ఇచ్చిన గుర్తింపుగా భావిస్తున్నాను. అని ఆయన. అన్నారు. తనపై పార్టీ నాయకత్వం చూపిన నమ్మకానికి కట్టుబడి, బాధ్యతలను నిష్ఠగా నిర్వర్తిస్తానని ఆయన హామీ ఇచ్చారు. గత 50 ఏళ్లుగా సిర్పూర్ నియోజకవర్గం వలసవాదుల విషపు కోరల్లో చిక్కుకుని చితికిపోయింది. భవిష్యత్తులో సిర్పూర్.ను తెలంగాణలోనే నంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం. అని డాక్టర్ ప్రవీణ్ కుమార్ ప్రతిజ్ఞ చేశారు. బీఆర్ఎస్ పార్టీ సిర్పూర్‌లో తిరిగి అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ నాయకత్వంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలందిస్తామని ఆయన ఉద్ఘాటించారు. మాట తప్పేది లేదు, మడమ తిప్పేది లేదు. పెద్దవాగు నీళ్లలా మా హామీలు స్పష్టంగా, స్థిరంగా ఉంటాయి. అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో .బీఆర్ఎస్ నాయకులు, లింగోడే శ్యామ్ రావు. అర్షద్ హుస్సేన్. తెలంగాణ ఉద్యమకారులు తాజ్ బాబా. మోయిన్ టి ఆర్ ఎస్. ముస్తఫీస్. బాబర్ ముస్తఫా నాజ్. కాగజ్నగర్ పట్టణ. కార్యకర్తలు, వివిధ మండల నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు. స్వాగతం పలికినారు.

# కార్పోరేట్స్ క్విట్ ఇండియా

## తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో



**నేటి సాక్షి, చేర్యాల:** భారత స్వాతంత్ర పోరాటం లో భాగంగా నాటి క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు భారతదేశ సంపదను కొల్లగొడుతున్న బడా కార్పొరేట్ పెట్టుబడిదారులారా భారతదేశాన్ని విడిచి వెళ్లిపోండి కార్పొరేట్స్ క్విట్ ఇండియా డిమాండును రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో , సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా వామపక్ష ప్రజాసంఘాల పిలుపుమేరకు సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రోజున చేర్యాల పాత బస్టాండ్ కూడలిలో కార్పొరేట్స్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేయడం జరిగింది. నాడు భారతదేశం స్వాతంత్రానికి ముందు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కబంధ హస్తాల్లో చిక్కుకొని దేశ ప్రజలు అనేక ఇబ్బందులను నిర్బంధాన్ని ఎదుర్కొన్నారని ఎందరో మహనీయుల పోరాట ఫలితంగా స్వాతంత్రం సిద్ధించి 77 సంవత్సరాలు అవుతున్నప్పటికీ దేశంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నేడు దేశ సంపదను కార్పొరేట్ బడా వ్యాపారులకు కట్టబెడుతూ నూటికి 80% గా ఉన్న రైతులు, వ్యవసాయ కార్మికులు, పారిశ్రామిక కార్మికులు సాధారణ ప్రజల పై అనేక రకాల ఆర్థిక భారాలు మోపుతూ నేడు కార్పొరేట్ లు శతకోటీశ్వరులుగా మారుతున్నారని సాధారణ ప్రజానీకం పేదలుగా, నిరుపేదలుగా దిగజారిపోతున్నారని కనీసం మూడు పూటలా పౌష్టిక ఆహారం దొరికే పరిస్థితి లేకుండా పోయిందని వ్యవసాయ రంగంలో నల్ల చట్టాలను తెచ్చి రైతుల భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని మరోపక్క దేశానికి సంపదను సృష్టించే విద్యుత్తు రంగాన్ని, రైల్వే రంగాన్ని, ఎల్ఐసి రంగాన్ని, బ్యాంకింగ్ రంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని, విద్యారంగాన్ని, వైద్య రంగాన్ని, విమాన రంగాన్ని, సముద్ర ఓడరేవుల రంగాన్ని, దేశ రక్షణ రంగాన్ని సైతం బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అప్పగిస్తూ ప్రజల మీద భారాలు మోపుతున్నదని స్వాతంత్రానికి ముందు రోజులే మళ్లీ నేడు పునరావృతమవుతున్నాయని ప్రజల నైతిక విలువలకు భంగం వాటిల్లే రకంగా వ్యవహరిస్తున్నారని ఈ విధానాన్ని భారతదేశ ప్రజలు మేధావులు, ప్రగతిశీల వాదులు ఖండించాలని రాబోయే రోజుల్లో భారత దేశ సంపదను కొల్లగొడుతున్న బడా కార్పొరేట్ లను భారత్ నుంచి వైదొలిగే రకమైన పోరాటాలకు సన్నద్ధం కావలసిన సమయం ఆసన్నమైందని కార్పొరేట్స్ క్విట్ ఇండియా పోరాటంలో రైతులు కార్మిక వర్గం ,వ్యవసాయ కూలీలు, ముందుండాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు కన్వీనర్ ఇప్పకాయల శోభ, పోలోజు శ్రీహరి, బుట్టి చందు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గొర్రె శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి బోయిని మల్లేశం, గుండ్ర రవీందర్, మల్లానీ ఎల్లయ్య, గర్నపల్లి చంద్రం, ఆముదాల రంజిత్ రెడ్డి, రైతు సంఘం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా మైదానానికి భూమి కేటాయింపు



**నేటి సాక్షి, జగిత్యాల ప్రతినిధి గుండ ప్రశాంత్ గౌడ్ :** గొల్లపెల్లి మండల యువకులు గతకొంతకాలంగా క్రీడా మైదానానికి స్థలం లేక తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందిస్తూ, రెవెన్యూ శాఖ మంత్రి మరియు జిల్లా కలెక్టర్‌లతో చర్చించి, క్రీడా మైదాన నిర్మాణం కోసం ఏడు ఎకరాల భూమిని కేటాయించారు. ప్రొసీడింగ్ పత్రాలను యువకులకు ఇటీవలే అందజేశారు బుధవారం రోజున క్రీడా మైదానానికి సంబంధించిన నిర్మాణ పనులను రాష్ట్ర ఎస్సీ ఎస్టీ, మైనారిటీ మరియు వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా ప్రతిభ ఉంది. వారికి సరైన వేదికలు కల్పించాలనే లక్ష్యంతోనే ఈ మైదానం ఏర్పాటు జరుగుతోంది. భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నరు.

# మాజీ ఎమ్మెల్యే కందాళ ఆర్థిక సాయం



**నేటి సాక్షి పాలేరు , ఆగస్ట్ 13 :** కూసుమంచి మండలం హట్యాతండ గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన మహిళ గూగులోత్ తిమ్మి అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైంది.. ఇటీవల తిమ్మి కూతురు భానుప్రియకు వివాహం నిశ్చయమవడంతో గురువారం పెళ్లి జరగాల్సి ఉంది ..కాని వివాహానికి కనీసం ఖర్చులకు లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న స్థానిక బిఆర్ఎస్ మండల నాయకులు వారి కుటుంబ పరిస్థితిని మాజీ ఎమ్మెల్యే కంధాళ ఉపేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళగా వెంటనే స్పందించి వివాహానికి 30 వేల రూపాయలు స్థానిక నాయకులతో వారి కుటుంబానికి అందజేశారు.. బారీ వర్షాల కారణంగా స్వయంగా రాలేకపోయినా నాయకుల ద్వారా సాయం అందేలా చొరవ తీసుకుని పెద్ద మనస్సు చాటుకున్నారు.. ఈ కార్యక్రమంలో కూసుమంచి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు వేముల వీరయ్య ,జిల్లా నాయకులు మల్లీడి వెంకన్న ,మాజీ సర్పంచ్ లు భానోత్ కిషన్ నాయక్, పడిశాల గోపి, గ్రామ శాఖ అధ్యక్షులు గండు లింగయ్య, సంద్ర బజార్, వడ్త్యా సైదులు నాయక్, సోషల్ మీడియా అధ్యక్షుడు వడ్త్యా బాలకృష్ణ, జగిత్యా నాయక్ , బాధావత్ సైదులు నాయక్ వడ్త్యా ఉపేందర్ స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించినమాజీ కౌన్సిలర్



**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం ఆగస్టు 13 :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జల్ పల్లి మున్సిపాలిటీ పరిధి జల్ పల్లి గ్రామంలో యంజాల అశోక్ కూతురు అశ్విని వివాహానికి హాజరైన మాజీ కౌన్సిలర్ బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు షేక్ అఫ్జల్ హాజరై వధువు వరులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో వై యాదగిరి. ఆర్ దానయ్య. వై శివకుమార్. రాకేష్ వై శంకర్ దర్శన్. శ్రీధర్. వై శ్రీనాథ్. తదితరులు పాల్గొన్నారు

# శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ముదిరాజులు

**నేటి సాక్షి, ఎండపల్లి(రియాజ్):** మండలంలోని గుల్లకోట గ్రామంలో పురాతన ప్రసిద్ధి చెందిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ముదిరాజ్ కులస్థులు దర్శించుకున్నారు. ప్రతియేటా శ్రావణ మాసం సందర్భంలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం వారి అనావాయితి. ఈ సందర్భంగా ముదిరాజ్ కుల సంఘ పెద్దలు మాట్లడుతూ.. తరతరముల నుండి వస్తున్న అనావాయితిలో భాగంగా బుధవారం వెంకటేశ్వర స్వామిని దర్శించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకుని, కుల సంరక్షణతో పాటు గ్రామంలో ప్రజలందరు పాడి పంటలతో సుఖసంతోషంగా వర్ధిల్లాలని భగవంతున్ని వెడుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుల సంఘం నాయకలు ఇండ్ల తిరుపతి, చొప్పరి రాజయ్య, దగ్గు శంకరయ్య, జైనపురం లాలయ్య, రవి, ముది రాజ్ సంఘ యువ నేత చొప్పరి తిరుపతి, నర్సింగం, దాసరి రాజేష్, జైనపురం తిరుపతి, శ్రీను కుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాత
నేటి సాక్షి
TGTEL/25/A0100 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
గురువారం
14 ఆగస్టు 2025
కరీంనగర్




# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ సత్తా

## టాప్ 2లోకి రోహిత్ శర్మ




టీమ్ఇండియా వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో సత్తా చాటాడు. ఒక స్థానం మెరుగుపర్చుకొని రెండో ప్లేస్ దక్కించుకున్నాడు. ప్రస్తుతం హిట్‌మ్యాన్ 756 రేటింగ్స్‌తో రెండో స్థానంలో కొనసాగడం విశేషం. యంగ్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ తన అగ్రస్థానం పదిలం చేసుకున్నాడు. 784 రేటింగ్ పాయింట్స్‌తో గిల్ టాప్‌లో ఉండగా, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ 736 రేటింగ్స్‌తో నాలుగో ప్లేస్‌లో ఉన్నాడు. ఇలా టాప్ 2 ర్యాంకులు మనోళ్లవే కాగా, టాప్ 5లో ముగ్గురు టీమ్ఇండియా బ్యాటర్లు ఉండడం విశేషం.అయి-ంతే 2025 ఐపీఎల్ తర్వాత రోహిత్ ఇప్పటిదాకా బరిలోకి దిగలేదు. రోహిత్ ఆఖరి మ్యాచ్ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ ఆడాడు. అప్పట్నుంచి మళ్లీ టీమ్ఇండియా వన్డేలు ఆడలేదు. అయినప్పటికీ హిట్ మ్యాన్ ఒక స్థానం మెరుగుపర్చుకోవడం విశేషం. ఇప్పటిదాకా ఆ స్థానంలో ఉన్న పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ రీసెంట్‌గా వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో ఫెయిల్ అయ్యాడు. మూడు మ్యాచ్‌ల్లో కేవలం 56 పరుగులే చేశాడు. దీంతో బాబర్ 751 రేటింగ్స్‌తో మూడో స్థానానికి పడిపోయాడు.

## కామన్వెల్త్ క్రీడలకు భారత ఒలింపిక్ సంఘం ఆమోదం

ఒలింపిక్ తర్వాత అత్యంత ఆదరణ ఉన్న, ఎక్కువ దేశాలు బరిలో నిలిచే కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేందుకు భారత్ సిద్ధమవుతోంది. 2030 క్రీడలను గుజరాత్‌లో నిర్వహించేందుకు బిడ్ దాఖలు ఇప్పటికే వార్తలు వచ్చాయి. 2030 కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడానికి భారత ఒలింపిక్ సంఘం బిడ్‌కు ఆమోదం తెలిపింది. ఆగస్టు 31 గడువుకు ముందే ప్రతిపాదనలను సమర్పించాలని ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో నిర్ణయించింది. కామన్వెల్త్ క్రీడలకు 2010లో తొలిసారి భారత్ ఆతిథ్యం ఇచ్చింది. మరోసారి నిర్వహించాలనే ఆలోచనలో ఉన్న కేంద్ర ప్రభుత్వం, 2030లో జరిగే పోటీల కోసం ముమ్మర కసరత్తు చేస్తోంది. 2036 ఒలింపిక్ క్రీడల నిర్వహణకు ఆసక్తి కనబరుస్తున్న కేంద్రం, వాటిని కూడా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లోనే నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించింది. అంతకుముందే కామన్‌వెల్త్ క్రీడల సమర్థ నిర్వహణ ద్వారా దేశ శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పాలని యత్నిస్తోందని నిపుణులు అంటున్నారు.

# మాజీ క్రికెటర్ రైనాకు ఈడీ సమన్లు

## ఆన్ లైన్ బెట్టింగ్ యాప్ స్కామ్‌లో ఆరోపణలు



టీమిండియా మాజీ క్రికెటర్ సురేశ్ రైనాకు షాక్ తగిలింది. బెట్టింగ్ ప్రమోషన్లకు సంబంధించి ఈడీ నుంచి అతనికి సమన్లు అందాయి. బుధవారం ఆఫీస్ కు హాజరు కావాలని అందులో పేర్కొన్నట్లు సమాచారం. దేశవ్యాప్తంగా కోట్లాది మంది నుంచి వేల కోట్ల రూపాయలను దోచుకుని, మనీ లాండరింగ్ కు పాల్పడినట్లుగా ఈ బెట్టింగ్ యాప్ నిర్వాహకులపై ఆరోపణలు ఉన్నాయి. నిజానికి భారత ప్రభుత్వం ఈ బెట్టింగ్ యాప్ లను ఎప్పటి నుంచో నిషేధించింది. అయితే పలు మార్గాల ద్వారా ఈ యాప్ లు వినియోగ దారులకు అందుబాటులో ఉన్నాయి. ఇక ఈ బెట్టింగ్ యాప్ లకు ప్రమోషన్ కల్పించిన విషయమై ఇప్పటికే రానా దగ్గుబాటికి తాజాగా ప్రశ్నించారు. అంతకుముందు ప్రకాశ్ రాజ్, విజయ్ దేవర కొండ, లక్ష్మీ మంచు తదితరులకు సమన్లు పంపినట్లు తెలుస్తోంది. సరోగేట్ యాడ్ల ద్వారా ఈ బెట్టింగ్ యాప్ లను ప్రచారం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బెట్టింగ్ దందా దేశవ్యాప్తంగా వేళ్లునూకోవడం పలువురిని విస్మయానికి గురి చేస్తోంది. ఈ ఏడాది తొలి మూడు నెలలలోనే ఆన్ లైన్ బెట్టింగ్ వెబ్ సైట్లలో 1.6 బిలియన్ విసిట్లు నమోదు కావడం విశేషం. ఇండియాలో ఆన్ లైన్ బెట్టింగ్ మార్కెట్ విలువ వంద మిలియన్ డాలర్లకు పైబడి ఉంటుందని ఈడీ అధికారులు భావిస్తున్నారు. ఇక ప్రతి ఏటా పన్నుల ఎగవేసి, 27వేల కోట్లకుపైగా మనీ లాండరింగ్ కు పాల్పడినట్లు పేర్కొంటున్నారు. బెట్టింగ్ యాప్ దందాపై మంగళవారం దేశంలోని 15 చోట్ల ఏకకాలంలో దాడులు జరిగాయి. ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, జైపూర్, మధురై, సూరత్ తదితర ప్రదేశాల్లో ఈ దాడులు జరిగాయి. పరి మ్యాచ్ అనే బెట్టింగ్ యాప్ దందాకు సంబంధించి ఈ దాడులు జరిగినట్లు తెలుస్తోంది. ప్రివేన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద ఈ విచారణ చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ బెట్టింగ్ దందాలో కోట్లాది మంది భారతీయులు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు పరోక్షంగా 22 కోట్ల మందికిపైగా ఈ బెట్టింగ్ రాకెట్ ప్రభావానికి గురయ్యారని, 11 కోట్ల మంది రెగ్యులర్ గా బెట్టింగ్ యాప్ లో విసిట్స్ చేస్తున్నట్లు పలు విధాలుగా సేకరించిన సర్వేల్లో నమోదైనట్లు సమాచారం. ఏదేమైనప్పటికీ, బెట్టింగ్ దందా వల్ల ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ప్రజలకు చైతన్య పరిచేందుకు సోషల్ మీడియాలో వివిధ రకాల క్యాంపెయిన్ల కూడా నడుస్తున్నాయి. ఇక బెట్టింగ్ దందా ద్వారా సంపాదించిన సొమ్మును హవాలా మార్గంలో విదేశాలకు వెళుతున్నట్లు తెలుస్తోంది. కొన్నిచోట్ల వివిద అకౌంట్లకు తరలించి, నగదు రూపంలో ఉప సంహరణ జరుగుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

# పాకిస్థాన్‌తో భారత్ మ్యాచ్ ఆడవద్దు

## మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్



ఆసియా కప్ 2025 టోర్నీలో పాకిస్థాన్‌తో భారత్ మ్యాచ్ ఆడవద్దని మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ అన్నాడు. సరిహద్దుల్లో సైన్యం పోరాడుతున్న సమయంలో పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడటం సమంజసం కాదన్నాడు. దేశం కంటే ఏదీ ముఖ్యం కాదని అభిప్రాయపడ్డాడు. ఇరుదేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఆసియాకప్ 2025 వేదికగా జరిగే భారత్-పాక్ మ్యాచ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ టోర్నీలో పాకిస్థాన్‌తో మ్యాచ్‌లను యువరాజ్ సింగ్ సారథ్యంలో భారత లెజెండ్స్ బహిష్కరించింది. సెమీఫైనల్ చేరిన తర్వాత కూడా పాక్‌తో ఆడలేక టోర్నీ నుంచి వైదొలిగింది. దాంతో ఆసియాకప్ 2025పై అందరి దృష్టి నెలకొంది. సెప్టెంబర్ 9 నుంచి ఈ టోర్నీ ప్రారంభం కానుండగా.. భారత్, పాక్ జట్లు సెప్టెంబర్ 14న తలపడనున్నాయి. ఈ టోర్నీలో ఇరు జట్లు మొత్తం మూడుసార్లు తలపడే అవకాశం ఉంది. పాక్‌తో ఆడే విషయంపై బీసీసీఐ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. తాజాగా ఈ వ్యవహారంపై మాట్లాడిన హర్భజన్ సింగ్.. పాకిస్థాన్‌తో ఆడవద్దని బీసీసీఐకి సూచించాడు. ఒక్క మ్యాచ్ ఆడకపోతే పోయేదేం లేదన్నాడు.'ఏది ముఖ్యమో.. ఏది కాదో తెలుసుకోవాల్సిన అవసరం బీసీసీఐకి ఉంది. నా వరకైతే.. సరిహద్దుల్లో పోరాడే సైనికులే ముఖ్యం. వారి త్యాగాల వల్ల దేశంలో మనమంతా హాయిగా ఉండగలుగుతున్నాం. సైనికుల త్యాగాలతో పోల్చితే పాక్‌తో మ్యాచ్ అనేది చాలా చిన్న విషయం. భారత ప్రభుత్వ వైఖరి కూడా అలానే ఉంది. బార్డర్‌లో సైన్యం పోరాడుతున్న వేళ పాక్‌తో క్రికెట్ ఆడటం సమంజసం కాదు. పెద్ద పెద్ద సమస్యలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంది. వాటితో పోలిస్తే క్రికెట్ చాలా చిన్న విషయం. ఎప్పుడైనా సరే దేశానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. ఏ ఆటగాడు, యాక్టర్‌కు అయినా గుర్తింపు రావడానికి ఈ దేశం ప్రధాన కారణం. ఇతర వృత్తిలో ఉన్నా దేశం కంటే ఎవరూ గొప్ప కాదు. దేశానికి ఇచ్చే ప్రాధాన్యతతో పోల్చినప్పుడు.. ఒక్క క్రికెట్ మ్యాచ్ ఆడకపోతే ఏమీ కాదు. బోర్డర్‌లో మన సైనికులు నిరంతరం కాపు కాస్తూ.. శత్రు దేశంతో పోరాడుతున్నారు. వారు ఎప్పుడు ఇంటికి వస్తారా? అని వారి కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్న క్రమంలో మనం ఆ దేశంతో క్రికెట్ ఆడాలా?'అని హర్భజన్ సింగ్ ప్రశ్నించాడు.

# మూడు ఫార్మాట్లకు శుభ్‌మన్‌ను కెప్టెన్ చేయండి

## మాజీ సెలెక్టర్ దేవాంగ్ గాంధీ




భారత క్రికెట్ జట్టు కెప్టెన్సీ వ్యవహారంపై ఇప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద చర్చ జరుగుతోంది. టీ20 ప్రపంచకప్ 2024 తర్వాత రోహిత్ శర్మ టీ20ల నుంచి తప్పుకోవడంతో, బీసీసీఐ స్ప్లిట్ కెప్టెన్సీ (వేర్వేరు కెప్టెన్లు) విధానాన్ని అధికారికంగా అమల్లోకి తెచ్చింది. ప్రస్తుతం టీ20లకు సూర్యకుమార్ యాదవ్, వన్డేలకు రోహిత్ శర్మ, టెస్టులకు యువ సంచలనం శుభ్‌మన్ గిల్‌లు సారథ్యం వహిస్తున్నారు. ఈ ముగ్గురు కెప్టెన్ల విధానంపై మాజీ సెలెక్టర్ దేవాంగ్ గాంధీ ఆసక్తికరమైన, సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత క్రికెట్‌కు దీర్ఘకాలంలో స్ప్లిట్ కెప్టెన్సీ విధానం సరిపోదని దేవాంగ్ గాంధీ అభిప్రాయపడ్డారు.ఆల్-ఫార్మాట్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేయాలని ఆయన బలంగా వాదిస్తున్నారు. "స్ప్లిట్ కెప్టెన్సీ ఇతర దేశాల్లో పనిచేయవచ్చు, కానీ ఇండియాలో మాత్రం సాధ్యం కాదు. ఎందుకంటే మన జట్టుకు ఆలోచనా విధానంలో స్థిరత్వం అవసరం. అన్ని ఫార్మాట్లలో అద్భుతంగా రాణిస్తున్న ఒక ఆటగాడు ఒక ఫార్మాట్‌కు కెప్టెన్‌గా ఉన్నప్పుడు, మిగిలిన ఫార్మాట్లకు కూడా అతనే నాయకత్వం వహించాలి" అని దేవాంగ్ గాంధీ అన్నారు.గిల్‌ను ఆల్-ఫార్మాట్ కెప్టెన్‌గా నియమించాలనే తన అభిప్రాయానికి దేవాంగ్ కొన్ని బలమైన కారణాలు చెప్పారు.2017లో విరాట్ కోహ్లీకి ఎలాంటి మద్దతు ఉండేదో, ఇప్పుడు గిల్‌కు కూడా అలాంటి సపోర్టు ఉందన్నారు.కోహ్లీ ఎలాగైతే ధోనీ సారథ్యంలో ఎదిగాడో, గిల్ కూడా కోహ్లీ, రోహిత్ శర్మ లాంటి దిగ్గజాల మధ్య కెప్టెన్సీకి మెరుగులు దిద్దుకున్నాడని వెల్లడించారు.గిల్ అన్ని విభాగాల్లోనూ రాణించాడని గాంధీ ప్రశంసించారు.టెస్ట్ కెప్టెన్‌గా గిల్‌ను నియమించడం ద్వారా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ముందుచూపుతో వ్యవహరించారని గాంధీ పేర్కొన్నారు. అయితే, 2026 టీ20 ప్రపంచకప్ తర్వాత సూర్యకుమార్ యాదవ్‌కు బదులుగా ఎవరు కెప్టెన్సీ తీసుకుంటారనే దానిపై బీసీసీఐ స్పష్టమైన సంకేతాలు ఇవ్వాలని గాంధీ సూచించారు.గిల్ అరంగేట్రం చేసినప్పటి నుంచి వన్డేల్లో అతని సగటు 59.04. ఇటీవల ఇంగ్లాండ్‌లో జరిగిన 5 టెస్టుల సిరీస్‌లో కెప్టెన్‌గా గొప్ప ఒత్తిడిని అధిగమించి సత్తా చాటాడు.అంతేకాకుండా, ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ సారథిగా తన నాయకత్వ లక్షణాలను నిరూపించుకున్నాడు. 2000వ దశకం ప్రారంభం నుంచి భారత్ గెలిచిన ఐసీసీ ట్రోఫీలు అన్నీ కూడా ఆల్-ఫార్మాట్ కెప్టెన్ల హయాంలోనే వచ్చాయని గాంధీ గుర్తు చేశారు.గిల్ అన్ని ఫార్మాట్లలో సత్తా చాటాడు. ఈ కారణాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే, శుభ్‌మన్ గిల్‌ను భారత్‌కు భవిష్యత్ ఆల్-ఫార్మాట్ కెప్టెన్‌గా తీర్చిదిద్దడమే సరైన నిర్ణయం అని దేవాంగ్ గాంధీ స్పష్టం చేశారు.

# పాకిస్థాన్‌ను చిత్తు చేసిన విండీస్


## 2-1తో మూడు వన్డేల సిరీస్ విండీస్ వశం






వెస్టిండీస్ క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. తాజాగా పాకిస్థాన్‌తో జరిగిన మూడో వన్డేలో 202 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ జట్టు నిర్ణీత 50 ఓవర్లకు 294/6 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో పాకిస్థాన్ తేలిపోయింది. 29.2 ఓవర్లలో 92 పరుగులకే ఆలౌటైంది. ఈ విజయంతో విండీస్ 2-1తో మూడు వన్డేల సిరీస్?ను దక్కించుకుంది.సొంతగడ్డపై జరిగిన ఈ సిరీస్‌లో విండీస్ సత్తా చాటింది. సిరీస్?లో జరిగిన తొలి మ్యాచ్‌లో ఓడినప్పటికీ, తర్వాత రెండు వన్డేల్లో పుంజుకొని అద్భుత విజయాలు నమోదు చేసింది. దీంతో 34 ఏళ్ల తర్వాత తొలిసారి పాకిస్థాన్?పై వెస్టిండీస్ వన్డే సిరీస్ నెగ్గింది. దీంతో విండీస్ ఫ్యాన్స్? ఆనందంలో మునిగి పోయారు. కాగా, వెస్టిండీస్ చివరిసారిగా 1991లో జరిగిన వన్డే సిరీస్‌లో పాకిస్థాన్‌ను ఓడించింది.కాగా, ఈ మ్యాచ్?లో వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ సూపర్ సెంచరీతో అదరగొట్టాడు. 94 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్సర్లతో 120 పరుగులు చేశాడు. ఎడాపెడా బౌండరీలతో స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. దీంతో వెస్టిండీస్ మంచి స్కోర్ 294-6 చేసింది. అనంతరం 295 పరుగుల ఛేదనలో దిగిన పాకిస్థాన్‌ను విండీస్ బౌలర్లు ఆటాడేసుకున్నారు. ఏకంగా ఐదుగురు బౌలర్లు డకౌట్ అయ్యారు. ఇందులో కెప్టెన్ రిజ్వాన్ (0) సున్నాకే ఔట్ అవ్వగా, బాబర్ ఆజమ్ (9) స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేరాడు. ఈ మ్యాచ్‌లో పాక్ 92 పరుగులకే ఆలౌట్ అవ్వడంపై సోషల్ మీడియాలో ఆజట్టుపై ట్రోల్స్ వస్తున్నాయి. వెస్టిండీస్ జట్టులో హోప్ ఒక్కడే 120 రన్స్ చేయగా, పాక్ జట్టు మొత్తం కలిసి 92 పరుగులే చేసిందని పాక్‌ను నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. ఈ లెక్కన హోప్ ఒక్కడే పాక్‌పై 28 రన్స్‌తో నెగ్గాడంటూ కామెంట్లు చేస్తున్నారు.విండీస్ బౌలర్ జెయిడెన్ సీల్స్ ఈ మ్యాచ్‌లో ఆదరగొట్టాడు. ఈ ఒక్కడే 6 వికెట్లు నేలకూల్చి పాక్ పతనాన్ని శాసించాడు. టాప్ 4 వికెట్లు సీల్స్‌కే పడ్డాయి. ఓపెనర్లు సైమ్ ఆయూబ్ (0), అబ్దుల్లా (0) ఇద్దర్నీ సీల్స్ డకౌట్‌గా పెవిలియన్ పంపాడు. ఆనంతరం రిజ్వాన్, బాబర్ ను కూడా ఔట్ చేసి విండీస్‌కు బ్రేక్ ఇచ్చాడు. చివర్లో నసీమ్ షా, హసన్ అలీ వికెట్లు కూడా కూల్చాడు. ఇలా సీమ్స్ ఆరు వికెట్లతో సత్తా చాటగా, గుడాకెశ్ 2, రోస్టన్ చేజ్ 1 వికెట్ దక్కించున్నారు.పాక్ జట్టులోని ఇద్దరు అనుభవజ్ఞులైన బ్యాటర్లు బాబర్ ఆజామ్, మహ్మద్ రిజ్వాన్ ఫెయిల్ అయ్యారు. రిజ్వాన్ డకౌట్ కాగా, బాబర్ 23 బంతుల్లో 9 పరుగులకే పెవిలియన్ చేరాడు. దీంతో ఈ ఇద్దరిపై సోషల్ మీడియాలో ట్రోల్స్ ఎక్కువయ్యాయి. మూడో వన్డేలో మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 294 పరుగులు చేసింది. సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో వెస్టిండీస్ ఇంత పెద్ద స్కోరును చేరుకోవడంలో కెప్టెన్ షాయ్ హోప్ కీలక పాత్ర పోషించాడు. అతను బ్యాటింగ్‌తో తన జట్టును ముందుండి నడిపించాడు. షాయ్ హోప్ సెంచరీ చేశాడు. ఇది వన్డే క్రికెట్‌లో అతనికి 18వది, పాకిస్తాన్‌పై అతని రెండవ సెంచరీ. షాయ్ హోప్ కేవలం 94 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్సర్లతో అజేయంగా 120 పరుగులు చేశాడు. కెప్టెన్ హోప్ విధ్వంసక బ్యాటింగ్ కారణంగా, మొదటి 42 ఓవర్లలో 6 వికెట్లకు 185 పరుగులు చేసిన వెస్టిండీస్ జట్టు చివరి 8 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 109 పరుగులు జోడించింది. సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో పాకిస్థాన్‌కు 295 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. నేటి క్రికెట్ యుగంలో ఈ లక్ష్యం అసాధ్యం కాదు. కానీ, వెస్టిండీస్‌పై దానిని ఛేదించడంలో పాకిస్తాన్ చాలా కష్టపడింది, మొత్తం జట్టు కలిసి 100 పరుగులు కూడా చేయలేకపోయింది, ఆ లక్ష్యాన్ని చేరుకోవడం గురించి చెప్పనక్కర్లేదు. మూడవ వన్డేలో, పాకిస్తాన్ జట్టు 92 పరుగులకే ఆలౌట్ అయింది. ఫలితంగా, వెస్టిండీస్ ఈ మ్యాచ్‌లో 202 పరుగుల తేడాతో గెలిచింది. ఇది పరుగుల పరంగా పాకిస్తాన్‌పై అతిపెద్ద ఓటమిగా నిలిచింది. ఈ సందర్భంలో, 2015లో క్రైస్ట్‌చర్చ్‌లో జరిగిన వన్డేలో 150 పరుగుల తేడాతో ఓడిపోయిన రికార్డును అది బద్దలు కొట్టింది.వన్డే క్రికెట్‌లో వెస్టిండీస్ 200ం పరుగులు సాధించి విజయం నమోదు చేయడం ఇది నాల్గవసారి. కెప్టెన్ షాయ్ హోప్ బ్యాటింగ్‌తో పాకిస్తాన్‌ను దెబ్బతీయడంలో కీలక పాత్ర పోషించగా, జేడెన్ సీల్స్ బంతితో విధ్వంసం సృష్టించాడు. అతను ఒంటి చేత్తో పాకిస్తాన్ జట్టులో సగం మందిని పెవిలియన్ చేరాడు. అతను 7.2 ఓవర్లలో 18 పరుగులకు 6 వికెట్లు పడగొట్టాడు. ఇది అతని కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచింది. పాకిస్తాన్‌తో జరిగిన మూడో వన్డేను వెస్టిండీస్ గెలవడమే కాకుండా, సిరీస్‌ను కూడా గెలుచుకుంది. ఈ విధంగా, వెస్టిండీస్‌పై వన్డే సిరీస్‌ను కోల్పోకుండా 34 ఏళ్లుగా పాకిస్తాన్ నెలకొల్పిన రికార్డును మహ్మద్ రిజ్వాన్ కెప్టెన్సీలో బద్దలు కొట్టింది. 1991 తర్వాత పాకిస్తాన్‌పై వెస్టిండీస్ తన తొలి వన్డే సిరీస్‌ను గెలుచుకుంది. ఈ శతాబ్దంలో అంటే 2000 తర్వాత ఏ ఫార్మాట్‌లోనైనా పాకిస్తాన్‌పై వెస్టిండీస్ సాధించిన తొలి సిరీస్ విజయం కూడా ఇదే కావడం గమనార్హం.

# కూలీ, వార్-2లకు పోటీగా ధూమకేతు



ఆగస్టు 14న గురువారం కూలీ, వార్2 మూవీలు పెద్ద ఎత్తున రిలీజ్ కాబోతున్నాయి. వీటిపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. మకూలీలో సీనియర్ యాక్టర్లు వార్2లో యంగ్ అండ్ డైనమిక్ హీరోలు మీ సినిమానా మా సినిమానా అన్నట్లుగా పోటీ-పడుతున్నారు. ఎవ్వరూ ఎక్కడా తగ్గట్లేదు. ఆడియన్స్‌ని థియేటర్లకు రప్పించేందుకు చేస్తున్న ప్రమోషన్స్ పీక్స్‌కి చేరాయి. ఈ దశలో మరో మూవీ రిలీజ్ అయ్యేందుకు సాహసం చేస్తుందా. కానీ మేం చేస్తాం అంటోంది ఓ బెంగాలీ ఫిల్మ్. వార్2, కూలీ చిత్రాలతో పోటీ పడుతూ 'ధూమకేతు' అనే బెంగాలీ ఫిల్మ్ పశ్చిమ బెంగాల్లో ఆగస్టు 14నే రిలీజ్ అవుతోంది. వార్2, కూలీకి ఈ సినిమాకు ఏంటీ- పొంతన అని తక్కువగా తీసిపారేయొద్దు. ఉత్తరాదిలో వార్2. సౌత్‌లో కూలీ సినిమాలకు ఫుల్ అటెన్షన్ క్రియేట్ అవుతుంది. కానీ బెంగాల్‌లో మాత్రం ధూమకేతుకు విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. ఎంతలా అంటే ప్రీ బుకింగ్స్ సేల్స్‌లో ఈ లోకల్ సినిమాను వార్2 కూడా బీట్ చేయలేనంతలా. ధూమకేతు ఇప్పటి వరకు 21 వేల టికెట్లు- అమ్ముడవగా, వార్2కి కేవలం 6 వేల టికెట్లు- మాత్రమే తెగాయన్నది మార్కెట్ వర్గాల టాక్. ఇక కూలీని పెద్దగా పట్టించుకోవడం లేదు బెంగాల్ ఆడియన్స్. ఈరేంజ్ బిజినెస్ ఇప్పటి వరకు ఏ బెంగాలీ సినిమాకి జరగలేదని అంటున్నాయి అక్కడి మార్కెట్ వర్గాలు. అంతేకాదు బెంగాల్ వ్యాప్తంగా తొలి రోజే 400 ప్లస్ షోలు పడనున్నాయట. రన్నింగ్‌లో ఈ సంఖ్య మరింత పెరిగే ఛాన్స్ ఉందట. ఇంతలా హైప్ క్రియేట్ చేస్తున్న ధూమకేతు .. ఈ మధ్యలో తెరకెక్కిన ఫిల్మ్ కూడా కాదు.. ఎప్పుడో పదేళ్ల క్రితం మొదలు పెట్టి.. 8 ఏళ్ల క్రితం పూర్తైన సినిమా. పలుమార్లు రిలీజ్ వాయిదా పడుతూ ఎట్టకేలకు ఇప్పటికీ మోక్షం దక్కించుకుంది. బెంగాల్ సూపర్ స్టార్ దేవ్, శుభశ్రీ గంగూలీ సిక్త్ -టైమ్ జోడీ కడుతుండటంతో బెంగాల్ వ్యాప్తంగా విపరీతమైన హైప్ క్రియేట్ అయింది. ఈ ఇద్దరు గతంలో జూనియర్ ఎన్టీఆర్, సమంత, కాజల్ నటించిన బృందావనం బెంగాల్ రీమేక్ వర్షన్ ఖోకా420 వర్షన్‌లో కలిసి నటించారు. ఈ సినిమా బెంగాల్‌లో బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకుంది. దీంతో ఈ జంటకు హిట్ పెయిర్‌గా క్రేజ్ వచ్చింది. ఈ హిట్‌పెయిర్ ఇప్పుడు ధూమకేతుతో మ-రోసారి జంటగా రాబోతున్నారు. ఆగస్టు14న రిలీజ్ అవుతోన్న ధూమకేతు ఒకవేళ పాజిటివ్ టాక్ తెచ్చుకుంటే బెంగాల్‌లో వార్2 కలెక్షన్లకు గండిపడినట్లే అవుతుంది.



# కవర్ స్టిల్‌తో మంట పెట్టిన రకుల్

తెలుగు ప్రేక్షకులకు కెరటం సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్‌కి 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాతో హిట్ దక్కింది. సందీప్ కిషన్ హీరోగా నటించిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ కమర్షియల్‌గా భారీ విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో వెంటనే రకుల్ ప్రీత్ సింగ్‌కి టాలీవుడ్‌లో స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు దక్కాయి. మెల్ల మెల్లగా స్టార్ హీరోల సినిమాలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా నిలిచిన రకుల్ ప్రీత్ సింగ్ ఐదేళ్ల పాటు వరుస సినిమాలు చేసింది. ఒకానొక సమయంలో స్టార్ హీరోల సినిమాలకు సైతం డేట్లు ఇవ్వలేని స్థాయిలో బిజీగా సినిమాలు చేసింది. కానీ కాలం ఎప్పుడూ ఒకలా ఉండదు కదా, తెలుగులో ఆఫర్లు తగ్గుతూ వచ్చాయి. టాలీవుడ్‌లో ఆఫర్లు తగ్గిన సమయంలో ఈ అమ్మడికి బాలీవుడ్ నుంచి పిలుపు వచ్చింది. రకుల్ ప్రీత్ సింగ్ కెరీర్ ఆరంభం నుంచి సినిమాలతోనే కాకుండా అందమైన ఫోటోలతోనూ ఆకట్టుకుంటూ వస్తోంది. తాజాగా మరోసారి ఇన్‌స్టాగ్రామ్‌లో అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా రకుల్ ప్రీత్ సింగ్ వార్తల్లో నిలిచింది. ఈసారి ప్రముఖ మ్యాగజైన్ బ్రైడ్స్ టుడే కవర్ పేజ్ పై రకుల్ ప్రీత్ సింగ్ మెరిసిపోయింది. నడుము అందం చూపిస్తూ అందమైన నాభి అందాలను చూపించడం ద్వారా రకుల్ ప్రీత్ సింగ్ చూపు తిప్పనివ్వడం లేదు. ఆకట్టుకునే అందంతో పాటు, కన్నుల విందు చేసే విధంగా రకుల్ ప్రీత్ సింగ్ మేకోవర్ ఉంది. ఇంతటి అందమైన రకుల్ ప్రీత్ సింగ్‌కు ఇంత త్వరగా ఇండస్ట్రీ ఉద్వాసన పలకడం ఏ మాత్రం బాగా లేదు అంటూ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# మరోమారు జల్సా.. విడుదల

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 2న ఆయన అభిమానుల కోసం 'జల్సా' సినిమాను మళ్లీ రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. ఈ విషయాన్ని గీతా ఆర్ట్స్ సంస్థ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. గతంలో 2022లో కూడా పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా 'జల్సా' సినిమాను 4కె వెర్షన్‌లో రీ-రిలీజ్ చేశారు. అయితే అప్పుడే ఈ చిత్రం రూ.3 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి రీ-రిలీజ్ సినిమాల్లో కొత్త రికార్డులను సృష్టించింది. అయితే ఈ సినిమాను మళ్లీ చూడటానికి అభిమానులు ఆసక్తి చూపుతుండడంతో సెప్టెంబర్ 2న రీ రిలీజ్ చేయ-ంబోతున్నారు మేకర్స్.





# మోనికాని బాలీవుడ్ అలా చూస్తోందా?

పూజాహెగ్డే కెరీర్ ఎలా ప్రారంభమైందో తెలిసిందే. కోలీవుడ్ లో మొదలైన ప్రస్తానం అటుపై టాలీవుడ్ అక్కడ నుంచి బాలీవుడ్ కి వెళ్లింది. పుట్టి పెరిగింది ముంబై కావడంతో బాలీవుడ్ లోనే స్థిరపడాలని ప్లాన్ చేసుకుంది. కానీ కెరీర్ అక్కడ మాత్రం ఆశించిన విధంగా సాగలేదు. సౌత్ లో వచ్చినట్లు అవకాశాలు హిందీ పరిశ్రమ లో రాలేదు. పదేళ్ల ప్రస్తానం తెలుగు, తమిళ సినిమాలే ఎక్కువగా చేసింది. హిందీలో నాలుగైదు సినిమాలకే పరిమితమైంది. ఆ నాలుగు కూడా పెద్దగా సక్సస్ అవ్వలేదు. అలా పూజాహెగ్డే బాలీవుడ్ కి సపరేట్ గా మారింది. ముంబై బ్యూటీ అయినా బాలీవుడ్ లో మాత్రం అవకాశాలు రాలేదు. తాజాగా ఈ అంశంపై పూజాహెగ్డే తొలిసారి స్పందించింది. ఇప్పటి వరకూ బాలీవుడ్ అంటే పాజిటివ్ గానే స్పందించిన అమ్మడు కాస్త స్వరం మార్చినట్లే కనిపిస్తోంది. హిందీ దర్శక, రచయితలు తనని కేవలం గ్లామర్ డాల్ గానే చూస్తున్నారంది. నటిగా తన లో ట్యాలెంట్ ను గుర్తించలేకపోతున్నారంది. తన ట్యాలెంట్ గురించి తెలియా లంటే సౌత్ లో తాను నటించిన సినిమాలు చూడాలని సూచించింది.

తాను కేవలం ఐటం పాటలకు...ప్రత్యేక పాత్రలకు పరిమితమయ్యే నటని కాదని పేర్కొంది. అలాగే హిందీలో ఇంత వరకూ సరైన సినిమాలు గానీ, పాత్రలు గానీ పడలేదని అసహనం వ్యక్తం చేసింది. తనని సౌత్ వాళ్లు నమ్మినట్లు నార్త్ వాళ్లు నమ్మడం లేదా? అన్న సందేహాన్ని వ్యక్తం చేసింది. బాలీవుడ్ పై అమ్మ డు ఇంత వరకూ ఇలాంటి వ్యాఖ్యలు ఎన్నడూ చేయలేదు. హిందీ పరిశ్రమ అంటే పాజిటివ్ గానే స్పందించేది. కానీ అవకాశాలు రాకపోయే సరికి పూజాహెగ్డే తిరుగు బావుటా ఎగరేసినట్లే కనిపిస్తోంది.

# పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై ముంబై సంస్థ కేసు

## రాజసాబ్ విడుదలపై ప్రభావం

టాలీవుడ్ బడా నిర్మాణ సంస్థపై కేసు నమోదయింది. తమను మోసం చేసారని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై ముంబైకి చెందిన ఐవివై ఎంటర్‌టెన్‌మెంట్స్ కేసు పెట్టింది. వివరాలలోకెళితే పీపుల్స్ మీడియా సంస్థ నిర్మాణంలో రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా రాజాసాబ్ అనే సినిమాను నిర్మిస్తోంది. అత్యంత భారీ బడ్జెట్ పై చాలా కాలంగా ఈ సినిమాను నిర్మిస్తోంది పీపుల్స్ మీడియా. అయితే వందల కోట్ల బడ్జెట్ తో పీపుల్స్ మీడియా నిర్మిస్తున్న ఈ సినిమాకు ముంబై కు చెందిన ఈ సంస్థ ఆర్థిక భాగస్వామిగా వ్యవహరిస్తోంది. సినిమా షూటింగ్ కు అయ్యే ఖర్చు తదితర వాటికి ఆర్థిక వనరులు సమకూర్చేలా ఇరు సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. గ్రాండ్‌గా షూటింగ్ స్టార్ట్ చేసిన పీపుల్ మీడియా మేకర్స్ ఈ సినిమా షూటింగ్ ను అనుకున్న టైమ్ లో ఫినిష్ చేయలేక పోయారు. ఇప్పటికే రాజాసాబ్ అనేకసార్లు రిలీజ్ వాయిదా పడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో పీపుల్ మీడియా తమ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, సినిమా షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయజేకుండా, తమకు ఎలాంటి సమాచారం అందించడం లేదని, మేము ఇచ్చిన డబ్బులు ఎలా ఉపయోగించారనే దానిపై వివరణ కూడా వివరన ఇవ్వలేదని చెబుతూ ఢిల్లీ కోర్టులో కేసు నమోదు చేసింది. అలాగే మేము ఇచ్చిన డబ్బులో ప్రస్తుతం రూ. 218 కోట్లు- తిరిగి ఇవ్వాలని ఈ సంస్థ డిమాండ్ చేస్తోంది. ఇదిలా ఉండగా ఈ సినిమా ఇంకా నాన్-థియేట్రికల్ డీల్‌ను క్లోజ్ కాలేదని, అనుకొని కారణాల వలన రిలీజ్ వాయిదా వేసామని కావాలని తమ పరువుకు భంగం కలిగిస్తున్నారని ఐవివై సంస్థపై కోర్టును ఆశ్రయించింది పీపుల్స్ మీడియా.



Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A0100** Email: netisakshinews@gmail.com. Phone No: 9119949944, 966605221

# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..

గురువారం 14 ఆగస్టు 2025




# కుల పరమైన.. వృత్తిపరమైన అంశాల్లో అండగా ఉంటాం



- జగిత్యాలలో 'గొల్లపల్లి' రోడ్డు చౌరస్తాలో 'సర్దార్ సర్వాయి పాపన్న' విగ్రహావిష్కరణ చేసిన మంత్రి పొన్నం
- ఇక ఈ చౌరస్తా పేరు 'సర్వాయి పాపన్న చౌరస్తా'గా నామకరణం

**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :** రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో జనాలు హాపీగా ఉన్నారని ప్రజలకు 'కుల-వృత్తి' పరమైన నైపుణ్యాలు ఉపాధి పెరిగి ,ఉన్నత విద్యా అవకాశాలు మెరుగుపర్చుకుని ముందుకు పోవాలని అలాంటి వారికి తాము అండగా ఉంటామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. ఇకపై ఇది సర్వాయి పాపన్న జంక్షన్ గా నామకరణం జగిత్యాల జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి చౌరస్తా బైపాస్ రోడ్డులో బుధవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మంత్రి పొన్నం ప్రభాకర్ విగ్రహావిష్కరణ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఈరోజు నుండి దీనిని సర్వాయి పాపన్న జంక్షన్ గా నామకరణం చేశామన్నారు.వచ్చే 18 వ తేది హైదరాబాద్ లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఆరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కు శంకుస్థాపన చేస్తున్నారన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొని మనకు స్పూర్తిదాయకంగా భవిషత్ తరాలకు తెలిసే విధంగా కార్యక్రమాలు తీసుకుంటున్నామన్నారు.బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వృత్తి రీత్యా కల్లుగీత కార్మికుడు. అయిన సైన్యం లో సామాజిక న్యాయం పాటించి గోల్కొండ ఖిలా జయించిన వీరుడుగా అభివర్ణించారు. సామాజిక న్యాయాన్ని పాటిస్తూ భవిషత్ లో బహుజనులు అధికారం వైపు పోవాలని అకాంక్షించారు. ఆయన విగ్ర హావిష్కరణ మన అందరికీ స్పూర్తిని స్తుందన్నారు. మహనీయుల విగ్రహాలు వారి చరిత్ర వారి స్పూర్తిదాయక పోరాటం మన భవిష్యత్ ను ఆలోచన చేయడానికి విగ్రహాలు చూసినప్పుడు మన జీవితంలో మార్పులు చేసుకొని పట్టుదలతో వాటిని అధిగమిస్తామని పొన్నం అభిప్రాయపడ్డారు.డా,, బాబా సాహెబ్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, నెహ్రూ ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలు పెట్టిన వారిని స్పూర్తిని తీసుకొని మనం విజయం సాధించాలన్నారు.సర్వాయి పాపన్న బహు జనులతో బీకర పోరాటం చేశాడని ఆనాడు కత్తులు, డాల్లు తో యుద్ధం చేశారని గుర్తుచేశారు.ఈరోజు వాటి స్థానంలో ప్రజాస్వామిక వ్యవస్థ ఏర్పడిందన్నారు. బహుజనులు స్పూర్తి భావజాలం పెంపొందించడం, రాజ్యాధికారాన్ని ప్రజాస్వామికంగా ఓటు హక్కు ద్వారా వినియోగించుకున్న విషయం బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానం, సర్వాయి పాపన్న ఆలోచన విధానం ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు.

### గౌడ సంఘాలకు విజ్ఞప్తి..

ఈ సందర్భంగా గౌడ సంఘాలకు తాను విజ్ఞప్తి చేస్తున్నానని.. 'ఒక్క రూపాయి ఖర్చు లేకుండా..' ప్రభుత్వం నుండి ఉపాధి హామీ నుండి మొక్కలు పెట్టి పెంచే వరకు వాళ్ళదే బాధ్యత.. మీరు సమన్వయం చేసుకొని మొక్కలు నాటి ఉపాధి పెంచుకోవాలని పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో 40 లక్షల ఈత మొక్కలు,5 లక్షల తాటి మొక్కలు నాటి సంరక్షించాలని నిర్ణయం తీసుకుందన్నారు.

### రాజకీయాల్లో ,ఉపాధి పరంగా ముందుడాలి ..

కుల సర్వే ఎక్స్పర్ట్ కమిటీ లో విద్య లేకపోవడమే పోటీ ప్రపంచంలో మనం తట్టుకోలేకపోతున్నామన్నారు.మీ పిల్లలను బాగా చదివించి ఉన్నత శిఖరాలకు తీసుకోవాలని పేర్కొన్నారు.గౌడ్ హాస్టల్ స్థలాన్ని శాసన సభ్యులు,జిల్లా కలెక్టర్ ను కోరుతాం గౌడ్ హాస్టల్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని..నిధులను కేటాయించడానికి ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,ఎంపీలు ప్రభుత్వాన్ని కోరి నిధులు కేటాయించేలా విజ్ఞప్తి చేస్తామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్,ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ మంత్రి రాజేశం గౌడ్,మాజీ ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ తుల ఉమ,గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్,ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలను నిరోధించడం లో భాగస్వాములు కావాలి

### జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం లో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమం



**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :** మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటం కేవలం ఒక వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాక, సామాజిక కర్తవ్యం గా గుర్తిస్తూ, మాదకద్రవ్యాల రహిత సమాజం నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం మేరకు జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామి అవుతానని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ, నాతో పాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, మరియు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తాను అని డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేశారు.కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమంలో కలెక్టర్ సత్య ప్రసాద్ తో కలిసి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఓ శశికళా, డిసిఆర్బి, ఎస్బి, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ లు శ్రీనివాస్,ఆరిఫ్ అలీ ఖాన్, రఫిక్ ఖాన్ ఆర్ఐ లు కిరణ్ కుమార్, సైదులు మరియు ఇతర పోలీసు అధికారులు పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# తురకగూడెంలో ఇంకెన్నాళ్ళు బురద కష్టాలు

- మంత్రి పొంగులేటి చొరవతో తురక గూడెం - కిష్టాపురం లింక్ రోడ్డుకు నిధులు మంజూరు
- బీటీ రోడ్డు పూర్తి.. సీసీ రోడ్డు నిర్మాణం జాప్యం
- బురద రోడ్లతో డబుల్ బెడ్రూం వాసులు అవస్థలు
- గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని గ్రామస్తుల డిమాండ్



**నేటి సాక్షి పాలేరు, ఆగస్ట్ 13 :**ఆ ఊరి బురద కష్టాలు ఈనాటివి కాదు.. ఏళ్లకు ఏళ్లుగా బురదతో గ్రామస్తులు అవస్థలు పడుతూనే ఉన్నారు.. వర్షం పడితే అడుగు తీసి



అడుగు వేయాలి అంటే యాతనే.. ఆ ఊరి బురద సమస్య తీరుతుంది అంటూ నాయకులు ఇగో రోడ్ , అగో రోడ్ అంటూనే సంవత్సరాలు గడిచాయి .. ఆ ఊరి బురద కష్టాలు ఇప్పుడప్పుడే తీరేవిగా కనిపించడం లేదు.. ఆ ఊరే కూసుమంచి మండల కేంద్రం నుండి కూతవేటు దూరంలో ఉన్న తురక గూడెం గ్రామం.. ఎందుకో తురకగూడెం గ్రామంపై నాయకుల , అధికారుల చిన్న చూపా..? లేక గ్రామంలో రాజకీయంగా బలమైన మండల స్థాయి నాయకులు లేకపోవడం కారణమా..? కారణం ఏదైనా కావచ్చు .. ఏళ్లుగా తురకగూడెం అభివృద్ధికి దూరం అనే విషయం స్పష్టం అవుతుంది..

### మొదలు కానీ సీసీ రోడ్డు పనులు..

గ్రామ ప్రధాన కూడలి నుండి కిష్టాపురం వెళ్ళే లింక్ రోడ్డుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చొరవతో నిధులు మంజూరు అవ్వడం మంత్రి చేతుల మీదుగా ఘనంగా గత ఏడాది జూలై నెలలో శంకుస్థాపన కూడా జరిగింది.. ఇంతవరకు బాగానే ఉన్నా "దేవుడు వరం ఇచ్చిన పూజారి అడ్డుపడినట్టు" మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిధులు మంజూరు చేయించిన సీసీ రోడ్డు పనులు ఇంకా మొదలు కాకపోవడం అధికారుల నిర్లక్ష్యం స్పష్టం అవుతుంది.. ఇదే లింక్ రోడ్డుకు బీటీ రోడ్డు పనులు పూర్తి చేయడం , బీటీ రోడ్డుకు నాణ్యత పరీక్షలు కూడా నిర్వహించడం కూడా జరిగింది.. ఈ లింక్ రోడ్డుకు కొనసాగింపుగా ఉన్న దాదాపు 200 మీటర్ల సీసీ రోడ్డు వేయడానికి ఎందుకు వెనకడుతున్నారో అర్థం కాని ప్రశ్న..

### డబుల్ బెడ్రూం ఇళ్లకు బురద కష్టాలు..

గ్రామంలోనే డబుల్ బెడ్రూం ఇళ్లల్లో కూడా సీసీ రోడ్లు లేకపోవడంతో వర్షం వస్తె బురదతో ఇబ్బందులు పడుతున్నారు.. రోడ్ పైనే బురద నీరు నిలవడంతో దోమలకు , ఈగలకు ఆవాసంగా మారుతున్నాయి.. దీంతో వర్షా కాలం వచ్చిదంటే చిన్న పిల్లలు విష జ్వరాల బారిన పడుతున్నారు.. చిన్న పిల్లలు బురద రోడ్ల మీద నడవలేక బురదలో పడిపోయిన సందర్భాలు అనేకం. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి డబుల్ బెడ్రూం ఇండ్లపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని సీసీ రోడ్లు మంజూరు చేయాలని డబుల్ బెడ్రూం వాసులు కోరుతున్నారు..

# మంత్రి పొన్నంను కలిసిన కలెక్టర్



**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :**జగిత్యాల జిల్లాకు పలు కార్యక్రమాల నిమిత్తం విచ్చేసిన రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని, జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, రవాణా సదుపాయాల విస్తరణ, బీసీ సంక్షేమ పథకాల అమలు, మరియు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే చర్యలపై సవివరంగా చర్చించారు.

# శుభకార్యాలలో పాల్గొన్న జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే



**నేటి సాక్షి, దేవరకద్ర ఆగస్టు 13 :** మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం లో బుధవారం జరిగిన పలు శుభకార్యాలలో మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్చర్ల కేంద్రంలోని చెన్నారెడ్డి ఫంక్షన్ హాలులో మాజీ ఎంపిటిసి గొర్ల వెంకటస్వామి కుమారుడి వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. అలాగే జడ్చర్ల కేంద్రంలోని ప్రేమ్ రంగా గార్డెన్ లోని వల్లభురావ్ పల్లి గ్రామానికి చెందిన భీమయ్య మనవడు నరేందర్ వివాహ వేడుకల్లో కూడా మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పాల్గొన్నారు. అలాగే వెంకటాద్రి ఫంక్షన్ హాల్ లో రాజాపూర్ ఎంఈఓ సుధాకర్ కూతురి శుభకార్యంలో కూడా మాజీ ఎమ్మెల్యే శేఖర్ పాల్గొన్నారు. రాజస్థాన్ ఫంక్షన్ హాల్లో జరిగిన శివకుమార్ కూతురి శుభకార్యంలో కూడా మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రశేఖర్ యువసేన నాయకులు పాల్గొనట్లు ఎర్రశేఖర్ యువసేన యువ నాయకుడు పెద్ద చింతకుంట వేణుగోపాల్ తెలిపారు.

# పురోహిత దంపతుల పుణ్య కార్యం

### లక్ష్మీ పల్లి పాఠశాలకు మ్యాట్ ల బహుకరణ




**నేటి సాక్షి, దేవరకద్ర ఆగస్టు 13 :** భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తమ వంతుగా సహకారం అందించాలనే సంకల్పంతో ప్రముఖ పురోహితులు మఠం మహేష్ కుమార్ , సుస్వాని దంపతులు పుణ్య కార్యం చేశారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం లక్ష్మీ పల్లి ప్రాథమిక పాఠశాల కు మ్యాట్ లను బహుకరించి తమ ఉదారతను చాటుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లయన్ అశ్విని చంద్రశేఖర్ అభ్యర్థన మేరకు హన్వాడ మండలం పెద్దదర్పల్లి లోని శ్రీ ఈశ్వరా%శీ%జనేయ స్వామి దేవాలయం పురోహితులు , టంకర గ్రామస్తులు మఠం మహేష్ కుమార్, సుస్వాని దంపతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ స్వంత ఖర్చుతో విద్యార్థులు కూర్చునేందుకు అనువుగా 8 మ్యాట్ లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా మఠం మహేష్ దంపతులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తమ శక్తి మేర చేయుతనందిస్తామని అన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు లయన్ అశ్విని చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ప్రగతికి దాతలు తమ వంతు సహకారం అందించాలని కోరారు.పాఠశాల విద్యార్థుల అవసరం మేరకు అవసరమైన మ్యాట్ లను పాఠశాలకు వితరణగా అందజేసిన మఠం మహేష్ కుమార్ దంపతులను ఈ సందర్భంగా లయన్ అశ్విని చంద్రశేఖర్ సత్కరించారు. కాగా దాతలుగా లక్ష్మీ పల్లి పాఠశాలకు తమ వంతుగా సహాయం అందించిన మఠం మహేష్, సుస్వాని దంపతులకు ఆ పాఠశాల హెచ్ యం కల్పన ఉపాధ్యాయులు, అశ్విని చంద్రశేఖర్, విజయ లక్ష్మీ, నాగేశ్వర్ రెడ్డి లు కృతజ్ఞతలు తెలిపారు.

# తెరుచుకున్న సరళా సాగర్ ఆటోమేటిక్ సైఫన్లు

**కొత్తకోట-ఆత్మకూరు మధ్య లో నిలిచిపోయిన రాకపోకలు**



**నేటి సాక్షి, దేవరకద్ర ఆగస్టు 13 :** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పరిధిలోని దేవరకద్ర నియోజకవర్గం మదనాపురం మండల పరిధిలోని వనపర్తి జిల్లా పరిధిలోకి వచ్చే సరళా సాగర్ ప్రాజెక్ట్ ఆటోమేటిక్ సైఫన్లు బుధవారం తెరుచుకున్నాయి. ప్రాజెక్టులో నీటి నిల్వ స్థోమత పెరిగిన వెంబడి ఆటోమేటిగ్ గా ప్రాజెక్టు సైఫన్లు తెరుచుకోవడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. ప్రాజెక్టు ఎదవ ప్రాంతాల్లోనున్న వాగులు పొంగి పొర్లుతుంటంతో ప్రాజెక్టులోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతుంది. అయితే ప్రాజెక్టులో నీటి నిల్వ స్థోమత పెరగడంతో అకస్మాత్తుగా సరళాసాగర్ ఆటోమేటిక్ సైఫన్లు తెరుచుకున్నాయి. సరళా సాగర్ ప్రాజెక్ట్ సైఫన్లు తెరుచుకోవడంతో కొత్తకోట-ఆత్మకూర్ మండలాల మధ్యలో ఉన్న వంతెనపై నుండి పెద్ద ఎత్తున నీరు ప్రవహిస్తుండడంతో ఈ మార్గంలో రాకపోకలు స్తంభించిపోయాయి.

# ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన సుగుణమ్మ

**సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఒక వరం**

**ఎమ్మెల్యే బండారి కార్పొరేటర్ బన్నాల**



**నేటి సాక్షి ఉప్పల్ ఆగస్టు 14 :** అనారోగ్యంతో హాస్పిటల్లో అడ్మిట్ అయిన చిల్కానగర్ డివిజన్లోని రాఘవేంద్ర నగర్ కాలనీ లో అపార్ట్మెంట్లో వాచ్మెన్ గా నివాసం ఉంటున్న సుగుణమ్మకు చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో హాస్పిటల్ కి ఆయన ఖర్చులను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన చెక్కుని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి సుగుణమ్మ ఇంటికి వెళ్లి వారి యోగ క్షేమాలు తెలుసుకొని వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేయడం జరిగింది. అనంతరం సుగుణమ్మకి ఎటువంటి సహాయ సహకారాలు అవసరం ఉన్న తనను సంప్రదించాలని వారికి ధైర్యం చెబుతూ ఆ భయం ఇవ్వడం జరిగింది కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ముద్దం శ్రీనివాస్ యాదవ్, శ్యామ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంప పెట్టు

**మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్.**



**నేటి సాక్షి వికారాబాద్:** గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరాం, అలీఖాన్ ల నియామకం రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాను. తమ అభ్యర్థిత్వాన్ని గవర్నర్ వ్యతిరేకించడం ప్రొఫెసర్ కోదండరాం, అలీఖాన్ లను నియమించడాన్ని సవాల్ చేస్తూ ఉద్యకారులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దాసోజు శ్రవణ్ పిటిషన్ దాఖలు చేయడంతో... గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరాం, అలీఖాన్‌ల నియామకం రద్దు చేస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. గతంలో కూడా దాసోజు శ్రవణ్... ఒక ఉద్యమ నేతగా సహచర ఉద్యమకారుడికి అన్యాయం చేయొద్దంటూ కోదండరామ్ కి సైతం లేఖ రాశారు. న్యాయం కోసం గవర్నర్ నిర్ణయంపై కోర్టుకు వెళ్లిన ఆయనకు అనుకూలంగా తీర్పు రావడం సంతోషాన్నిచ్చింది. చివరకు న్యాయమే గెలిచింది. సుప్రీంకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంప పెట్టు లాంటిది, సుప్రీం తీర్పుతోనైనా రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి జ్ఞానోదయం జరగాలని ఆశిస్తున్నాను.

# రైతు రాజుగా చేయడమే లక్ష్యం-ప్రభుత్వ విప్

- దుంపేట వరద కాలువను పరిశీలించిన వేములవాడ ఎమ్మెల్యే ఆది
- ప్రజా ప్రభుత్వంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరు
- కొంతమంది రైతుల ముసుగులో రాజకీయాలు చేస్తున్నారని విమర్శ
- కుడి-ఎడమ కాలువల పనులకు అదనపు నిధులు కోరిన విప్



**నేటి సాక్షి - కథలాపూర్ ( రాధారపు నర్సయ్య) :** రైతును రాజుగా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ పరమ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. బుధవారం కథలాపూర్ మండలం దుంపేట గ్రామంలోని వరద కాలువను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటి పారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు కలిసి రైతాంగానికి బలమైన అండగా నిలుస్తున్నారన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరు అందించేందుకు సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేయడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం అని పేర్కొన్నారు.

**అప్పుడు ఎద్దేవా చేశారు..**

వరద కాలువ తవ్వకాల సమయంలో అప్పటి టీడీపీ, ప్రస్తుత టీఆర్ఎస్ నేతలు చేసిన విమర్శలను గుర్తుచేస్తూ, "అప్పుడు ఎద్దేవా చేసిన వారు ఇప్పుడు అదే కాలువ సాగు నీటికి జీవనదిగా మారిన విషయాన్ని అంగీకరించాలి" అని అన్నారు. ఎస్సారెస్పీ లో నీటి కొరత తలెత్తినప్పటికీ, సమస్యను వెంటనే పరిష్కరించి రైతులకు నీరు విడుదల చేసినట్లు వివరించారు. కొంతమంది రైతుల ముసుగులో రాజకీయాలు చేయడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు.

**సూరమ్మ చెరువు కుడి-ఎడమ కాలువలు త్వరలో..**

కలికోట సూరమ్మ చెరువు మత్తడి నిర్మాణం పూర్తయిందని, ప్రస్తుతం కట్ట పనులు జరుగుతున్నాయని తెలిపారు. త్వరలోనే కుడి, ఎడమ కాలువలను సేకరించి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. మంగళవారం నాడు ముఖ్యమంత్రిని కలిసి, కుడి-ఎడమ కాలువల నిర్మాణానికి అదనపు నిధులు మంజూరు చేయాలని కోరామని..దానికి ఆయన వెంటనే స్పందిస్తూ సంబంధిత అధికారులను ఆదేశించారనీ ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ గుర్తు చేశారు. రానున్నవి మరిన్ని రోజులని అభివర్ణించారు.

# యువతే మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిరోధించాలి




- ప్రభుత్వ ఆదేశాల మేరకు మెట్‌పల్లి డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ

**నేటి సాక్షి-మెట్‌పల్లి :** మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిరోధించాలని మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వేంకయ్య యువతకు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం, కళాశాల విద్యా కమిషనర్ (సీసీసీ) ఏ. శ్రీ దేవసేన, జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి.ఎస్.ఆర్. రాజేంద్ర సింగ్ ఆదేశాల మేరకు బుధవారం కళాశాల ఆవరణలో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, "గంజాయి, కొకాయిన్, హెరాయిన్ వంటి మాదక ద్రవ్యాలకు యువత బానిస అవుతోంది. ఈ వ్యసనాన్ని నివారించడానికి ఆధునిక యువత ముందుకు రావాలి. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. అందుకు యువత సహకరించాలి" అని విజ్ఞప్తి చేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టి. దేవన్న మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత ఆర్థిక, శారీరక, మానసిక నష్టాలను ఎదుర్కొంటున్నారని, వాటి ఉత్పత్తి, సరఫరా, వినియోగం నేరమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ బిల్ల రాజేందర్, లెక్చరర్లు అంజయ్య, దశరథం, శ్రీకాంత్, సత్యశోధన్, బోధనేతర సిబ్బంది లక్ష్మీనారాయణ, బాబు, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు బానిసలైతే బతుకు ఛిద్ర మవుతుంది

**డాక్టర్ ముప్పా రామారావు.**




**నేటి సాక్షి మిర్యాలగూడ రూరల్ ఆగస్టు 13:** మత్తు పదార్థాలకు బానిసలు అయితే బతుకు ఛిద్ర మవుతుందని తన మరణాన్ని తానే కొని తెచ్చుకోవాల్సి ఉంటుందని జనవిజ్ఞాన వేదిక జాతీయ సలహాదారు డాక్టర్ ముప్పా రామారావు అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలం అవంతిపురం గిరిజన గురుకుల బాలుర కళాశాలలో విద్యా- శాస్త్రీయ దృక్పథం అనే అంశంపై జన విజ్ఞాన వేదిక సమూహ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముప్పా రామారావు మాట్లాడుతూ డ్రగ్స్ గంజాయి తదితర మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని విద్యార్థులు చెడు అలవాట్లకు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎంతో కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రుల కలలను నెరవేర్చ వలసిన బాధ్యత విద్యార్థులపై ఉందని అన్నారు. సమూహ రైటర్స్ ఫోరమ్ నాయకులు కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం పరిశీలన ప్రయోగాలపై దృష్టి పెట్టి ప్రతి విషయాన్ని గుడ్డిగా నమ్మకుండా శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని అన్నారు. భారత్ బచావో నల్గొండ జిల్లా అధ్యక్షురాలు ఉదయ మాట్లాడుతూ రాజ్యాంగ పీఠికను ప్రతి ఒక్క విద్యార్థి చదవాలని స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు దాటినప్పటికీ స్వేచ్ఛ సమానత్వం స్వాతంత్రం అనే పదాలు మచ్చుకైన కనిపిస్త లేవని అన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్ ప్రిన్సిపాల్ జాను నాయక్, వైస్ ప్రిన్సిపాల్ రాజరత్నం, అధ్యాపకులు అజయ్ కుమార్ సక్రు పీడీ మంగ్యా నాయక్, యాదయ్య కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీ

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కే లలితాదేవి.**

**నేటి సాక్షి వికారాబాద్:** వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే లలితాదేవి బుధవారం మోమిన్ పెట్, బంటారం, నాగసముందర్, ధరూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.





వైద్యాధికారులను సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిరంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందిని పర్యవేక్షించాలని రాబోయే మూడు రోజులపాటు భారీ వర్షాల హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో సిబ్బంది అందరూ కూడా వారి వారి హెడ్ క్వార్టర్లలో ఉండాలని రాబోయే అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. పై ఆకస్మిక తనిఖీ చేసిన నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 108 వాహనాలను పరిశీలించారు. ఆక్సిజన్ సౌకర్యము తోపాటు వాహనంలో అందుబాటులో ఉండాల్సిన 44 రకాల అత్యవసర వైద్యపరికరాలు అందుబాటులో ఉండి అవి పని చేసే స్థితిలో ఉండాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులలో 108 కు ఫోన్ కాల్ వచ్చిన వెంటనే సత్వరమే స్పందించి బాధితులకు సత్వరమే వైద్య సేవలు అందిస్తూ దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాలి అని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
గురువారం
14 ఆగస్టు 2025


# రానున్న మూడు రోజుల్లో రెడ్ అలెర్ట్


- నిరంతర వర్షాల నేపథ్యంలో నిరంతర వర్షాల నేపథ్యంలో రానున్న మూడు రోజుల్లో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం.
- వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించినందున అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి.
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**నేటి సాక్షి వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా కలెక్టరేట్లోని ఎన్ ఐ సి కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అధికారులతో కలిసి భారీ వర్షాల వల్ల తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, వన మహోత్సవం, ఇందిరమ్మ ఇండ్లపై ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశము నిర్వహించారు. రానున్న మూడు రోజులు సెలవులు ఉన్నందున అనంతగిరి కి పర్యాటకులు ఎవ్వరు కూడా రాకుడదని, అనంతగిరి ట్రెక్కింగ్ ను మూసి వేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అదికారులందరూ హెడ్ క్వార్టర్ మేంటైన్ చేయాలనీ, ఎలాంటి సెలవులు ఇవ్వడం జరుగదని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్ అలెర్ట్ ప్రకటించినందున జిల్లా లో ప్రజలు ఎవ్వరు కూడా అత్యవసర మైతే తప్ప బయటికి రాకూడదని , ప్రజలకు , పశువులకు, ఎలాంటి ప్రాణ నష్టం జరుగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లా లో ఆయా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు తమ యాక్షన్ టీంలకు సంబంధించి ఫీల్డ్ ఆఫీసర్లు, సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని, తప్పనిసరిగా కంట్రోల్ రూమ్లను ఏర్పాటు చేసుకుని 24/7 అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. విద్యుత్, రెవెన్యూ, పోలీసు, ఆర్అండ్ బీ, పంచాయితీరాజ్, ఇరిగేషన్ శాఖలను సమన్వయం చేసుకుని ప్రమాదకరంగా ఉండే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా భారీ వర్షాల వల్ల జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం (మనుషులు/ జంతువులు) జరగకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. పశువులకు వ్యాదులు రాకుండా వెటర్నరి సిబంది అందుబాటులో ఉండి సరిపడా మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. పాఠశాలలు, హాస్టల్స్తో పాటు శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి ఖాళీ చేయించాలని, పురాతన భవనాల్లోని సాధారణ పౌరులను కూడా సురక్షిత భవనాలకు తరలించాలన్నారు. పెద్ద ఎత్తున (15 సెంటీ మీటర్ల )వర్షం పడినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, భారీ వర్షాలపై మున్సిపాలిటీల్లో, మండలాల్లో ప్రజలకు ప్రచారం ద్వారా అవగాహన కల్పించాలని, ఫంక్షన్ హాల్స్ సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ తెలిపారు. ప్రమాదరంగా ఉన్న చెరువులు, ప్రాజెక్టులను పరిశీలించి లీకేజీలు ఉంటేగుర్తించి వెంటనే పరిష్కరించాలని, షార్ట్ సర్క్యూట్ జరగకుండా విద్యుత్ శాఖ అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. వర్షాల నేపథ్యంలో యూరియా కొరత లేకుండా చూడాలని, ముందస్తుగా నిల్వ చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారికి ఆయన సూచించారు. రోడ్లపై విరిగిన చెట్లను అప్పటికప్పుడు తొలగించాలని, భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో ఫీల్డ్లో ఉండాలని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడి , స్కూల్స్ , రెసిడెన్షియల్ లలో ఎలాంటి సమస్య రాకుండా చూడాలన్నారు. గజ ఈతగాళ్ళు, ఫిషర్ మెన్స్ ను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారికి ఆదేశించారు. జిల్లా లో 155 సబ్ సెంటర్లు, పబ్లిక్ హెల్త్ సెంటర్లు , అర్బన్ పబ్లిక్ హెల్త్ సెంటర్ల లో యాంటి స్నేక్ వినాన్ ASV మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి సెంటర్ లో ఎ ఎన్ ఎం ద్వార ఇంజక్షన్ తీసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్ పి నారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఎస్ పి నారాయణ రెడ్డి మాట్లాడుతూ అధికారులు ,సిబ్బంది అందరు అందుబాటులో ఉండి భారి వర్షాల నేపథ్యంలో జిల్లా లో ఎలాంటి ప్రాణ నష్టం, పశువుల నష్టం, జరుగకుండా అన్ని శాఖల సమన్వయం తో పని చేయాలనీ అధికారులకు ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో కాజువే ల దగ్గరకు ప్రజలు ఎవ్వరు కూడా వెల్ల కుండ బారికేడ్స్ ఏర్పాటు చేయడము జరుగుతుందన్నారు. 72 గంటలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ ఏ సమస్య వచ్చిన రెండు బృందాలు రోప్ తో రెడి గా ఉంటారని తెలిపారు. ఎస్ డి ఆర్ ఎఫ్, ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలు తో సమన్వయము చేసుకుంటామన్నారు. వరదలు, ప్రమాదాలు సంభవిస్తే అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 7995061192, 08416235291 కు సమాచారం అందించాలని, కంట్రోల్ రూం 24 గంటకు పనిచేస్తుందని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుధీర్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ , అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి,ఆర్డి ఓ వాసు చంద్ర. ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాగారం గ్రామంలో ప్రైమరీ స్కూల్ ని ఆకస్మిక తనిఖీ

- పెద్దపులి నాగారం ప్రైమరీ స్కూల్లో వరద పంపు ప్రాంతాలలో సందర్శించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిరెడ్డి
- ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవడం నేరమా అంటూ వచ్చిన కథనాలను చూసి వెంటనే స్పందించిన మాజీ మంత్రి




**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం ఆగస్టు 13 :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం పరిధిలోని పెద్దపులి నాగారం గ్రామంలో ప్రైమరీ స్కూల్ ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కాసేపు విద్యార్థులతో ముచ్చటించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్న పెద్దపులి నాగారం ప్రైమరీ స్కూల్లో ఫర్నిచర్ ఉండగా వాటిని ఉపయోగించకుండా పక్కనపెట్టి



విద్యార్థులను నేల పై కూర్చోబెట్టడాన్ని గమనించిన మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి స్కూల్ ప్రిన్సిపల్ పై మండిపడ్డారు..స్కూల్ ఆవరణలో వర్షపు నీరు నిలువ ఉండడంతో సంబంధిత అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే త్వరిత గతిన ఈ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పిఎసిఎస్ చైర్మన్ మంచే. పాండు యాదవ్, మాజీ సర్పంచ్ బందారు. లింగంను ఆదేశించారు సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ :- తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రభుత్వ స్కూళ్లకు కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించామన్నారు కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ మంచే పాండు యాదవ్,వైస్ చైర్మన్ డి వెంకటేశ్వర రెడ్డి , బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏ రాజు నాయక్, సీనియర్ నాయకులు పి. సుధాకర్ రెడ్డి, డి శ్రీనివాస్, ఎం. నవీన్, జాన్ రెడ్డి, మాజీ సర్పంచ్ లింగం, పిఎసిఎస్ డైరెక్టర్ కే. ప్రభాకర్, ఎక్స్ ఎంపీటీసీ టీ.రవీందర్, ఎక్స్ ఉపసర్పంచ్ లతీఫ్ ఖాన్, రాజు,ఎం. రాఘవేందర్ రెడ్డి, శివ, వి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# 72 గంటలు అప్రమత్తంగా ఉండండి

## అధికారులకు సూచించిన కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి



**నేటి సాక్షి ఉప్పల్ ఆగస్టు 14 :** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో 72 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి సూచించారు జీహెచ్ఎంసీ, హైడ్రా, విద్యుత్, రెవెన్యూ, ఇతర అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన విధంగానే వివిధ విభాగాల అధికారులతో బుధవారం కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి వార్డు కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు విభాగాల వారీగా అధికారులు, సిబ్బంది వర్షాల నేపథ్యంలో ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలు గురించి చర్చించారు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తితే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు కూడా సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో ఈఈ హరిలాల్ నాయక్ శానిటైజర్ డిఈ చందన వాటర్ వర్క్స్ మేనేజర్, సత్యనారాయణ ఏఈ రాజ్ కుమార్ హైడ్రా మార్షల్ వీరేందర్ ఎంటమాలజీ సూపర్వైజర్ మహేందర , అజయ్ ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు, బాకారం లక్ష్మణ్, ఈగ ఆంజనేయులు ముదిరాజ్, బజారు జగన్నాథ గౌడ్, లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవి రెడ్డి, భాస్కర్ రెడ్డి, సుంకు, శేఖర్ రెడ్డి, కుసంగుల సతీష్ ముదిరాజ్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# బడంగ్ పెట్ లో హర్ ఘర్ తిరంగా

## తెలంగాణ బిజెపి సంఘటన మంత్రి చంద్రశేఖర్, శ్రీరాములు అందెల





**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం ఆగస్టు 13:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించినటువంటి హర్ ఘర్ కార్యక్రమంలో.. 79వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈరోజు మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించినటువంటి హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ బిజెపి సంఘటన మంత్రి శ్రీ చంద్రశేఖర్ జి మరియు రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు త్రివర్ణ పతాకాలతో భారత్ మాతాకీ జై నినాదాలతో సాంస్కృతిక కార్యక్రమాలతో ఎంతో ఉత్సాహంగా తమ దేశ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సీఈఓ మల్కా యశస్వి, కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు రామిడి వీరకర్ణ రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, గూడెపు ఇంద్రసేన తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిరోధకంపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ప్రతిజ్ఞ.



**నేటి సాక్షి వికారాబాద్ :** మాదక ద్రవ్యాల నిరోధకం పై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్ పి నారాయణ రెడ్డి తో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ‘‘నేను మాదక ద్రవ్యాల పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, నేను డ్రగ్స్ రహిత జీవన శైలిని అనుసరిస్తూ, నాతో పాటు ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తానని, నేను డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేయుచున్నాను.”ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుధీర్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ , అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఆర్డి ఓ వాసు చంద్ర. ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ నాయకులపైననా మీ కుట్రలు కుతంత్రాలు



**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం ఆగస్టు 13 :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలంలో బుధవారం విలేఖ-రులకు అందజేసిన ఒక ప్రకటనలో...రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి మాట్లాడుతూ..మూడున్నర కోట్ల ప్రజల ఆకాంక్ష. అరవైయేండ్ల నిరీక్షణ.‘మా తెలంగాణ మాగ్గావాలె’ అని.. ఊరూవాడ ఒక్కటి చేసి సబ్బండ వర్ణాలను ఏకంచేసి తెలంగాణ సాదనలో కీలక పాత్ర వహించిన కోదండరామ్ పైననా మీ కుట్రలు నిఖార్సయిన ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని మంటగలపడానికి, అస్తిత్వాన్ని అవహేళన చేయడానికి బిఅర్ఎస్ పన్నని కుట్రలు లేవు. ఆడని డ్రామా లేదు. నాడు సమక్యవాదుల కుతంత్రాలను తిప్పికొట్టడానికి.. ఉద్యమ తీవ్రతను.. స్వరాష్ట్ర ఆకాంక్షను ప్రపంచానికి చాటి చెప్పడానికి దండోరా వేసి.. దండును కూడగట్టి.. ‘జై తెలంగాణ’ అంటూ పురుడు పోసుకున్నది కోదండరామ్ ఛైర్మన్ గా తెలంగాణ జెయింట్ యాక్షన్ కమటి. వారి ఆద్వర్యంలో సకల జనుల సమ్మె, సాగరహారం లాంటి అందోలనలతోనే కదా తెలంగాణ రాష్ట్రం సహకారం అయ్యింది. అలాంటి నికాసైన తెలంగాణ ఉద్యమ నాయకుడి పైనానా మీ అక్కసు.తెలంగాణ. ఆత్మగౌరవ ప్రతీకగా పరిపాలనా కొనసాగాలి అన్నందుకా, తెలంగాణ అస్తిత్వాన్ని గొప్పగా చాటేలా పరిపాలన ఉండాలన్నందుకా కోదండరామ్ గారిపైనా పగా.. తెలంగాణ పునర్నిర్మాణంలో ఎక్కడ ముఖ్య భూమిక పోషిస్తాడో అన్న దుష్ట సంకల్పంతో కోదండరామ్ ని పరిపాలనలో భాగస్వామ్యం కాకుండా చేసింది బిఅర్ఎస్. బిఅర్ఎస్ చేసే కుట్రలను తెలంగాణ ప్రజలు హర్షించరు అని బిఅర్ఎస్ నాయకులు గ్రహించాలని పాండురంగా రెడ్డి అన్నారు కప్పాటి పాండురంగా రెడ్డి రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్

నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..




# ఎరువులు బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్న అధికారులు

- వికారాబాద్ జిల్లాలో యూరియా, డిఏపి కొరత,
- సి ఎం ఎస్, పి ఏ సి ఎస్ లలో ఎరువులు అందుబాటులో ఉంచాలి.
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కి రైతు సంఘం, సిపిఎం నాయకులు మెమొరాండం.

**నేటి సాక్షి వికారాబాద్:** వికారాబాద్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్ కి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మదులపల్లి సుదర్శన్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్, బృందం కలిసి రైతులకు ఎరువులు యూరియా డిఏపి ఇతర ఎరువులు అందుబాటులో ఉంచాలనీ, యూరియా డిఎపి బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే అనేకసార్లు వ్యవసాయ అధికారులకు జిల్లా కలెక్టర్ కి ఎరువుల కొరత ఉండకుండా చూడాలని ఫిర్యాదు చేసిన, ప్రభుత్వం చెప్పిన దాన్ని భేతాగారు చేస్తూ పిఏసిఎస్, సి ఎం ఎస్ ఆఫీసులలో యూరియా డిఏపి ఇతర ఎరువులు అందుబాటులో ఉంచకుండా బ్లాక్ మార్కెట్కు తరలిస్తు వ్యాపారవేత్తల దగ్గర డబ్బులకు కక్కుతి



పడుతున్న ఎక్కువ ధరలకు అమ్ముతున్న అధికారులపై వ్యాపార వేత్తలపై చట్టపరమైన చర్యలు తీసుకొని, ఎరువులు ప్రభుత్వం నిర్ణయించిన రేటుకు అన్ని దుకాణాలలో షాపులలో విక్రయించాలని, ఎక్కువ రేటుకు అమ్ముతున్న బ్లాక్ మార్కెట్ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతు సంఘం, సిపిఎం జిల్లా కమిటీ తరఫున ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నాం. లేనిచో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నాము. ఈ కార్యక్రమంలో రైతు సంఘం, సిపిఎం జిల్లా నాయకులు సుదర్శన్ నవీన్ కుమార్, లక్ష్మయ్య శ్రీనివాస్, ప్రవీణ్, లాలయ్య రవికుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు

# సాయి అనిల్ కుటుంబానికి అండగా ఉంటాం

**సాయి అనిల్ కుటుంబాన్ని పరామర్శించిన శ్రీరాములు అందెల**



**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం ఆగస్టు 13:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పెట్ మున్సిపల్ కార్పొరేషన్ 30వ డివిజన్ లోని లక్ష్మీ దుర్గ కాలనీ వాస్తవ్యులు పుల్లప్ప కుమారుడు సాయి అనిల్ కుమార్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు.. విషయం తెలుసుకున్న లిరంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు ఈరోజు ఉదయం సాయి అనిల్ నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యాన్ని అందించారు. జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు గుర్రం మల్లారెడ్డి రాష్ట్ర బీసీ మోర్చా నాయకులు మాజీ సర్పంచ్ నడికుడ యాదగిరి కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్లు గౌరమాదేవి శ్రీనివాస్ బంగారు అనిత ప్రభాకర్ బిజెపి సీనియర్ నాయకులు లోకం సందీప్ కుంటి భాస్కర్ తీగల సురేందర్ రెడ్డి దేశపాక జగన్ ఉపాధ్యక్షులు సైదులు, ప్రధాన కార్యదర్శి కొంతం మురళీధర్ రెడ్డి కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, రాజ్ కుమార్, బీజేవైఎం నాయకులు రాహుల్, భువనచందర్ పాల్గొన్నారు.

# ఒక్కరి కోసం అందరు..అందరి కోసం ఒక్కరు...!

**మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు**



**నేటిసాక్షి, రాయికల్ :** మనమంతా ఐక్యంగా ఉండి సమస్యలు ఎదురైనప్పుడు ఒక్కరి కోసం అందరు .. అందరి కోసం ఒక్కరుగా కలిసికట్టుగా ముందుకు సాగాలని మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు . రాయికల్ పట్టణ పద్మశాలి సేవా సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం కార్యక్రమం పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు రుద్ర శ్రీనివాస్ హాజరై 2025 -,27 సంవత్సర నూతన అధ్యక్షులుగా భోగ రాజేశం,ఉపాధ్యక్షుడిగా దాసరి గంగాధర్,ప్రధాన కార్యదర్శిగా కడకుంట్ల నరేష్,కోశాధికారిగా ఆడెపు నర్సయ్య లచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత సంవత్సరం చేపట్టిన సేవా కార్యక్రమాలను అభినందించారు. సంఘ సభ్యులను సమన్వయం చేసుకునేందుకు సంఘంలో చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని సభ్యులకు సమాచారం అందిస్తూ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా తెలపాలని సూచించారు. మనందరం ఐక్యంగా ఉంటే భవిష్యత్తులో సంఘ అభివృద్ధికి ప్రభుత్వం నుండి నిధులు పొందేందుకు తోడ్పడుతుందన్నారు. సంఘం ఎన్నికలు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం కోసం మాత్రమేనని తదనంతరం అందరం కలిసికట్టుగా ఐక్యంగా ఉండి ఆర్థికంగా,సామాజికంగా,రాజకీయంగా ఎదగాలన్నారు. విద్యార్థులకు విద్య పట్ల ప్రోత్సాహం, విద్య ఉపకరణాల కల్పన, ఆరోగ్యం,నిరుపేదలకు ప్రోత్సాహం లాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం నూతన అధ్యక్షులు భోగ రాజేశం మాట్లాడుతూ సంఘ సభ్యులు సహకారంతో పద్మశాలి సేవా సంఘ అభివృద్ధికి నిరంతరం పాటుపడతానన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు తాటిపాముల విశ్వనాథం,హనుమాన్ దేవాలయ కమిటీ చైర్మన్ దాసరి గంగాధర్,రాష్ట్ర కార్యదర్శి జక్కుల చంద్రశేఖర్,మాజీ కార్యదర్శి మామిడాల లక్ష్మీనారాయణ మాజీ ఉపాధ్యక్షులు శ్రీరాముల సత్యనారాయణ, సిరిపురం రఘు,మాజీ కోశాధికారి నర్సయ్య ఫోపా అధ్యక్షులు ఎలిగేటి రాజ్ కిషోర్,పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు సామల్ల సతీష్,ఉపాధ్యక్షులు సింగని సతీష్,ప్రధాన కార్యదర్శి లిఆడెపు రాజీవ్,కోశాధికారి బొమ్మ కంటి నవీన్,సంయుక్త కార్యదర్శి అనుమండ్ల తేజ, పోప సభ్యులు దాసరి రామస్వామి,గాజంగి రాజేశం, సింగని రాందాస్,సామల్ల గంగాధర్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల మారిన ఆర్టీసీ బస్టాండ్



**నేటి సాక్షి, నారాయణపేట, ఆగస్టు 13:** నారాయణపేట జిల్లాలో బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి మరికల్ ఆర్టీసీ బస్టాండ్ చెరువుల మారింది. గతంలో పాలకులు ఆర్టీసీ బస్టాండ్ నిధులు కేటాయించిన శిలాఫలకాలికే పరిమితమైంది. పట్టించుకునే నాథుడే లేడని మరికల్ ఆర్టీసీ బస్టాండ్ చూసిన జనాలు విమర్శిస్తున్నారు. ఇకనైనా మరికల్ ఆర్టీసీ బస్టాండ్ మరమ్మతుల పనులు చేపట్టాలని పలు ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# పుణ్యక్షేత్రాల్లో భద్రత కట్టుదిట్టం

**ధర్మపురి, కొండగట్టులో డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీమ్ తనిఖీలు**



- జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలపై ప్రత్యేక డ్రైవ్
- రద్దీ పాయింట్లపై ప్రత్యేక దృష్టి

**నేటి సాక్షి - జగిత్యాల (రాధారపు నర్సయ్య) :** జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో భద్రతను మరింత బలోపేతం చేయడానికి పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం, కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానాల్లో డాగ్ స్క్వాడ్‌తో పాటు బాంబ్ డిస్పోజల్ (బిడి) టీమ్‌ల సహకారంతో సమగ్ర తనిఖీలు నిర్వహించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే దృష్ట్యా, ప్రవేశ%-%నిష్క్రమణ మార్గాలు, దర్శన క్యూలైన్లు, గుడులు, పార్కింగ్ ప్రాంతాలు, వసతిగృహాలు, పరిసర ప్రాంగణాలను పద్ధతిగా పరిశీలించారు.

## మూలమూలన క్షుణ్ణంగా తనిఖీ..

తనిఖీల్లో భాగంగా ఆలయాల ప్రధాన ద్వారాల వద్ద బ్యాగేజీ స్క్రీనింగ్, లోహ నిర్ధారణ పరికరాల ద్వారా తనిఖీలు, అనుమానాస్పద ప్యాకేజీలు/సంచులపై ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. పార్కింగ్ స్థలాలు, రద్దీ పెరుగే మార్గాలపై అదనపు బందోబస్తు ఏర్పాటు చేయగా, క్యూలైన్‌ల వద్ద క్రమశిక్షణ కోసం సిబ్బందిని మోహరించారు.

## భద్రత మరింత కట్టుదిట్టం : ఎస్పీ

ఈ సందర్భంగా ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. 'ముఖ్యమైన ఆలయాలు, పుణ్యక్షేత్రాలు, పండుగలు మరియు ప్రత్యేక రోజుల్లో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేస్తామన్నారు. ప్రజల సహకారంతోనే భద్రతా చర్యలు సమర్థవంతంగా కొనసాగుతాయని..' పేర్కొన్నారు. అనుమానాస్పద వస్తువులు, వాహనాలు లేదా వ్యక్తులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా 100 నంబర్‌కు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

## తనిఖీల కీలక అంశాలు

ప్రవేశ, నిష్క్రమణ నియంత్రణ: ప్రధాన గేట్ల వద్ద చెక్‌పాయింట్లు, బ్యాగ్ చెకింగ్, క్యూలైన్‌లలో గ్యాప్‌లు లేకుండా మార్గదర్శక బారికేడ్లు. ప్రాంగణ స్కానింగ్: మండపాలు, యాగశాలలు, హుండీ పరిసరాలు, ప్రసాద వితరణ కౌంటర్లుడాగ్ స్క్వాడ్‌తో పద్ధతిసంధాన తనిఖీలు. పార్కింగ్ అండ్ వసతి గృహాలు: నిబంధిత పార్కింగ్‌లో వాహనాల ధృవీకరణ, వసతి గృహాల కారిడార్లు, సామూహిక ప్రదేశాల పరిశీలన. రద్దీ పాయింట్ల పర్యవేక్షణ: ప్రత్యేక టీమ్‌లు, మొబైల్ పెట్రోలింగ్, అనౌన్స్‌మెంట్ డెస్క్ ద్వారా జాగ్రత్త సూచనలు.

## భక్తులకు సూచనలు

అవసరమైన వస్తువులే తెచ్చుకోవాలి, పెద్ద బ్యాగులు/బ్యాక్‌ప్యాక్‌లు నివారించండి. నిర్వాహకులు, పోలీసు సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించండి. సందేహాస్పద ప్యాకెట్/సంచి/వాహనం కనిపిస్తే తాకకుండా, వెంటనే సమీప సిబ్బందికి తెలపండని ఎస్పీ సూచించారు.

## డయల్ 100.

పార్కింగ్ కు కేటాయించిన ప్రాంతాల్లోనే చేసి, వాహనాలపై తాళాలు, డాక్యుమెంట్లు భద్రంగా ఉంచండి. చిన్నారులు, వృద్ధులు సురక్షితంగా ఉండేలా క్యూలైన్లలో విడిపోకుండా జాగ్రత్త పడండి. జిల్లా పోలీసు ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ ప్రత్యేక డ్రైవ్‌తో భక్తులకు భద్రతాభావం పెరగడంతో పాటు, ఆలయాల నిర్వహణ సక్రమ పద్ధతిలో కొనసాగేందుకు అవసరమైన వాతావరణం ఏర్పడుతుంది. పండుగల నేపథ్యంలో ఇదే తరహా తనిఖీలను ఇతర పుణ్యక్షేత్రాల్లో కూడా దశలవారీగా కొనసాగించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

# కోరుట్ల కోట బురుజులను కాపాడాలని విజ్ఞప్తి

- చారిత్రక వారసత్వం రియల్టర్ల ముప్పులో..
- కొత్త జివోలను రద్దు చేసి మార్కెట్, పార్క్ ఏర్పాటు చేయాలని డిమాండ్
- చర్యలు తీసుకుంటానన్న ఎంపీ అరవింద్

**నేటి సాక్షి కోరుట్ల (రాధారపు నర్సయ్య) :** జగిత్యాల జిల్లా కోరుట్లలో చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన కోట బురుజులు, కోనేరు, వాటి పరిసర స్థలాలు నేటి భూకబ్జా ముఠాలకు బలవుతున్నాయని వామపక్ష ప్రజాసంఘాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాయి. కేవలం రాతి గోడలే కాక, ఒక కాలానికి సాంస్కృతిక, రాజకీయ, సైనిక ప్రతాపానికి ప్రతీకలైన ఈ కోట భాగాలు క్రమంగా నిర్లక్ష్యం, అక్రమాల పాలవుతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది.

## ఎంపీ అరవింద్‌కు-జేఏసీ విన్నపం

బుధవారం నిజామాబాద్‌లోని ఎంపీ నివాసంలో వామపక్ష ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పేట భాస్కర్, సిపిఐ, సిపిఎం, న్యూ డెమోక్రసీ, అంబేద్కర్ సంఘాల జిల్లా నాయకులు చెన్న విశ్వనాథం, చింత భూమేశ్వర్, తిరుపతి నాయక్, భూపెల్లి నగేష్ లు కలిసి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్‌ను కలిశారు. కోట బురుజుల రక్షణ కోసం గతంలో అనేక సార్లు పోరాటాలు జరిపినా ఫలితం రాలేదని, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## కబ్జా ముఠాల కుట్రలు

స్థానిక నాయకులు, రియల్టర్లతో కుమ్మక్కై దసరా ఉత్సవాలలో దుర్గాదేవి మహిషాసురవధ స్థలం, కోట బురుజులు, కోనేరు పరిసర భూములను అన్యాక్రాంతం చేయడానికి పాత జివోలు రద్దు చేసి, కొత్త జివోలు తెప్పించారని ఆరోపించారు. భూములను అమ్మేసి భవిష్యత్తులో బురుజులను పూర్తిగా తొలగించాలనే కుట్ర నడుస్తోందని వెల్లడించారు.




కోరుట్ల ప్రజల డిమాండ్ కూడా..

కోరుట్ల మనవడిగా, స్థానిక పార్లమెంట్ సభ్యుడిగా ప్రజలకు న్యాయం చేయాలని ఎంపీ అరవింద్‌ను కోరారు. కొత్త జివోలను రద్దు చేసి, బురుజుల స్థలాల్లో నూతన మార్కెట్, అహ్లాదకరమైన పార్కును ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ క్రమంలో పురవస్తు శాఖ సాయం తీసుకోవాలని సూచించారు.

## ఎంపీ అరవింద్ స్పష్టమైన హామీ

వినతిపత్రాన్ని స్వీకరించిన ఎంపీ అరవింద్, ఈ సమస్యపై సానుకూలంగా స్పందించారు. పురవస్తు శాఖతో పాటు సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కోట వారసత్వాన్ని కాపాడే దిశగా అవసరమైన సహకారం అందిస్తానని ఆయన స్పందిస్తూ ఈమేరకు జేఏసీకి స్పష్టమైన భరోసా ఇచ్చారు.

## ఇదీ కోరుట్ల కోట చారిత్రక నేపథ్యం

కోరుట్ల కోట, కాకతీయ కాలం నుంచి ఆవిర్భవించిన ప్రాచీన నిర్మాణాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. అనంతరం ముస్లిం పాలనలో, నిజాం శాసనకాలంలో కూడా ఈ కోట వ్యూహాత్మక కేంద్రమైంది. బురుజులు రక్షణ గోడలుగా, కోనేరు త్రాగునీటి వనరుగా, కోటలోని దేవాలయాలు సాంస్కృతిక కేంద్రాలుగా నిలిచాయి. నేటికీ కోట బురుజుల వద్ద దసరా ఉత్సవాలు, దుర్గాదేవి మహిషాసురవధ జాతర జరుగుతూ పట్టణానికి ప్రత్యేకతను తీసుకొస్తాయి. ఊపందుకున్న ప్రజా స్పందన కోరుట్ల ప్రజలు, వామపక్ష సంఘాలు, చరిత్రాభిమానులు కోటను కాపాడడం కేవలం వారసత్వ రక్షణ కాకుండా, భవిష్యత్తు తరాలకు చరిత్రను అందించడం అనీ భావిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు, భూముల విక్రయాలపై వెంటనే చర్యలు తీసుకోకపోతే ఈ వారసత్వం శాశ్వతంగా నష్టమవుతుందన్న ఆందోళన క్రమంగా విస్తరిస్తోంది.!

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
గురువారం
14 ఆగస్టు 2025


# జగిత్యాల జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై దృష్టి



## పలువురు మంత్రుల సమీక్ష

**నేటి సాక్షి - జగిత్యాల (రాధారపు నర్సయ్య) :** జగిత్యాల జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర మంత్రులు సూచించారు. బుధవారం జగిత్యాల జిల్లాకు పలు కార్యక్రమాల నిమిత్తం విచ్చేసిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మరియు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జగిత్యాల జిల్లా మెడికల్ కాలేజీ గెస్ట్ హౌస్‌లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంత్రులకు పూలమొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్, చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం పాల్గొన్నారు.

### సమీక్షలో చర్చించిన అంశాలు ఇవీ.!

అభివృద్ధి, పరిశ్రమల ప్రోత్సాహక పథకాల పురోగతి గురించి చర్చించారు. అదేవిధంగా సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత ఉండాలని సూచించారు. ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన సేవలందించడంలో ఎలాంటి పక్షపాత వైఖరి చూపకూడదన్నారు. మంత్రులు ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని హామీ ఇస్తూ, త్వరలో మరిన్ని అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్, జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ మరియు ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# దిందా పోడురైతుల పాదయాత్రకు బిఆర్ఎస్ మద్దతు

## బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్




**నేటి సాక్షి కొమరం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి ఆగస్టు 13 :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దిందా గ్రామం నుండి బయలుదేరిన రైతులను గద్వాల్ జిల్లా ములుగు లో చేరిన పాదయాత్ర. కు రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ . మద్దతు పలికినారు గత 50 ఏళ్లుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్న దిందా రైతులను ఈ ఏడాది వ్యవసాయం చేసుకోనివ్వకుండా అటవీ అధికారులు అడ్డుకోవడంతో, గతంలో ధర్నా చేసిన రైతులు ఎవరూ పట్టించుకోక పోవడంతో రాష్ట్ర ముఖ్యమంత్రికి కలిసి తమ బాధను చెప్పుకోవడానికి గ్రామ రైతులు దిందా నుండి హైదరాబాద్ కు 400 కిలో మీటర్లు పాదయాత్ర చేపట్టారు. గజ్వేల్ నియోజకవర్గం ములుగు ప్రాంతానికి చేరుకోవడంతో వారిని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోడు రైతులను కలిసి వారితో పాటు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిర్పూరు నియోజకవర్గానికి చెందిన దిందా గ్రామస్థులు కేవలం పోడు వ్యవసాయం మీదనే ఆధారపడి బతుకుతున్నారని, ఏడాదికి ఒక పంట వేసుకొని బతుకుతుంటే, ఇపుడు ప్రభుత్వం ఉన్న భూమిని కూడా లాక్కోవడంతో వారు రోడ్డున పడ్డారన్నారు. అటవీ అధికారులు దౌర్జన్యంగా వారి ఇళ్ల చుట్టూ గుంతలు తీసి, రైతులను భూముల్లోకి పోనివ్వడం లేదన్నారు. ఎంత వేడుకున్నా, ఎన్ని రోజులు శాంతియుత ధర్నా చేసినా వినకుండా అరెస్టు చేసి రైతులను జైలుకు పంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డికి ఈ పేద రైతులంటే ఎందుకింత కోపమని నిలదీశారు. వారు భూస్వాములు కాదని, వారికి వందల ఎకరాల భూములు లేవని, వారిలో పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులు లేరని స్పష్టం చేశారు. కేవలం పోడు చేసుకుని బతికే రైతులను జీవో నెం 49 తెచ్చి భూమిని గుంజుకోవాలని చూస్తుందని ఆరోపించారు. రైతులు మహారాష్ట్ర సరిహద్దు నుండి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేస్తున్నా ముఖ్యమంత్రి స్పందించక పోవడం దారుణమన్నారు. ఈ రైతులే అసలైన అటవీ రక్షకులని, వారు లేకపోతే అడవిని ఎప్పుడో భూస్వాములు కబ్జా చేసేవారని తెలిపారు. అలాంటి పేద రైతులను అరెస్టు చేసి ఇబ్బందులకు గురించేస్తే, రేవంత్ రెడ్డి సర్కార్ కు రైతుల ఉసురు తగులుతుందన్నారు. అటవీ చట్టాలను పోడు రైతులను ఉల్లంఘించలేదన్నారు, కంచ గచ్చిబౌలి అటవీ ప్రాంతాన్ని రాత్రికి రాత్రే నాశనం చేసి వణ్యప్రాణులను చంపి రేవంత్ రెడ్డి ప్రభుత్వమే అటవీ చట్టాన్ని ఉల్లంఘించారని అందుకే ముఖ్యమంత్రిపై అటవీ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి లగచర్లలో కూడా ఇలాగే పేద రైతుల భూములు లాక్కొని, వారినే జైలుకు పంపారని గుర్తుచేశారు. ఫోర్త్ సిటీ పేరుతో వందల ఎకరాల భూమిని బలవంతంగా లాక్కుంటున్నారని విమర్శించారు. భద్రాచలం జిల్లాలో ఆంధ్ర ప్రాంతం నుండి వలస వచ్చి, ఆదివాసి మహిళలను వివాహం చేసుకున్నట్లు నటించి వందల ఎకరాలు ఆక్రమిస్తే ప్రభుత్వం వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. గతంలో కేసిఆర్ ప్రభుత్వం పోడు రైతులకు పట్టాలిచ్చి ఆదివాసులను ఆదుకున్నారని, బిఆర్ఎస్ హయాంలో పోడు రైతులకు ఎలాంటి హాని జరగలేదని పేర్కొన్నారు. ధిందా రైతులకు న్యాయం చేయకపోతే, ప్రభుత్వానికి వ్యతిరేకంగా బిఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఆదిలాబాద్ ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఎందుకు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఒక పక్క బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తాం, సామాజిక న్యాయం పాటిస్తామని చెబుతూనే, మరో పక్క బిసిలు 400 కిలోమీటర్ల పాదయాత్ర చేస్తున్నా ప్రభుత్వం చలించడం లేదని, బిసిల మీద ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఎక్కుడుందని ప్రశ్నించారు. కేవలం ఏడు పులుల కోసం ఆలోచించే ప్రభుత్వం, మనుషుల జీవితాల గురించి ఎందుకు ఆలోచించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మనుషులకంటే పులులే ముఖ్యమా అని ప్రశ్నించారు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలనుకునే ప్రభుత్వం ముందు మనుషుల జీవితాల గురించి ఆలోచించాలని సూచించారు. దిందా ప్రజల డిమాండ్లను నెరవేర్చాలని, వారి భూములను వారికి అప్పగించి ఆదుకోవాలన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో లేనిది, ఒక్క దిందా గ్రామం పైనే ఎందుకింత కఠినంగా ఉండడానికి కారణం ఏంటని అడిగారు. మహిళలు, పురుషులు, వృద్ధులు, చిన్న పిల్లలను వదిలేసి పాదయాత్ర చేస్తున్నా ప్రభుత్వం చలించకపోవడం బాధాకరమన్నారు.

# కొత్త మహిళ సంఘాలను ఏర్పాటు చేయాలి



## రాయికల్ ఎంపిడిఓ చిరంజీవి

**నేటిసాక్షి, రాయికల్ :** గ్రామాల్లో నూతన మహిళ స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు విఓఎలు కృషి చేయాలని రాయికల్ ఎంపిడిఓ బింగి చిరంజీవి కోరారు. రాయికల్ లోని పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యం లో బుధవారం గ్రామ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, విఓఎ లకు మండల సమాఖ్య కార్యా లయం లో శిక్షణ కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక చేకూర్పుపథకంలో భాగంగా నూతన స్వయం సహాయక సంఘాలు, విభిన్న ప్రతిభా వంతుల సంఘాలు, వయోవృద్ధుల సంఘాలు, కిషోర బాలికల సంఘాల ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. బ్యాంక్ లింకేజి రుణాలను ఇప్పించాలని రికవరీ వందశాతం చేయాలని వివిధ ఆధాయాబివృద్ధి కార్యక్రమాలను ఎంటర్ ప్రైజెస్ లను నెలకొల్పి మహిళల్ని పారిశ్రామిక వేత్తలు గా తయారు చేసి పేదరికం నుండి బయటకు తీసుకురావాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంపిఓ సుష్మ, ఎస్బిఐ రాయికల్ మేనేజర్ పవన్, యుబిఐ మేనేజర్ వినయ్, ఎపిఎం నరహరి, మండల సమాఖ్య అధ్యక్షురాలు అంజలి. ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మావతి, గ్రామ సంఘ అధ్యక్షులు, కార్యదర్శులు , విఓఎ లు హాజరైయ్యారు

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

## దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సూచన

**నేటి సాక్షి, దేవరకద్ర ఆగస్టు 13 :** భారీ వర్షాల కారణంగా మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధు-సూదన్ రెడ్డి (జిఎంఆర్) సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా బుధవారం అధికారులను ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అప్రమత్తం చేశారు. ఊక చెట్టు వాగు, పెద్ద వాగుల వరద ప్రవాహం, ప్రస్తుత పరిస్థితిని సంబంధిత అధికారులు, ఆయా గ్రామాల రైతులను అడిగి తెలుసుకున్నారు. సరళసాగర్ కు వరద పెరిగి ఆటోమేటిక్ సైఫన్లు తెరుచుకోవడం తో దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం నాటికి పూర్తిస్థాయిలో కోయిల్ సాగర్ నిండి గేట్లు తెరిచే అవకాశం ఉన్నందున కోయిల్ సాగర్ పరిసర గ్రామాల ప్రజలు, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇండ్లలో నుండి బయటకు రావద్దని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సూచించారు.



# హాక రైతు ఫర్టిలైజర్ ప్రారంభం

## పేట ఎమ్మెల్యే చిట్టెం పర్నికా రెడ్డి



**నేటి సాక్షి, నారాయణపేట, ఆగస్టు 13 :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో హాక రైతు ఫర్టిలైజర్ కేంద్రంను నారాయణపేట నియోజకవర్గం ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. అనంతరం పేట ఎమ్మెల్యేకు శాలువాలతో కన్న సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ సూర్య మోహన్ రెడ్డికి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గొల్ల కృష్ణయ్య, మరికల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరన్న, మరికల్ పట్టణ అధ్యక్షులు హరీష్ కుమార్, నాయకులు, కాటేకొండ ఆంజనేయులు, రఘుపతి రెడ్డి, మోహన్ రెడ్డి, మాదారం మాజీ సర్పంచ్ దస్తప్ప, రాఘవేంద్ర, రామకృష్ణారెడ్డి, గోవర్ధన్, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో ఇద్దరికీ జీవిత ఖైదు

## జిల్లా ఎస్పీ శ్రీ కె.నారాయణ రెడ్డి,



**నేటి సాక్షి వికారాబాద్:** 2012 సంవత్సరంలో వికారాబాద్‌లో జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులకు వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా. ఎస్. శ్రీనివాస్ రెడ్డి బుధవారం జీవిత ఖైదు విధించారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ శ్రీ కె. నారాయణ రెడ్డి, తెలియజేయడం జరిగింది. ఇట్టి వివరాలు క్రింది విధంగా ఉన్నాయి. 2012 సంవత్సరంలో వికారాబాద్ పట్టణంలోని బీటీఎస్ కాలనీకి చెందిన మిర్యాల భాగ్యలక్ష్మిని ఆమె భర్త మిర్యాల రాజు మరియు అతని పెదనాన్న కుమారుడు మల్లేశం కలిసి దారుణంగా హత్య చేశారు. మిర్యాల రాజు జులాయిగా తిరుగుతూ, మద్యానికి బానిసయ్యాడు. తన సొంత ఇంటిని అమ్మాలని ప్రయత్నించగా, భార్య భాగ్యలక్ష్మి పిల్లల భవిష్యత్తు కోసం ఇంటిని అమ్మవద్దని అభ్యర్థించింది. దీంతో ఆగ్రహానికి గురైన రాజు, మల్లేశంతో కలిసి 29.05.2012న భాగ్యలక్ష్మి మెడకు కేబుల్ వైర్ చుట్టి హత్య చేశారు. ఈ ఘటనపై మృతురాలి తల్లి కుర్వ కిష్టమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వికారాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ లచ్చి రామ్ క్రైమ్ నంబర్ 143/2012, సెక్షన్ 302 ఐపీసీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు అనంతరం చార్జ్ షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాల ఆధారంగా గౌరవ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి డా. ఎస్. శ్రీనివాస్ రెడ్డి వాదోపవాదనలు విని, నిందితులు మిర్యాల రాజు, మల్లేశంలను దోషులుగా నిర్ధారించారు. నేరానికి పాల్పడిన ఇద్దరు నిందితులకు ఒక్కొక్కరికి జీవిత ఖైదుతో పాటు రూ. 5,000 జరిమానా విధిస్తూ ఈరోజు తుది తీర్పు వెలువరించారు. ఈ కేసులో సమర్థవంతమైన దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు, ప్రాసిక్యూషన్ అధికారులను జిల్లా ఎస్పీ శ్రీ కె. నారాయణ రెడ్డి అభినందించారు. ముఖ్యంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. సుధాకర్ రెడ్డి, మొదటి దర్యాప్తు అధికారి లచ్చిరామ్, అప్పటి ఎస్ఐ శ్రీనివాస్, ప్రస్తుత వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ప్రస్తుత వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ భీమ్ కుమార్, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ ఎల్. నరేందర్, లైజన్ ఆఫీసర్ బి. వీరన్న (ఎస్ఐ)లను ఆయన పేరు పేరునా ప్రశంసించారు. నేరస్థులకు శిక్ష పడినప్పుడు మాత్రమే న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

# మత్తడి దాటలేక పెళ్ళికొడుకు తప్పని తిప్పలు



**నేటి సాక్షి,గన్నేరువరం(బుర్ర అంజయ్య గౌడ్):** మండల కేంద్రంలోని గన్నేరువరం ఊర చెరువు మత్తడి ఎక్కువ అవడంతో రాకపోకలు నిలిచిపోయాయి దీనితో మండల కేంద్రంలో పెళ్లి మండపానికి చేరుకోవలసిన పెళ్లికొడుకు వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఎటు కదలలేని పరిస్థితి బంధువులు పెళ్ళి కొడుకును భుజాలపై మోసు కుంటూ అవతలి ఒడ్డుకు చేర్చి మరో వాహనంలో తీసుకెళ్లి వెళ్లారు. హై లెవెల్ కల్వర్టు సమస్యతో గన్నేరువరం మండల ప్రజలు ప్రతి సంవత్సరం ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..



# యువత, విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలి

- విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి
- ఎస్పీ శరత్ చంద్ర పవార్




**నేటిసాక్షి, నల్లగొండ :** యువత, విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. బుధవారం నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ఎన్ సి సి, ఎన్ ఎస్ ఎస్ విభాగాలు మరియు కళాశాల ఆంటీ డ్రగ్స్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్రగ్స్ తీసుకుంటే మన దేహంలో డోపమైన్ అనే రసాయన పదార్థం విడుదలయి ఎంతో సంతోషం కలుగుతుందని, దాని వల్ల ఒకసారి డ్రగ్స్ తీసుకున్న వ్యక్తి పదే పదే డ్రగ్స్ తీసుకుని ఆనంద డోలికల్లో తెలియాడాలని తహ తహలాడుతాడని అన్నారు. దాని వల్ల నరాల్లోని కణజాలం దెబ్బతింటుందని అన్నారు. గంజాయి, కోకైన్ లాంటి డ్రగ్స్ తీసుకోవడం వల్ల క్రమంగా భౌతిక స్పందనలు కలగవని తెలిపారు. ఒకసారి డ్రగ్స్ తీసుకుంటే ఇక జన్మలో మానలేరని అందుకే డ్రగ్స్ కు నో చెప్పాలని అన్నారు. స్నేహితులవల్ల, దగ్గరి వ్యక్తుల వల్లనే డ్రగ్స్ అలవాటు అవుతాయని అందుకే వాళ్లకు నో చెప్పడానికి వెనుకాడవద్దని అన్నారు. డ్రగ్స్ తీసుకున్నవారి జీవితం నాశనం అవుతుందని, వారిని ఎవరూ గౌరవించరని అన్నారు. డ్రగ్స్ తీసుకొని కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్ లో ఉద్యోగాలు కూడా రావనే విషయం యువత గమనించాలని అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ సహకరించాలని అన్నారు. మత్తు పదార్థాల బారిన పడకుండా మంచి లక్ష్యాన్ని ఏర్పర్చుకొని జీవితంలో అభివృద్ధి సాధించాలని సూచించారు. కష్టపడితే ఎలాంటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని అన్నారు. మీ పరిసరాల్లో ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నా, మిమ్మల్ని ఎవరైనా డ్రగ్స్ తీసుకోవాలని ఒత్తిడి చేసినా పోలీసుల దృష్టికి తీసుకు రావాలని అన్నారు. ఇవే కాకుండా విద్యార్థులకు సంబంధించిన ఎలాంటి సమస్యలనైనా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా. సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ, కళాశాలలో రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగు తున్నాయని, వీటిపైన పోలీసులు దృష్టి పెట్టాలని అన్నారు. కళాశాల మైదానంలో విద్యార్థులు ఎన్ సి సి, ఎన్ ఎస్ ఎస్ ద్వారా నేర్చుకున్న మంచి విషయాలను గ్రామాలకు చేరేలా చేసి గ్రామాలను చైతన్య పర్చాలని అన్నారు. డ్రగ్స్ ద్వారా సమాజం ఎలా దిగజారుతుందో తెలుసుకోవాలని అన్నారు. డ్రగ్స్ లేని జిల్లాగా మన జిల్లాను తీర్చిదిద్దడానికి విద్యార్థులు కృషి చేయాలని అన్నారు. అనంతరం విద్యార్థులతో ఆంటి డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ శివరామ్ రెడ్డి, సి ఐ. రాఘవరావు, ఎస్సై వై. సైదులు, ఆంటి డ్రగ్స్ కమిటీ కన్వీనర్ సుధాకర్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు డా. బొజ్జ అనిల్ కుమార్, డా. ఎ.మల్లేశం, వెంకట్ రెడ్డి, కోటయ్య, సావిత్రి, శివరాణి, ఇతర అధ్యాపకులు, ఎన్ సి సి కేడేట్స్, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**తహసిల్దార్ ముప్పుకృష్ణ**




**నేటి సాక్షి నల్లబెల్లి ప్రతినిధి ఆగస్టు 13 :** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు ఉన్నట్టు వాతావరణ శాఖ చెబుతుందని తాహసిల్దార్ ముప్పుకృష్ణ మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజుల నుండి భారీ వర్షాలు కురుస్తున్నాయి, మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలుపుతుంది. కావున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావొద్దని విద్యుత్ స్తంభాలు, వైర్లకు దూరంగా ఉండాలి, ప్రమాదకర ప్రదేశాలకు వెళ్ళకూడదు, ఎవ్వరూ కూడా చెరువుల దగ్గరకు చాపల వేటకు వెళ్లరాదని శిథిలావస్థలో ఉన్న గృహాలలో ఉండకూడదని సూచించారు. ఇట్టి విషయంలో అనుకోకుండా ఏదైనా ప్రమాదం సంభవిస్తే మీ యొక్క గ్రామానికి చేసిందిన గ్రామ పంచాయతీ సెక్రటరీకి, రెవెన్యూ సిబ్బందికి తెలియపరచగలరు అని కోరారు.

## భక్తిశ్రద్ధలతో భగవంతుని ఆరాధన

**అభయ ఆంజనేయస్వామికి ఘన స్వాగతం పలికిన తంగడపల్లి గ్రామస్తులు**




**నేటి సాక్షి ప్రతినిధి చేవెళ్ల ఆగస్టు 13 :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం చేవెళ్ల మండల పరిధిలోని తంగడపల్లి గ్రామంలో శ్రీ అభయ ఆంజనేయస్వామి వారి నూతన ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జి ఆర్ స్వామి వారి ఆధ్వర్యంలో నేటి నుండి 18 వ తారీకు వరకు ఈ మహోత్సవ కార్యక్రమం జరుగుతాయి మొదటి రోజు విగ్రహాలను మరియు ధ్వజ స్తంభాన్ని గ్రామంలో కళాకారుల బృందాలతో కేరళ వాయిద్యాలతో ఆటపాటలు తో భక్తిశ్రద్ధలతో విగ్రహాలను ఊరేగించారు. మాజీ సర్పంచ్ సత్తయ్య గౌడ్, రాములు గౌడ్ మాట్లాడుతూ. కేశవ ఆరాధన,పుణ్య ఆవచనం,రక్షబంధ అంకురారోపణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం రోజున మూల మంత్రాలతో హెూమ గుండాలను ఏర్పాటు చేసి జలదివనం పుణ్యా హారతి లాంటి కార్యక్రమాలు నిరంతరం జరుగుతూనే ఉంటాయి భక్తులందరూ అధిక సంఖ్యలో వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మనవి. ఈ కార్యక్రమంలోని గ్రామ పెద్దలు గ్రామ యువకులు మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

## తక్షణమే ఆదుకోండి సార్



**నేటి సాక్షి కొమరం భీమ్ ఆసిఫాబాద్ ప్రతినిధి ఆగస్టు 13 :** కొమురం భీం ఆసిఫాబాద్ పట్టణంలోని మజీద్‌వాడ ప్రాంతంలో గోడ కూలిన ఘటనను ఎమ్మార్వో రియాజ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ గజానంద్ ఆర్.ఐ సర్వర్ మరియు సిబ్బంది పరిశీలించారు. మజీద్‌వాడలో కూలీగా పనిచేస్తున్న ముత్తహీర్ షా ఇంటి ప్రహరీ గోడ కూలిపోవడంతో పాటు, సెప్టిక్ ట్యాంక్ వర్షపు నీటితో కొట్టుకుపోయింది. ప్రమాదం దృష్ట్యా అధికారులు ఆయనను ఇల్లు ఖాళీ చేయాలని సూచించారు. ముత్తహీర్ షా ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు

## 29.3 ఫీట్లకు చేరిన కోయిల్ సాగర్ నీటిమట్టం



**నేటి సాక్షి, దేవరకద్ర ఆగస్టు 13 :** మహబూబ్ నగర్ జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్ సాగర్ లో బుధవారం సాయంత్రం నాటికి నీటిమట్టం 29.3 ఫీట్లకు చేరింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టుల్లోకి పెద్ద ఎత్తున వరదనీరు వచ్చి చేరుతుంది. జూరాల నుండి కృష్ణా జలాలను కోయిల్ సాగర్ కు సరఫరా చేయడం నిలిపివేశారు. అయినప్పటికీ కోయిల్ సాగర్ లోకి వచ్చి చేరే వాగు ప్రవహిస్తుండడంతో ప్రాజెక్టుల్లో నీటిమట్టం క్రమేపీ పెరుగుతుంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు. నిండుగా నీరు వచ్చి చేరడంతో కోయిల్ సాగర్ నిండుకుండను తలపిస్తుంది.

## జాతీయ జెండా పాటను ఆవిష్కరన

**ఆవిష్కరించిన పేట జిల్లా విద్యాశాఖ అధికారి**




**నేటి సాక్షి, నారాయణపేట, ఆగస్టు 13 :** 79 వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా రూపొందించిన " జాతీయ జెండా ఆడియో పాటను గౌరవ నారాయణపేట జిల్లా విద్యాధికారి శ్రీ యం గోవిందరాజు డీఈఓ కార్యాలయంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ పాటను ప్రముఖ కవి రిటైర్డ్ జీహెచ్ఎం శ్రీ .దేవదానం రచించారు. ఈ పాటకు సంగీతాన్ని గన్నోజు నరసింహాచారి, హెచ్ఎం పి హెచ్ ఎస్ బాయ్స్ ధన్వాడ సమకూర్చడం జరిగింది.

**ఈ పాట ఇచ్చే సందేశం:**

ఓ త్రివర్ణ పతాకమా! నీవు ఎగురుతుంటే ఆకాశమే చిన్నబోతుంది. పింగళి వెంకయ్యగారు ఎంచుకున్న భావాలకు నింగిలోన సప్తవర్ణాలై ప్రకాశిస్తుంటే భారతీ-యులలో ఆనందం పొంగి పొరలుతుంది కూడుగూడు లేక జనం కుమిలి పోవలదంటు కులమతాల గొడవలతో కుత్సితాలు వీడమంటు ఇరుగు పొరుగు వారితో కరంకలిపి సాగమంటు తరగిపోని ప్రేమనింత జాతిలోన నింపమంటు అనే సందేశంతో ఈ పాట రాయబడింది. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఎంఓ విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు అశోక్ పాల్గొన్నారు.

## ఇందిర మహిళా శక్తి సమావేశం ఏర్పాటు



**నేటిసాక్షి (కె గంగాధర్)పెగడపల్లి :** ఇందిర మహిళ శక్తిలో భాగంగా పెగడపల్లి మండలంలోని జ్యోతి మండల సమైక్య కార్యాలయంలో అర్హులైన మహిళలను వృద్ధ మహిళలు దివ్యాంగులను మరియు కిషోర్ బాలికలను స్వయం సహాయక సంఘాలలో చేర్పించడం కోసం మండలంలోని 33 గ్రామ సంఘాల యొక్క ఆఫీసు బేరర్స్‌కు మరియు గ్రామ అసిస్టెంట్లకు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ శిక్షణ కార్యక్రమంని ఉద్దేశించి అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఏ రవివర్మ మాట్లాడుతూ గ్రామాలలో మిగిలిపోయినటువంటి 18 నుంచి 59 గల మహిళలను మరియు దివ్యాంగులను కిశోర బాలికలను వృద్ధ మహిళలను సర్వే చేసి స్వసక్తి సంఘాల లో 3-8 -25 లోపు ఏర్పాటు చేయాలని తెలిపారు ఈ కార్యక్రమానికి కమ్యూనిటీ కోఆర్డినేటర్లు రవికుమార్ తిరుపతి స్వామి శశికుమార్ మండల సమాఖ్య %వాదీ% రూపకల మమత రాధ మరియు వివోలు పాల్గొన్నారు

## రైలు ఢీకొని. ఒక వ్యక్తి మృతి ఇద్దరికీ తీవ్ర గాయాలు



**నీటి సాక్షి కొమరం భీమ్ ఆసిఫాబాద్ ప్రతినిధి ఆగస్టు 13 :** సిర్పూర్ టి కాగజ్నగర్ ఉదయం 5:40 గంటలకు షేక్ జంషెడ్ వయసు 44 సంవత్సరాలు రైల్వే కాంట్రాక్టు లేబర్ , ప్రవీణ్, మరియు సర్వేస్ అనే ముగ్గురు నైట్ పెట్రోలింగ్ చేస్తూండగా, ఆరెగూడ సమీపంలో డౌన్ లైన్ పై ఆపోజిషన్ డైరెక్షన్లో పెట్రోలింగ్ చేస్తూ వెళుచుండగా వెనుక వైపు నుండి అదే డౌన్ లైన్ పై గూడ్స్ ట్రైన్ రివర్స్ లో వచ్చి ఢీకొనగా షేక్ జంషెడ్ అక్కడికక్కడే మరణించినాడు,ప్రవీణ్ కు చెయ్యి విరిగినది, ప్రవీణ్ చికిత్స నిమిత్తము హైదరాబాద్ కు అంబులెన్స్ లో పంపరైనది ఇట్టిది కే సురేష్ గౌడ్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ కాగజ్నగర్ ఇన్వెస్టిగేషన్ చేస్తూ షేక్ జంషద్ మృతదేహానికి శ వా పంచానామా సేవ పరీక్షలు జరిపించిన అనంతరము దహన సంస్కారాల నిమిత్తం మృతిని భార్య అయిన సమీరా వేగం . మృతదేహాన్ని అప్పగించడమైనది

## గణేశ నవదుర్గా మండలి కార్యవర్గం ప్రమాణస్వీకారం



**నేటి సాక్షి, కోరుట్ల టౌన్ (గణేష్ గొల్లపల్లి) :** కోరుట్ల పట్టణంలోని త్రిశక్తి మాత దేవాలయంలో గణేశ నవదుర్గా మండలి కార్యవర్గం బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. ఎన్నికైన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి దగ్గుల నర్సయ్య ప్రమాణస్వీకారం చేయించారు. గణేశ నవదుర్గా మండలి అధ్యక్షులు కటుకం గణేష్ మాట్లాడుతూ అందరి సహకారంతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గౌరవ అధ్యక్షులు కట్ట నారాయణ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సభ్యులు సంఘ అభివృద్ధికి కృషి చేయాలని, అలాగే ఆలయ అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ శాయశక్తులా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గణేశ నవదుర్గా మండలి అధ్యక్షులు కటుకం గణేష్, ఉపాధ్యక్షులు ఎలిగేటి సుమన్, ప్రధాన కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మామిడిపల్లి రమేష్, కోశాధికారిగా అడువాల ప్రభాకర్, ఎన్నికల అధికారి దగ్గుల నర్సయ్య, సహాయ ఎన్నికల అధికారులు సంకు అశోక్, కటుకం గంగారాం, భోగ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మాట నిలబెట్టుకున్న బీఆర్ఎస్ నాయకుడు విగ్నేష్ గౌడ్



**నేటి సాక్షి ప్రతినిధి( ఏం సుధాకర్ గౌడ్ ) చేవెళ్ల న్యూస్ :** చేవెళ్ల నియోజకవర్గం: ఎడతెరిపి లేని వర్షాలతో చేవెళ్లలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎస్సి బాలుర వసతి గృహంలో వర్షపు నీరు నిల్వ ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సోషల్ మీడియాలో విషయం తెలిసిన బీఆర్ఎస్ నాయకుడు విగ్నేష్ గౌడ్ మంగళవారం అక్కడికి వెళ్లారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బుధవారం ఉదయం నుంచి స్వయంగా దగ్గరుండి పనులు చేయించారు. తన సొంత ఖర్చుతో మొరం పోయించి నీటి నిల్వ తొలగించారు. విద్యార్థులు సురక్షితంగా సంచరించేలా వాతావరణం కల్పించారు. ఇతర సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సౌకర్యం కోసం ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. అధికారులు, విద్యార్థులు ఆయన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. సత్వర స్పందన సేవాభావానికి నిదర్శనమని ప్రశంసించారు.

# బలవంతంగా నీటి బిల్లులు వసూలు చేస్తే ఊరుకోం



**నేటి సాక్షి జిన్నారం :** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో అధికారులు బలవంతంగా నీటి బిల్లులు వసూలు చేస్తే ఊరుకోమని, బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, అన్నారు.బొల్లారం తో పాటు పరిశ్రమలతో నీటి కలుషితం కావడం వల్ల మున్సిపాలిటీ పరిధిలోని నివసిస్తున్న ప్రజలకు ఉచితంగా మంచినీరు అందాలనే ఉద్యేశ్యం తో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఇటీవల హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై ఎండి అశోక్ కుమార్, ఐఏఎస్ ని కలిసి కోరడం జరిగింది.ఈ క్రమంలో ఎండీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ క్రమంలో బొల్లారం మున్సిపాలిటీ లో విధించిన నీటి పన్ను 17కోట్ల రూపాయలు ప్రజల నుండి వసూలు చేయకుండా చూడాలని తెలిపారు. కొంతమంది అధికారులు బొల్లారం మున్సిపాలిటీ లో ప్రజలకు ఉచిత మంచినీరు అందించ కుండా ప్రజలను నీటి మీటర్లు విధించి డబ్బులు వసూలు చేస్తున్నారని, తెలిపారు. బొల్లారం ప్రజలకు ఉచితంగా మంచినీరు అందే విధంగా బీజేపీ కృషి చేస్తుంది. ఒకవేళ నీటి మీటర్లు పెడితే బీజేపీ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాల్లో చేపట్టి వెంటనే తొలగించే ప్రక్రియ చేపడతామన్నారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా బీజేపీ వారికి అండగా ఉండి వారి పక్షాన పోరాడేందుకు సిద్ధంగా ఉ ందన్నారు.ఈ కార్యక్రమం లో బొల్లారం మున్సిపల్ బిజెపి ప్రెసిడెంట్ కేజీఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు టి రవీందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ అఖిల్, శ్రీకాంత్ చారి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు అరుణ్,బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులకు న్యాయ సేవలు అందించడమే లక్ష్యం

## భూమి సునీల్




**నేటి సాక్షి (భూమయ్య మెదక్ జిల్లా .కొల్చారం :** కొల్చారం, నర్సాపూర్, కౌడిపల్లి మండల కేంద్రాలలోని రైతు వేదికలలో ఆయా మండలాల తహసిల్దార్ లు శ్రీనివాసాచారి, శ్రీనివాస్, ల అధ్యక్షతన సాగు న్యాయ యాత్ర రైతు ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు భూమి సునీల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంటలు సాగు చేసే రైతులు విత్తనం వేసిన నాటి నుండి పంట చేతికొచ్చే మార్కెట్ కు తరలించే వరకు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేసిన చట్టాలను రైతులకు తెలియజేయడం ద్వారా చట్టం రైతులకు చుట్టంగా మారి లీఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సాగు న్యాయ యాత్ర కార్యక్రమం చేపట్టినట్లు భూమి సునీల్ అన్నారు.తినడానికి తిండి కోసం పంటలు పండించే దశ నుంచి మార్కెట్లో విక్రయించడం కోసం వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, రైతులు ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారం కోసం, సాగు విధానంలో వస్తున్న మార్పులకు తగ్గట్టుగా సాగు సాఫీగా సాగడం కోసం ప్రభుత్వం ఎన్నో చట్టాలు అమలు లోకి తీసుకు వచ్చింది అన్నారు. రైతులు చట్టాలను తెలుసుకొని వాటిని వినియోగించుకోగలిగితేనే రైతులు ముందుకు సాగే పరిస్థితులు వచ్చాయన్నారు. భూమి సమస్యలు ఉ త్పన్నమైనప్పుడు నాణ్యతలేని విత్తనాలు ఎరువులు పురుగు మందుల వల్ల నష్టం వాటిల్లినప్పుడు మార్కెట్ మోసాలు జరిగినప్పుడు పంటల బీమా అందనప్పు" ఇలా పలు సందర్భాల్లో రైతులకు చట్టాలతో అవసరం ఏర్పడుతుందన్నారు. గతంలో ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. మీ పాస్ పుస్తకం లో భూమి తక్కువగా నమోదైన సర్వేనెంబర్ మిస్సయిన పట్టాదారు పేరు ఇతర వివరాలు తప్పుగా రాసిన భూమి స్వభావం మారిన భూమి సంక్రమించిన విధానం తప్పుగా నమోదైన భూభారతి చట్టం సెక్షన్ 4(5) రూల్ నాలుగు ప్రకారం భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకొని మార్పులు నమోదు చేసుకోవచ్చని అన్నారు. తెలంగాణ సాగునీటి చట్టాలు తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి కార్పొరేషన్ చట్టం 1997 సాగునీటి నిర్వహణ చట్టం 1997 సాగర్ సాగునీటి వనరుల నియంత్రణ చట్టం 2009 చట్టాల ద్వారా సాగునీటి నిర్వహణ రాష్ట్రంలో జరుగుతుందన్నారు చెరువులను కాపాడుకోవాలని చెరువులను ఎవరైనా ఆక్రమిస్తే భూ ఆక్రమణ చట్టం 1905 కింద ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలపై రైతులకు అవగాహన కల్పించడం కోసం ఈ అవగాహన సదులు క్షేత్రస్థాయి పర్యటన రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బ్యాంకులకు రైతులు పంట రుణాలు ఇవ్వాలి పంట సాగులో రైతులు బ్యాంకు ద్వారా రుణాలు పొందవచ్చు అని ఆర్బిఐ ఆదేశాలను అనుసరించి బ్యాంకులు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు తెలంగాణ మనీ లీడర్స్ చట్టం 13 49 పసలేని అనుసరించి రుణాలు ఇవ్వాలని రైతులను వేధిస్తే చట్టంపైన పైన చర్యలు ఉంటాయని భూమి సునీల్ రైతులకు అవగాహన కల్పించారు చిన్న రైతుల రుణాల నుండి విముక్తి పొందడం కోసం తెలంగాణ రుణ విముక్తి చట్టం 2016 ప్రకారం రాష్ట్ర రుణ విముక్తి కమిషన్ను ఆశ్రయించవచ్చని ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. రైతులు సాగు చేసే పంటలకు బీమా చేసినప్పుడే రైతులకు ధీమా ఉంటుందని రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు భూమి సునీల్ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పంటల బీమా కోసం పథకాలు తీసుకోవచ్చి అమలు చేస్తున్నాయని రైతులకు కూడా ప్రీమియం చెల్లించి పంటల బీమా పొందవచ్చు అన్నారు. అకాల వర్షాలు కరువు పరిస్థితులు, తదితర కారణాల వల్ల పంట నష్టపోతే రైతులు బీమా పొందవచ్చు అన్నారు. ఈ సందర్భంగా భూమి రిజిస్ట్రేషన్ పట్టాదారు హక్కులు, చట్టపరమైన రక్షణ, భూ వివాదాల పరిష్కార మార్గాలపై విత్తన నష్టాల వల్ల తీసుకోవాల్సిన చట్టపరమైన చర్యలపై రైతులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ చైర్మన్ ఓ ఎస్ డి వెంకట హరిప్రసాద్, భూదాన్ బోర్డు మాజీ చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి, లీఫ్ సంస్థ న్యాయవాదులు, ప్రతినిధులు అభిలాష్ జీవన్ మల్లేష్ ప్రవీణ్ సందీప్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, నర్సాపూర్ పీఎసీఎస్ చైర్మన్ రాజు యాదవ్ మండల వ్యవసాయ అధికారులు శ్వేతా కుమారి,దీపిక ఆయా మండలాల ఏఈవోలు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు."

# నారాయణపేట ఆర్డీవోకు మాదాసి కురువల వినతి



**నేటి సాక్షి, నారాయణపేట, ఆగస్టు 13 :** కురువగా పిలవబడే మదాసి కురువలుఎస్సీ 57 ఉపకులాల ఆధ్వర్యంలో బుధవారము నారాయణపేట ఆర్డిఓ గారికి,వినతి పత్రం అందజేశారు. నారాయణపేట జిల్లా 57 కుల అధ్యక్షులు పొర్ల లింగప్ప మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాల లో మాదాసి కురువలు ఉన్నారని డిప్యుటీ కలెక్టర్ కే శ్రీను, ఆర్డీవో రామచంద్రనాయక్, అందజేశామని తెలియపరిచారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో కురువగా పిలవబడే ,మాదాసి కురువలు, నేషనల్ కమిషన్ షెడ్యూల్ క్యాస్ట్, కమిషన్ , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జీవో నెంబర్ 1268/2016 ప్రకారము, జీవో నెంబర్ 19/2023 ల ప్రకారం ,గతంలో మాన్యువల్ గా కురువ బిసి ధ్రువపత్రాలు ఎవరికైతే ఉందో వాళ్లందరికీ మాదాసి కురువ, మాదారి కురువ, ఎస్సీ కుల ధృవీకరణ పత్రం ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేయడమైనది అనే పోర్ల లింగప్ప తెలిపారు. కానీ ప్రస్తుతం ఉన్న అటువంటి 59 కులాలలో 57 కులాలు కలిసి కమిటీలను ఎన్నుకోవడం జరిగిందని కూడా తెలిపారు. కానీ మాదిగ, కులాలకు చెందిన వారు మాత్రము, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో మాదాసి కురువ/ మదారి కురువలు, లేరని మంగళవారం డిప్యూటీ కలెక్టర్ కు వినతిపత్రం ఇవ్వడం సిగ్గుచేటని హెచ్చరించారు. 57 ఉ పకులాల నారాయణపేట జిల్లా అధ్యక్షులు కుర్ల లింగప్ప మా దృష్టికి వచ్చిందని అన్నారు. ఇందుకు మేము మాదాసి కురు, మాదారి కురువలము, మాదిగలు ఇచ్చిన వినతిపత్రాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో మాదాసి కురువ, మదారి కురువలు, ఉన్నారని ఆర్డిఓ , డిప్యూటీ కలెక్టర్కు వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బదిగేల శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు మాదాసి కురువ బండారి మల్లేష్, మాదాసి కులరాచ భీమరాజు, తాలూకా అధ్యక్షులు, ఓబులాపురం అంజప్ప, ఉపాధ్యక్షులు జి నరసింహులు, ప్రధాన కార్యదర్శి వీరేష్, బి లింగం, తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్ ప్యానల్ ఏర్పాటు కోసం ప్రభుత్వ భవనాల పరిశీలన

## ఎంపీడీవో సుదర్శన్. విద్యుత్ శాఖ ఏఈ సాయినాథ్




**నేటి సాక్షి,నారాయణపేట ఆగస్టు 13 :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమం అయిన ప్రభుత్వ భవనాల పైన సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడం గురించి గౌరవ నారాయణపేట ఎంపీడీవో సుదర్శన్ గారు, విద్యుత్ శాఖ ఏఈ సాయినాథ్ నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం, జడ్.పి.హెచ్.ఎస్ ,ఎంపీపీస్ స్కూల్స్,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలను సందర్శించి సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు కోసం అంచనాలు తీసుకున్నారు..ఈ కార్యక్రమం లో గ్రామ కార్యదర్శి చాణక్య రెడ్డి గారు, పాఠశాలల ప్రధానో పాధ్యాయులు సునీత గారు, నసీరుద్దీన్ గారు, స్థానిక నాయకులు ఎడ్ల రాజు గారు, సౌడం సుధాకర్ గారు, స్థానిక పాత్రికేయులు, పంచాయతీ వర్కర్స్ నర్సింహులు,రామచందర్ మొదలైన వారు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## బిఆర్ఎస్ యువ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి



**నేటి సాక్షి, దేవరకద్ర ఆగస్టు 13 :** భారీ వర్షాలు కురు-స్తున్న నేపథ్యంలో మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దేవరకద్ర నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి సూచించారు. విద్యుత్ వైర్లు,స్థంబాల వద్దకు వెళ్లరాదని ఆయన సూచించారు. వాగుల వద్దకు వెళ్ల రాదన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇంట నుండి బయటకు రావద్దని మందడి సరోజ్ రెడ్డి సూచించారు.

# భారీ వర్షాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## :సబ్ కలెక్టర్ మనోజ్



**నేటి సాక్షి,వేమనపల్లి :** రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉ న్నందున ప్రజలు,అధికారులు అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ తెలిపారు.బుధవారం ఆయన వేమనపల్లి మండలంలో పర్యటించి నీల్వాయి ప్రాజెక్టును సందర్శించి వరద పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.భూ భారతిలో మండలంలో దరఖాస్తులు ఎన్ని వచ్చాయి.వాటిలో ఎన్నింటివి పరిష్కరించారని ఆరా తీశారు.ఆయా గ్రామాల్లో పెండింగ్ సమస్యలపై విచారణ చేపట్టి పరిష్కరించాలని సూచించారు.వీరితో ఎంపిడిఓ కుమారస్వామి,నాయబ్ తహసీల్దారు సాయి కృష్ణ,ఆర్ఐ ఖాలిక్,రెవిన్యూ సిబ్బంది,ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

# తెలంగాణకు వాన గండం!

## మహేశ్వరం నియోజకవర్గం ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## సమతా ప్రకాష్



**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం ఆగస్టు 13:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం లోని భారీ వర్షాల కారణంగా పలు లోతట్టు ప్రాంతాలలో.. ఇప్పటికే భారీ వర్షం కురుస్తున్న సందర్భంగా.. చెరువులో కుంటలు అన్ని నిండి పొర్లుతున్న సందర్భంగా.. అత్యవసరమైతేనే బయటికి రావాలంటూ.. లేదంటే బయటకి ఎటు పరిస్థితిలో రావద్దు.. విద్యుత్ స్తంభాలు దగ్గరికి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.. పిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అలాగే ఇంట్లో ఉన్న పెద్దలు ఎవరైతే ఉంటారో వాళ్ళ పైన ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలి ఇంకా మూడు నాలుగు రోజులు మన తెలంగాణకు వాన గండం పొంచి ఉన్న సందర్భంగా పలు జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా.. నియోజకవర్గంలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని.. ఎటు పరిస్థితిలో చెట్ల కింద ఉండకూడదు.. ఎవరైనా ఆపదలో ఉంటే మాత్రం వెంటనే కార్యకర్తలు స్పందించాలి.. మహిళ నాయకురాలు సైతం మండల కేంద్రాలలో.. ప్రతి ఒక్కరూ గ్రామాలలో ఉన్న సమస్యలు తెలుసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ఎప్పుడూ.. ప్రజలలో ఉండాలని సమత ప్రకాష్ తెలియజేశారు

# నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి

## యూత్ ఉపాధ్యక్షుడు శ్రీధర్ గృహ ప్రవేశానికి హాజరైన సబితా ఇంద్రారెడ్డి



**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం ఆగస్టు 13:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూర్ మండల పరిధిలోని నేదునూర్ గ్రామంలో కందుకూర్ మండల బీఆర్ఎస్ పార్టీ యూత్ ఉపాధ్యక్షుడు నల్లి శ్రీధర్ ముదిరాజ్ నూతన గృహ ప్రవేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు లిపి.సబితా ఇంద్రారెడ్డి హాజరై వ్రత తీర్థ ప్రసాదాలు స్వీకరించి శ్రీధర్ కుటుంబ సభ్యులకు శు భాకాంక్షలు తెలియజేశారు... వారితో పాటు స్థానిక తాజా మాజీ సర్పంచ్ కాసుల రామకృష్ణ రెడ్డి , పిఏసిఎస్ చైర్మన్ చంద్రశేఖర్,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురసాని సురేందర్ రెడ్డ డిసిసిబి డైరెక్టర్ పొట్టి ఆనంద్,లేమూర్ మాజీ సర్పంచ్ గణేష్, మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్ రెడ్డి,సీనియర్ నాయకుడు లచ్యా నాయక్,నవీన్ కుమార్ తదితరులు ఉన్నారు..

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..



గురువారం
14 ఆగస్టు 2025

# తరుముకొస్తున్న 'ఎన్నికల-మేఘాలు'.!!




- ఈనెలలోనే స్థానిక ఎన్నికల షెడ్యూల్.?
- బిసి రిజర్వేషన్లపై సీఎం రేవంత్ కీలక నిర్ణయం
- తరుముకొస్తున్న హైకోర్టు గడువు
- కేంద్ర నిధుల కోల్పోతామన్న భయం
- వేగం పెంచిన తెలంగాణ ప్రభుత్వం
- రిజర్వేషన్ల ఖరారుకు డెడ్‌లైన్
- సెప్టెంబర్ మొదట్లో పోలింగ్, అక్టోబర్‌లో సర్పంచ్ ఎన్నికలు.?

**నేటి సాక్షి %-% కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** రాష్ట్ర రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల అంశం హాట్ టాపిక్‌గా మారింది. హైకోర్టు ఇచ్చిన సెప్టెంబర్ 30 గడువు, కేంద్రం నుంచి రావాల్సిన సుమారు ₹3,000 కోట్ల పంచాయతీ రాజ్ నిధులు కోల్పోయే ప్రమాదం ఈ రెండు అంశాలు ప్రభుత్వం వేగంగా కదలడానికి ప్రధాన కారణాలుగా మారాయని తెలుస్తోంది.

### అత్యవసర సమీక్ష - కీలక సమావేశాలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించనున్నారని సమాచారం. ఇందులో ఎన్నికల ఏర్పాట్లు, రిజర్వేషన్ ప్రక్రియ పురోగతి, మరియు న్యాయపరమైన సవాళ్లపై చర్చ జరగనుంది. ఇందులో భాగంగానే ఆగస్టు 18న కేబినెట్ సమావేశం ఏర్పాటు చేయబడింది. ఈ సమావేశంలో స్థానిక ఎన్నికల షెడ్యూల్ తుది నిర్ణయంతో పాటు బిసి లకు 42% రిజర్వేషన్ అమలు అంశం పై కూడా చర్చించనున్నారు. ఈ నిర్ణయం రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ఆయుధం కానుంది.

### రిజర్వేషన్ షెడ్యూల్ -ఖచ్చితమైన ప్రణాళిక

లి ప్రభుత్వ వర్గాల ఆలోచనల ప్రకారం ఆగస్టు 20లోపు జడ్పీ చైర్మన్, జడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లు ఖరారు ఆగస్టు 22లోపు ఎంపీటీసీ రిజర్వేషన్లు ప్రకటింపు ఆగస్టు 25 లేదా 28న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం సెప్టెంబర్ 1,2 వారంలో పోలింగ్ అక్టోబర్‌లో సర్పంచ్ ఎన్నికలు ప్రణాళికను అనుసరించి రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా తన సిబ్బంది, సెక్యూరిటీ ఏర్పాట్లు, పోలింగ్ సెంటర్ జాబితాలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. బిసి రిజర్వేషన్ రాజకీయ వ్యూహంఇటీవల కేబినెట్ సమావేశంలో బిసిలకు స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్ మంజూరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం బిసి వర్గాల మద్దతు పొందడానికి దోహదపడుతుందని కాంగ్రెస్ లెక్కలు వేస్తోంది. కానీ, ప్రతిపక్షాలు ఈ నిర్ణయం చట్టబద్ధతను సవాలు చేసే అవకాశం ఉన్నందున, ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియను వేగంగా ముందుకు నెడదామనుకుంటోందని తెలుస్తోంది.

### కేంద్ర నిధుల ఒత్తిడి కూడా..

హైకోర్టు గడువు ముగిసేలోపు ఎన్నికలు పూర్తి చేయకపోతే, పంచాయతీ రాజ్ వ్యవస్థకు సంబంధించి కేంద్రం నుంచి విడుదలయ్యే రూ.3,000 కోట్ల గ్రాంటులు ఆగిపోతాయి. ఇప్పటికే గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ నిధుల అవసరం ప్రభుత్వం ముందు అత్యవసర అంశంగా మారింది. రాజకీయ సమీకరణలు ప్రతిపక్ష సవాళ్లు స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ఇతర పార్టీలు కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. కేడర్ బలోపేతం, అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు వేగంగా అమలు చేయాల్సిన దశలో ఉన్నాయి. బిసి రిజర్వేషన్ అంశం కాంగ్రెస్‌కు ఒక పాజిటివ్ ఇమేజ్ ఇస్తుందని భావిస్తున్నా, ప్రతిపక్షాల నుండి ఈ నిర్ణయంపై తీవ్ర విమర్శలు ఎదురయ్యే అవకాశం ఉంది. తరుముకొస్తున్న ఎన్నికల మేఘాలు హైకోర్టు డెడ్‌లైన్, కేంద్ర నిధుల ఆవశ్యకత, మరియు రాజకీయ లెక్కలు అన్నీ కలిపి ఈనెల చివరిలోపు స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడం దాదాపు ఖాయమని సంకేతాలు స్పష్టంగా చెబుతున్నాయి. రిజర్వేషన్ జాబితాలు ఖరారైన వెంటనే ఎన్నికల మూడ్ రాష్ట్రాన్ని కప్పేసేలా కనిపిస్తోంది.!

# నూతన రైస్ మిల్ ప్రారంభం

**నేటి సాక్షి,నారాయణపేట, ఆగస్టు 13 :** నారాయణపేట జిల్లాలోని మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన రామలింగం గారి అమ్మ రైస్ మిల్ ను తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ అభివృద్ధి, క్రీడలు, యువజన సేవలు మరియు మత్స్యశాఖ మంత్రివర్యులు డా. వాకిటి శ్రీహరి గారు నేడు ఘనంగా ప్రారంభించారు. అనంతరం సాలువులతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

# ధన్వాడలో వర్షం

### బీసీ కాలనీలో ఇండ్ల మధ్య వర్షం నీరు



**నేటి సాక్షి,నారాయణపేట, ఆగస్టు 13 :** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల కేంద్రంలో బుధవారం కురిసిన వర్షానికి బీసీ కాలనీలో ఇండ్ల మధ్య నీళ్లు చేరాయని నారాయణపేట సిపిఐ జిల్లా నాయకులు పి వెంకటేష్ తెలిపారు. మండల అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని తన్వాడ బీసీ కాలనీ ప్రజలు కోరుతున్నారని ఆయన వివరించారు.

# స్వాతంత్ర వేడుకల ఏర్పాట్ల పరిశీలన

### పేట జిల్లా ఎస్పీ



**నేటి సాక్షి,నారాయణపేట, ఆగస్టు 13, :** ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవం సందర్భంగా నారాయణపేట జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో స్వతంత్ర వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ గారు పరిశీలించారు. రానున్న రెండు రోజులలో బారి వర్షాలు ఉన్నందున స్వతంత్ర దినోత్సవ వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా రెవెన్యూ అధికారులతో కలిసి తగు ఏర్పాట్లను చేయాలని, పరేడ్ మైదానంలో సాయుధ పోలీసుల కవాతును బాగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. వేడుకలను తిలకించడానికి వచ్చే అతిథులకు, విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఎస్పీ తెలిపారు. ఎస్పీ గారితో పాటు అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, నరసింహ,లు ఉన్నారు.

# ముంపు ప్రాంతాలలో పర్యటించిన మాజీ కార్పొరేటర్

### యాతం పవన్ కుమార్ యాదవ్



**నేటి సాక్షి ప్రతినిధి శంషాబాద్ ఆగస్టు 13 :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మామిడిపల్లి బాలాజీ నగర్ లో వరద ముంపు బాధితులను పరామర్శిస్తున్న మాజీ కార్పొరేటర్ యాతం పవన్ కుమార్ యాదవ్. 72 గంటల్లో భారీ వర్షాలు ఉన్నందున ప్రజలు ఎవరు కూడా బయటకు రావద్దని అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. శిథిలావస్థలో ఉన్నటువంటి ఇళ్లలో ఉండకూడదు. ప్రభుత్వం ముంపు ప్రాంతాలను గుర్తించి సహాయ మరియు, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు

# కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలి

- కోతులు బాబోయ్ కోతులు.
- కోతుల బెడద వల్ల వ్యవసాయ రంగానికి రక్షణ లేకుండా పోయింది
- రోడ్లపైకి వెళ్ళుటకు జంకుతున్న ప్రజలు
- పాఠశాలకు వెళ్లడానికి భయపడుతున్న విద్యార్థులు



**నేటి సాక్షి (భూమయ్య )మెదక్ జిల్లా. కొల్చారం :** కొల్చారం మండల వ్యాప్తంగా కోతులు జనవాసాలలోకి గుంపులు, గుంపులుగా ఇండ్లలోకి ప్రవేశించి ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తున్నాయి.కోతుల బెడద రోజురోజుకు పెరిగిపోతుంది. ఆకలితో అలమటిస్తూ, అడవులను వదిలేసి గ్రామాల్లో ప్రజలపై దాడులు చేస్తున్నాయి. కోతుల దాడుల లో గాయపడిన వారి సంఖ్య రోజురోజుకు పెరిగి పోతున్నాయి. గ్రామాల్లో ఇంటి తలుపులు వేయడం మర్చిపోతే ఇక అంతే సంగతులు కోతులు ఇంట్లోకి ప్రవేశించి వంట సామాగ్రి, దుస్తులు, ఆహార పదార్థాలు చిందర-వందర చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయి. తమ అవసరాల కోసం ప్రజలు రోడ్లపైకి వెళ్లడానికి జంకుతున్నారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి భయ పడుతున్నారు. వసతి గృహాలలో ఉన్న విద్యార్థినీ, విద్యార్థులు కోతుల బారినపడి గాయాలైన సందర్భాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బెడద వల్ల మండల వ్యాప్తంగా రైతాంగానికి, వ్యవసాయ రంగానికి రక్షణ లేకుండా పోయింది. కోతులు ఆగం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి రక్షించాలని కొల్చారం మండలం వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



### వామపక్షాల ఆధ్వర్యంలో ప్రధాని దిష్టిబొమ్మ దగ్ధం

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పుకొట్టాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు డబ్బికార్ మల్లేష్ జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వస్కుల మట్టయ్య, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా నాయకులు జిల్లా కనకయ్య పిలుపునిచ్చారు. వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అమెరికా విధించిన 25%, 50% సుంకాలను వ్యతిరేకించాలనీ, వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన చట్రం, కొత్త జాతీయ సహకార విధానాన్ని రద్దు చేయాలన్నారు అన్ని పంటలకు కనీస మద్దతు ధర సీ2ం50% ఫార్ములాపై నిర్ణయించాకానీ, కొనుగోలుకు హామీ ఇవ్వడానికి ఒక చట్టాన్ని రూపొందించాలన్నారు. రైతులకు సమగ్ర రుణ మాఫీ చట్టం చేయాలన్నారు. మైక్రోఫైనాన్స్ కంపెనీలు చేస్తున్న వేధింపులను ఆపాలని, విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించడం, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిషేధించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లులను మాఫీ చేస్తూనే, గ్రామీణ ప్రాంతాలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్రామీణ ప్రాంతాలకు రోజుకు 24 గంటల విద్యుత్ అందించాలన్నారు. 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని, నెలకు రూ. 10 వేలుగా అన్ని ప్రభుత్వ పెన్షన్‌లను చేయాలన్నారు. పెన్షన్ (వృద్ధాప్యం, వితంతువు, వికలాంగులు) ను ఒక చట్టం చేయడం ద్వారా ప్రాథమిక హక్కుగా చేయాలన్నారు. అటవీ హక్కుల చట్టం 2006ను అమలు చేయాలి. గిరిజనులు, ఇతర అటవీ నివాసుల నిర్వాసితులను ఆపాలన్నారు. అధిక వర్షం, నీటి ఎద్దడి కారణంగా ఖరీఫ్ పంటల నష్టాన్ని వెంటనే సర్వే చేసి రైతులకు సరైన పరిహారం అందించాలి. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు రవి నాయక్, గోవింద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పిల్లుట్ల సైదులు, ఊర్మిల, వెంకట్ రెడ్డి, జిల్లంలా శ్రీనివాస్ రెడ్డి, వస్కుల సైదమ్మ, కాశి, చిరుమల బిక్షం, వాడపల్లి రమేష్, మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసరం అయితే తప్ప బయటికి వెళ్ళకూడదు

### గ్రామీణ ఎస్సై లక్ష్మయ్య.

**నేటి సాక్షి మిర్యాలగూడ రూరల్ ఆగస్టు 13 :** ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాగులు, కాలువలు ఉదృతంగా ప్రహిస్తున్నాయని అలాంటి సమయంలో ఎవరూ కూడా దాటే ప్రయత్నం చేయకూడదని, అత్యవసరం అయితే తప్ప ఎవరూ బయటికి వెళ్ళకూడదని మిర్యాలగూడ గ్రామీణ ఎస్సై లక్ష్మయ్య అన్నారు. పాడుబడిన మిద్దెలు, పడిపోయే స్థితిలో ఉన్న ఇళ్లల్లో, చెట్లకింద, వాగులవద్ద ఉండవద్దని సూచించారు. వచ్చే రెండు రోజులు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా ఇబ్బందులు కలిగితే వెంటనే 100 డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో రైతులు పొలాల్లోకి వెళ్లి వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ మోటార్ల వద్దకు వెళ్లి స్విచ్ ఆన్ చేయవద్దని, రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్ల పక్కన వున్న విద్యుత్ స్తంభాలు పట్టుకుంటే విద్యుత్ షాక్ కొట్టే ప్రమాదం ఉందని అప్రమత్తంగా ఉండాలని అదేవిధంగా లావుడి తాండ రామన్నపేట వాగు మరియు తడకమళ్ళ గ్రామ శివారులోని పిల్లవాగు వరద ఉదృతంగా ప్రవహిస్తున్నందున అటువైపు ఎవరు నడవకుండా మోటార్ సైకిల్ పైన వెళ్లేటటువంటి వాహనదారులు ప్రజలు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు.

